






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 44 | ఆదివారం | 02-08-2026 | హైదరాబాద్ | Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00





09

## బాక్సింగ్‌లో భారత్‌కు పాంచ్ పటాకా


కామన్వెల్త్ క్రీడల్లో బాక్సింగ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా, సాక్షి చౌదరి, ప్రియా ఘంఘూస్, అరుందతీ చౌదరి


ఆపరేషన్ ముస్కాన్‌లో 6,307 మంది చిన్నారుల విముక్తి 12


## ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగానే

# నీటి నిల్వలు

- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో ఎల్లంపల్లి అంతర్భాగం
- కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాల వల్లే సమస్యలు
- గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయి
- అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణ
- నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ వెల్లడి
- మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరితో కలిసి ఎల్లంపల్లి, కడెం, ఎస్ఆర్ఎస్‌పి సందర్శన


ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు వద్ద

ప్రజాపక్షం/అంతర్గాం/ నిర్మల్ / ఖానాపూర్/ముప్కాల్

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో అంతర్భాంగా ఎల్లంపల్లి రిజర్వాయర్ ఉండేదని, ఇక్కడి నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేయడం సరికాదని కాదని రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్, నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు, నిజామాబాద్ జిల్లాలోని ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టును మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుతో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ పరిశీలిన సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాల వల్లే సమస్యలు తలెత్తాయని విమర్శలు చేశారు. మేడిగడ్డ బ్యారేజ్, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు, ఎల్లంపల్లి ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డిఎస్‌ఎ) కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని లిఖితపూర్వకంగా సూచించిందని తెలిపారు.ఇటీవల జరిగిన సాంకేతిక తరువాయి 8లో




చెరువుల పునరుజ్జీవంతో

## మారిన మహానగర రూపు

ప్రజాపక్షం/హైదరాబాద్

'చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం నాకెంతో సంతృప్తినిచ్చింది' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూ మన చెరువులకు జీవం పోస్తూ భావి తరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును అంకితం తరువాయి 8లో

# అల్లూరి విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేట్‌వే

- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభ సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- ఎపిలో రూ.18 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



**విశాఖపట్నం :** ఎపిలోని ఉత్తరాంధ్ర జిల్లాలకు గేట్ వే గా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందని, రాష్ట్ర అభివృద్ధికి, స్వర్ణాంధ్ర విజన్ సాకారానికి ఇది ముఖ్యమైన రోజని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ విమానాశ్రయం ప్రారంభోత్సవం సహా మొత్తంగా రూ.18 వేల కోట్ల విలువైన వివిధ అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అభివద్ధిలో రికార్డులు సాధించడమే కాదు, తరువాయి 8లో






క్షమించడం కాదు.. విద్యార్థులకు

# క్షమాపణలు చెప్పాలి

- ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్‌గాంధీ ఫైర్
- తమిళనాడులో ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు పరామర్శ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరో సారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యార్థులకు మోదీ 'క్షమాపణలు' చెప్పాలని, అంతేకానీ వారిని 'క్షమించడం' కాదని వ్యాఖ్యానించారు. విద్యార్థులతో నిజాయితీగా ఉండని వ్యవస్థలో, విద్యార్థులను నిజాయితీగా పనిచేయమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమిళనాడులోని మామల్లపురంలో నీట్ సంబంధిత ఆత్మహత్యల కారణంగా తమ వారిని కోల్పోయిన తరువాయి 12లో


# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం



- ఫాస్ట్‌ట్రాక్ విచారణతో వివరాలు బట్టబయలు
- నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమినీ చేర్చలేదు : మంత్రి పొంగులేటి


ప్రజాపక్షం/హైదరాబాద్

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. సచివాలయంలో శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో విచారిస్తున్నామని, అక్రమార్కులెవరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా భారీ స్థాయిలో అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని, వీటిపై ఆధారాలతో సహా విచారణ కొనసాగుతోందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఒక్క తరువాయి 12లో






## జనాభా లెక్కలు సరైనవేనా?



భూమిపై మనం భావిస్తున్నదానికంటే ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారేమోనని ఒక కొత్త అధ్యయనం సూచిస్తోంది. ఫిన్లాండ్‌లోని ఆల్టో యూనివర్సిటీ పరిశోధకులు 1975 నుంచి 2010 వరకు 35 దేశాల్లో జరిగిన 300 గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టుల సమాచారాన్ని విశ్లేషించారు. గ్రామీణ ప్రాంతాల జనాభాను అధికారి క లెక్కలు 84 శాతం వరకు తక్కువగా చూపించి ఉండవచ్చని ఈ పరిశోధన వెల్లడించింది. శాటిలైట్ చిత్రాలు, నమూనా ఆధారిత అంచనాలపై ఆధారపడటం వల్ల మారుమూల గ్రామాల జనాభా సరిగా నమోదుకాకపోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ప్రపంచ జనాభా వాస్తవంగా బిలియన్ల మేర పెరిగి ఉంటుందనే వాదనపై కొంతమంది నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతు న్న జనభా లెక్కల సేకరణ సరైన దిశగా ముందుకు వెళ్లడం లేదని, పూర్తి సమాచారం అందడం లేదన్న వాదనలు కూడా ఉన్నాయి.

## 116 సంవత్సరాల తర్వాత...



పుస్తకం వేరొకరి చేతికి వెళితే మళ్లీ తిరిగి రాదనే సామెత అందరికీ తెలిసిందే. అయితే, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లో ఒ'సలీవాన్ ఒవెన్ అనే వ్యక్తి తన ఇంట్లో ఉన్న పురాతన పుస్తకాన్ని భద్రంగా దాని గమ్యస్థానానికి చేర్చాడు. వివరాల్లోకి వెళితే, వాల్టర్ గ్రిఫిత్ ఒవెన్ అనే వ్యక్తి 'ఫ్లాన్‌రూస్ట్' లైబ్రరీ నుంచి 1910లో ఒక పుస్తకాన్ని తీసుకున్నాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో వలంటీర్‌గా, రెండో ప్రపంచ యుద్ధంలో కాన్వే లోని మెల్బరీ హార్బర్‌లో అధికారిగా పనిచేసిన గ్రిఫిత్, తాను తీసుకున్న పుస్తకాన్ని లైబ్రరీకి తిరిగి ఇవ్వలేకపోయాడు. కాలం గడిచిపోయింది. ఆ కుటుంబంలోని వారంతా ఈ విషయాన్ని మరచిపోయారు. గ్రిఫిత్ మనవడు ఒ'సలీవాన్ ఇటీవలే ఆ పుస్తకాన్ని గుర్తించి, ఫ్లాన్‌రూస్ట్ లైబ్రరీలో దానిని అప్పగించాడు. అంటే ఆ పుస్తకం 116 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత తన గమ్యాన్ని చేరింది.

## కారు సీటుగా మారిన స్మగ్లర్



సరిహద్దు అధికారులు ఎదుర్కొన్న అత్యంత విచిత్రమైన స్మగ్లింగ్ ప్రయత్నాల్లో ఇది ఒకటి. 2001లో, అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం, శాన్‌డియాగోలో ఉన్న శాన్ సిడ్రో పోర్ట్ ఆఫ్ ఎంట్రీలో చోటు చేసుకున్న ఈ ఘటనలో, మెక్సికో నుంచి ఒక వ్యక్తి కారులోని సీటులా కనిపించేలా తనను తాను మార్చుకుని, అమెరికా–మెక్సికో సరిహద్దు దాటేందుకు ప్రయత్నించాడు. ప్యాడింగ్, సీటు కవర్లు, కారు అలంకరణ సామగ్రితో తన శరీరాన్ని పూర్తిగా కప్పుకుని, సాధారణ కార్ సీటులో భాగంలా కనిపించాలని ప్రయత్నించాడు. అధికారులు తనను అదనపు సీటు గా భావిస్తారని అతడు ఆశించాడు. అయితే ఈ వింత ప్రయత్నం ఎక్కువసేపు దాచబడలేదు. సీటు భాగంలో కనిపించిన స్వల్ప కదలికలు అధికారులకు అనుమానం కలిగించాయి. పరిశీలించగా, అది సాధారణ సీటు కాదని, అందులో ఒక మనిషి దాక్కున్నాడని గుర్తించారు. ఈ సంఘటన అప్పట్లో విస్తృతంగా ప్రచారం పొందింది. అసాధారణమైన ఆలోచనతో చేసినప్పటికీ, మానవ శరీరాన్ని ఒక వస్తువులా దాచే ప్రయత్నం ఎంత ప్రమాదకరమో ఇది చూపించింది. చట్టవిరుద్ధంగా సరిహద్దులు దాటేందుకు కొందరు ఎంత విచిత్రమైన మార్గాలను అన్వేషిస్తారో చెప్పే ఉదాహరణగా ఈ ఘటన గుర్తుండిపోయింది.

## 'స్మార్ట్' వీధి దీపాలు



కెన్యాలో సాధారణ వీధి దీపాలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చే కొత్త విధానం అమలవుతోంది. సౌరశక్తితో పనిచేసే ఈ స్మార్ట్ ల్యాంప్‌పోస్టులు పగటిపూట సూర్య కాంతిని నిల్వ చేసుకుని, రాత్రివేళ ఎల్‌ఇడి వెలుగును అందిస్తాయి. అంతేకాకుండా కొన్ని ల్యాంప్‌పోస్టులు ఉచిత వై–ఫై సదుపాయాన్ని కూడా అందిస్తున్నాయి. విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యా లు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇవి ప్రజల జీవితాలను మార్చుతున్నాయి. విద్యార్థులు రాత్రివేళ సురక్షితమైన వెలుగులో చదువుకోవచ్చు, ఆన్‌లైన్ విద్యా వనరులను పొందవచ్చు. చిన్న వ్యాపారులు డిజిటల్ చెల్లింపులు నిర్వహించగలుగుతున్నారు. సోలార్ ప్యానెల్స్ సేకరించిన శక్తిని చిన్న బ్యాటరీల్లో నిల్వచేసి, ల్యాంప్‌తో పాటు వై–ఫై రౌటర్లకు ఉపయోగిస్తున్నారు. కొన్ని నమూనాల్లో మొబైల్ ఛార్జింగ్ సదుపాయాలు కూడా ఉన్నాయి. ఈ సాంకేతికత పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు డిజిటల్ చేరువను పెంచుతోంది. కెన్యాలో వీధి దీపాలు ఇప్పుడు కేవలం వెలుగు ఇవ్వడం మాత్రమే కాదు, జ్ఞానానికి మార్గదర్శకంగా మారుతున్నాయి.

## లక్షల సంవత్సరాల నాటి గొడ్డలి..



బ్రిటన్‌లోని కెంట్ ప్రాంతంలో మంచుయుగం నాటి ఒక పురావస్తు స్థలంలో పురావస్తు శాస్త్రవేత్తలు 800కు పైగా చరిత్రపూర్వ రాతి పనిముట్లు గుర్తించారు. వాటిలో అత్యంత విశేషమైనది సుమారు 12 అంగుళాల (30సెంటీమీటర్లు) పొడవున్న భారీ చెకుముకి రాయి (ఫ్లింట్)తో తయారైన చేతి గొడ్డలి. దీని వయస్సు మూడు లక్షల సంవత్సరాలకు పైగా ఉందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఈ పనిముట్టును లోయర్ పాలియోలిథిక్ కాలంలో తయారు చేశారు. ఇది ఆదిమానవ చరిత్రలో అత్యంత ప్రాచీన దశ. ఆ సమయంలో ఆధునిక మానవులు (హోమో సేపియన్స్) ఇంకా ఆవిర్భవించలేదు. హోమో హైడెల్‌బెర్గెన్సిస్ (లేదా తొలి నియాండర్తల్ పూర్వీకులు) వంటి మానవ జాతులు యూరప్‌లో నివసించేవి. ఈ చేతి గొడ్డలి బ్రిటన్‌లో ఇప్పటివరకు లభించిన అతిపెద్ద రాతి పనిముట్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. సాధారణంగా ఇలాంటి చేతి గొడ్డళ్లు 10 నుంచి 20 సెంటీమీటర్ల పొడవు మాత్రమే ఉంటాయి. కానీ ఈ గొడ్డలి దాదాపు 30 సెంటీమీటర్ల పొడవుతో, ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భారీ పనిముట్టును ఏ ప్రయోజనం కోసం ఉపయోగించారనే విషయంలో శాస్త్రవేత్తలు రెండు ప్రధాన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొదటిది, ఆ కాలంలో జీవించిన ఏనుగులు, ఖడ్గమృగాలు లేదా అడవి ఎద్దులు వంటి పెద్ద జంతువులను వేటాడిన తర్వాత వాటి మాంసాన్ని కోయడానికి, ఎముకల నుంచి మాంసాన్ని వేరుచేయడానికి దీన్ని ఉపయోగించి ఉండవచ్చని భావిస్తున్నారు. రెండో అభిప్రాయం ప్రకారం, ఇది రోజువారీ వినియోగం కోసం కాకుండా, ఆ పనిముట్టును తయారు చేసిన వ్యక్తి నైపుణ్యాన్ని, సామాజిక హోదాను సూచించే ప్రతీకగా ఉండి ఉండవచ్చు.

– బిఎస్ఎస్ మైత్రేయి

# క్రీడలకూ కాషాయం రంగు!

సమాజాన్ని ఏకం చేసే అత్యంత శక్తివంతమైన వేదికల్లో క్రీడలది అగ్రస్థానం. భాష, మతం, ప్రాంతం, రాజకీయ భావజాలం, ఆర్థిక స్థితి వంటి అన్ని భేదాలను దాటి ప్రజలను ఒకే భావోద్వేగంతో కలిపే శక్తి క్రీడలకు మాత్రమే ఉంది. ఒక జాతీయ జట్టు విజయం సాధిస్తే దేశమంతా సంబరాలు చేసుకుంటుంది. ఓటమి ఎదురైనా అదే దేశం ఆ బాధను పంచుకుంటుంది. అందుకే క్రీడలు కేవలం వినోదానికి పరిమితం కావు. అవి జాతీయ గుర్తింపునకు, సామాజిక ఐక్యతకు, అంతర్జాతీయ ప్రతిష్ఠకు ప్రతీకలుగా నిలుస్తాయి. అలాంటి రంగంలో రాజకీయాల ప్రభావం పెరిగితే సహజంగానే ఆందోళనలు వ్యక్తమవుతాయి. ఇటీవలి కాలంలో భారత హాకీ జట్టు జెర్సీ రంగు మార్పు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దశాబ్దాలుగా నీలిరంగు జెర్సీతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారత హాకీ జట్టు ఇకపై ప్రపంచకప్‌లో కొత్తగా 'కాషాయం' రంగుతో బరిలోకి దిగనుంది. ఈ మార్పును కొందరు సాధారణ రూపకల్పన మార్పుగా భావిస్తే, మరికొందరు క్రీడా వారసత్వానికి సంబంధించిన అంశంగా చూస్తున్నారు. ఈ చర్చలో ఏ రంగు గొప్పది, ఏ రంగు తక్కువది అనే ప్రశ్న లేదు. భారత జాతీయ పతాకంలోని ప్రతీ రంగూ సమాన గౌరవం పొందుతుంది. కానీ, ఒక జాతీయ జట్టు ఎన్నో దశాబ్దాలుగా నిర్మించుకున్న గుర్తింపును మార్చే నిర్ణయం తీసుకున్నప్పుడు ఆ ప్రక్రియ ఎంత పారదర్శకంగా సాగింది? సంబంధిత క్రీడా సంస్థలు, మాజీ ఆటగాళ్లు, అభిమానుల అభిప్రాయాలను ఎంతవరకు పరిగణనలోకి తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం అవసరం. ఒక జట్టు వేసుకునే జెర్సీ కేవలం వస్త్రం కాదు. అది ఒక జట్టు చరిత్రను, విజయాలను, అభిమానుల జ్ఞాపకాలను మోస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల జాతీయ జట్లు తమ సంప్రదాయ రంగులతోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించాయి. ఆ రంగులు వారి క్రీడా సంస్కృతిలో భాగమయ్యాయి. అందుకే అలాంటి గుర్తింపును మార్చే ముందు విస్తృత చర్చ, స్పష్టమైన వివరణ, అన్ని వర్గాల సమ్మతి అవసరం. లేకపోతే చర్చ క్రీడల గురించి కాకుండా రాజకీయాల గురించి మారుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు, క్రీడా సంస్థలు నిర్ణయాలు తీసుకుంటాయి. అయితే జాతీయ ప్రతీకలతో ముడిపడిన అంశాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం మరింత ముఖ్యమైన బాధ్యత. పారదర్శకత లోపిస్తే అసలు ఉద్దేశం ఎంత మంచిదైనా సందేహాలు పెరుగుతాయి. క్రీడాకారుల ప్రదర్శన గురించి మాట్లాడాల్సిన సమయంలో జెర్సీ రంగు ప్రధాన చర్చగా మారుతుంది. ఇది క్రీడలకు మేలు చేయదు. ఈ సంఘటన ఒక్కటే కాదు. గత కొన్నేళ్లుగా క్రీడలు, రాజకీయాలు ఒకదానిలోకి మరొకటి ప్రవేశిస్తున్నాయనే భావన బలపడుతోంది. దీనికి అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. భారత్–పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక క్రీడా పోటీలు ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం, భారత్‌లో అనిశ్చితిని పెంచేందుకు ప్రయత్నించడం వంటి చర్యలకు పాకిస్థాన్ పాల్పడుతున్నదని ప్రభుత్వ వాదన. వాస్తవానికి వాటి ప్రాధాన్యతను ఎవరూ కాదనలేరు. అయితే ఈ పరిస్థితి వల్ల క్రీడలే ఎక్కువ నష్టపోయాయి. అభిమానులు ప్రపంచంలో అత్యంత ఆసక్తికరమైన క్రీడా పోటీలను కోల్పోయారు. ఆటగాళ్లు సహజమైన అంతర్జాతీయ పోటీ అవకాశాలను చేజార్చుకున్నారు. అలాగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో పాకిస్థాన్ ఆటగాళ్లకు అవకాశం లేకపోవడం కూడా రాజకీయాలు క్రీడలపై చూపిన ప్రభావానికి మరో ఉదాహరణగా నిలుస్తుంది. ఒకప్పుడు ఈ లీగ్‌లో పాల్గొన్న ఆటగాళ్లు తరువాత పూర్తిగా దూరమయ్యారు. ఈ నిర్ణయాలకు ప్రభుత్వ విధానాలు, భద్రతా అంశాలు కారణాలుగా నిలిచినా, దాని ప్రభావం మాత్రం క్రీడలపై పడింది. క్రీడాకారులు రాజకీయ నిర్ణయాల ఫలితాన్ని అనుభవించాల్సి వచ్చింది. క్రీడలను రాజకీయాల నుండి ఎంతవరకు దూరంగా ఉంచగలమనే ప్రశ్న ఇక్కడ మళ్లీ ముందుకు వస్తుంది. ప్రపంచ చరిత్రలో రాజకీయాలు క్రీడలను ప్రభావితం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఒలింపిక్స్ బహిష్కరణలు జరిగాయి. అంతర్జాతీయ ఆంక్షలు అమలయ్యాయి. కొన్ని దేశాలు ప్రత్యర్థులతో ఆడేందుకు నిరాకరించాయి. కానీ అవన్నీ అసాధారణ పరిస్థితులు. వాటిని శాశ్వత విధానాలుగా మార్చడం క్రీడాస్ఫూర్తికి విరుద్ధం. రాజకీయ విభేదాలు శాశ్వతం కావు. ప్రభుత్వాలు మారుతాయి. విధానాలు మారుతాయి. కానీ క్రీడలు ప్రజల మధ్య నిర్మించే అనుబంధం చాలా కాలం నిలుస్తుంది. క్రీడల ప్రధాన లక్ష్యం పోటీ ద్వారా పరస్పర గౌరవాన్ని పెంపొందించడం. మైదానంలో ప్రత్యర్థులు ఎంత తీవ్రంగా పోటీ పడినా, మ్యాచ్ ముగిసిన తరువాత చేతులు కలుపుతారు. అదే క్రీడాస్ఫూర్తి. అదే ప్రపంచానికి శాంతి సందేశం. చరిత్రలో క్రికెట్ దౌత్యం, పింగ్‌పాంగ్ దౌత్యం వంటి ఉదాహరణలు దేశాల మధ్య సంభాషణకు క్రీడలు ఎలా దోహదపడ్డాయో చూపించాయి. ప్రజల మధ్య ఏర్పడే విశ్వాసాన్ని రాజకీయ చర్చలు ఒక్కసారిగా సృష్టించలేవు. క్రీడలు ఆ అవకాశాన్ని కల్పిస్తాయి. అందుకే క్రీడలను రాజకీయాలకు పొడిగింపుగా చూడకూడదు. జాతీయ జట్టు ఏ రంగు జెర్సీ ధరించాలి, ఏ రూపకల్పన ఉండాలి వంటి నిర్ణయాలు రాజకీయ చర్చలుగా మారితే అసలు లక్ష్యం దెబ్బతింటుంది. ఆటగాళ్ల శిక్షణ, వ్యూహం, సన్నద్ధత, విజయావకాశాలు ప్రధాన చర్చ కావాలి. జెర్సీ రంగు కాదు. ఒక క్రీడాకారుడు మైదానంలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. అతడు ఏ రాజకీయ భావజాలానికీ ప్రతినిధి కాదు. అందుకే అతడిని రాజకీయ వివాదాల కేంద్రంగా మార్చడం సమంజసం కాదు. మైదానంలో అతని ప్రతిభ మాత్రమే మాట్లాడాలి. భారత్ ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలంటే ఆధునిక శిక్షణ కేంద్రాలు, శాస్త్రీయ కోచింగ్, ప్రతిభావంతుల గుర్తింపు, పారదర్శక ఎంపికలు, మెరుగైన పోషకాహార వ్యవస్థ, అంతర్జాతీయ స్థాయి పోటీ అవకాశాలపై దృష్టి పెట్టాలి. జెర్సీ రంగు కంటే క్రీడాకారుడి ప్రదర్శనే దేశ గౌరవాన్ని నిలబెడుతుంది. రాజకీయాలు ప్రజాస్వామ్యానికి అవసరం. అలాగే, క్రీడలు సమాజానికి అవసరం. అయితే ఈ రెండింటి పాత్రలు వేరు. రాజకీయాలు పాలనను నిర్దేశిస్తాయి. క్రీడలు ప్రజలను కలుపుతాయి. అందుకే వీటి మధ్య ఆరోగ్యకరమైన దూరం ఉండాలి. ముఖ్యంగా అంతర్జాతీయ క్రీడా పోటీల్లో జాతీయ ప్రయోజనం అంటే ఆటగాళ్లకు అత్యుత్తమ వాతావరణం కల్పించడం. వారిని రాజకీయ చర్చల మధ్య నిలబెట్టడం కాదు. ●

# భారత్‌పై అమెరికా బలవంతపు సుంకాలు

**ఆర్.సూర్యమూర్తి**

తన వాణిజ్య విధానాన్ని రూపొందించుకోవటానికి అమెరికాకు పూర్తి సార్వభౌమ హక్కు ఉంది. ప్రపంచ సరఫరా గొలుసులలో బలవంతపు కార్మిక వ్యవస్థను ఎదుర్కోవడానికి దానికి పూర్తి హక్కు ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం నుండి బలవంతపు కార్మిక శ్రమను నిర్మూలించాలనే నైతిక ఆవశ్యకతకు భారతదేశంతో సహా కొన్ని దేశాలు మాత్రమే అభ్యంతరం చెప్పగలవు. అయితే, వాషింగ్టన్ ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ఏ మార్గాన్ని ఎంచుకుందనేది మరింత లోతైన పరిశీలనకు అర్హమైనది.

న్యూఢిల్లీతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై చర్చలు జరుపుతూనే, భారతదేశంతో సహా 60 దేశాల నుండి దిగుమతులపై శాశ్వత సెక్షన్ 301 సుంకాలను విధించడం ద్వారా, ట్రంప్ ప్రభుత్వం వాణిజ్య అమలుకు, వాణిజ్య బలవంతానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మసకబార్చింది. దీని సందేశం స్పష్టంగా ఉంది. చర్చలు కొనసాగవచ్చు, కానీ సుంకాలే ప్రధాన ఒత్తిడి సాధనంగా ఉంటాయి.


ఇది భారతదేశానికి ఆందోళన కలిగించాలి. ఎందుకంటే, అదనపు 10 శాతం సుంకం ఆర్థికంగా వినాశకరమైనది కానందుకు కాదు, అది భారతదేశం–అమెరికా వాణిజ్య సంబంధాల స్వరూపాన్ని, మూలాలనే మారుస్తుంది కాబట్టి. చూడగానే భారతదేశం సాపేక్షంగా ఎటువంటి నష్టం లేకుండా బయటపడినట్లు కనిపిస్తుంది.

కార్మికుల బలవంతపు శ్రమతో ఉత్పత్తి చేయబడిన వస్తువుల దిగుమతులను నిషేధించడానికి న్యూఢిల్లీ తన విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించిన తరువాత, యు.ఎస్. వాణిజ్య ప్రతినిధి కార్యాలయం (యుఎస్‌టిఆర్), భారతీయ ఎగుమతులపై ప్రతిపాదిత అదనపు సుంకాన్ని 12.5 శాతం నుండి 10 శాతానికి తగ్గించింది. లిఖితపూర్వక సమర్పణలు, బహిరంగ విచారణలు, ద్వైపాక్షిక సంప్రదింపుల ద్వారా వాషింగ్టన్‌తో నెలల తరబడి నిరంతర సంప్రదింపుల తర్వాత ఇది జరిగిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ సరిగ్గానే పేర్కొంది. జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, స్మార్ట్‌ఫోన్‌లు, ఉక్కు, అల్యూమినియం, ఆటో విడిభాగాలు వంటి సెక్షన్ 232 సుంకాల పరిధిలోకి ఇప్పటికే వచ్చిన ఉత్పత్తులతో సహా, అమెరికాకు భారత దేశం చేసే ఎగుమతులలో దాదాపు 45శాతం కొత్త సుంకం నుండి మినహాయింపు పొందాయి.

అధిక సుంకాలను ఎదుర్కొంటున్న అనేక పోటీ ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, భారతదేశం సాపేక్షంగా అనుకూలమైన స్థానాన్ని సంపాదించుకుంది. అది శుభవార్త. దుర్వార్త ఏమిటంటే, భారతదేశం ఒక వ్యూహాత్మక ఓటమిని విస్మరిస్తూ, ఒక వ్యూహాత్మక విజయాన్ని జరుపుకుంటుండవచ్చు. 12.5 శాతం నుండి 10శాతానికి తగ్గింపు అంశం వార్తలలో ప్రధానాంశంగా నిలిచింది. కానీ అసలు కథ సుంకం రేటు కాదు, ఆ సాధనం శాశ్వతత్వం గురించి. సెక్షన్ 301 సుంకాలకు గడువు ముగింపు నిబంధన లేదు. నిబంధనల పాటిస్తున్నట్లు అమెరికా మాత్రమే నిర్ధారించేంత వరకు అవి అమలులో ఉంటాయి. మరో మాటలో చెప్పాలంటే, వాషింగ్టన్ ఏకకాలంలో దర్యాప్తుదారుగా, ప్రాసిక్యూటర్‌గా, న్యాయమూర్తిగా, శిక్ష అమలుదారుగా వ్యవహరిస్తుంది.

అది నియమాల ఆధారిత వాణిజ్యం కాదు. అది నిబంధనలు ఒక పక్షం రాసి, తన విచక్షణ మేరకు అమలు చేసే వాణిజ్యం. ఈ వ్యత్యాసం కీలకమైనది, ఎందుకంటే భారతదేశం, అమెరికా వాణిజ్య యుద్ధంలో నిమగ్నమైన ప్రత్యర్థులు కాదు. అవి ఒక చారిత్రాత్మక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంగా పదే పదే వర్ణించబడుతున్న అంశంపై చర్చలు జరుపుతున్న వ్యూహాత్మక భాగస్వాములు. ఇరుపక్షాల అధికారులు చర్చలు తుది దశలో ఉన్నాయని, కేవలం మార్కెట్ ప్రవేశం, వ్యవసాయం, డిజిటల్ వాణిజ్యం, పెట్టుబడి, కార్మిక, పర్యావరణ ప్రమాణాలు వంటి కొన్ని క్లిష్టమైన సమస్యలు మాత్రమే పరిష్కారం కాకుండా మిగిలి ఉన్నాయని సూచించారు. వాణిజ్య ఒప్పందాలు అనిశ్చితిని తగ్గించడానికి ఉద్దేశించబడ్డాయి. అయినప్పటికీ, చర్చలు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, వాషింగ్టన్ ఒక కొత్త సుంకాల విధానాన్ని సంస్థాగతం చేయాలని నిర్ణయించుకుంది. ఇది ఒక స్పష్టమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: అసలు భారతదేశం దేని గురించి చర్చలు జరుపుతోంది? ఒక దేశం అమెరికా డిమాండ్‌లకు కట్టుబడి, తన దేశీయ చట్టాలను సవరించి, విచారణలలో పాల్గొని, ప్రక్రియ అంతటా సహకరించినప్పటికీ, శాశ్వత సుంకాలకు లోబడి ఉండాల్సివస్తే, భవిష్యత్‌కు సంబంధించిన నిబద్ధతలు భిన్నమైన ఫలితాలను ఇస్తాయని నమ్మటం ఎలా?

ఈ వైరుధ్యాన్ని విస్మరించడం కష్టం. కార్మికుల బలవంతపు శ్రమతోనే తయారు చేయబడిన వస్తువులు దిగుమతులను నిషేధించడంలో విఫలమైనందుకే ఈ సుంకాలు విధించామని వాషింగ్టన్ వాదిస్తోంది. కోరిన విధంగానే భారతదేశం కచ్చితంగా స్పందించింది. బలవంతపు లేదా నిర్బంధ కార్మిక శ్రమ ద్వారా ఉత్పత్తి చేయబడిన వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ, 2026 జూన్ లో తన విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించింది. యుఎస్‌టిఆర్ స్వయంగా భారతదేశ విధాన ప్రతిస్పందనను గుర్తించి, దానిని దిగువ 10 శాతం సుంకాల శ్రేణిలోకి మార్చింది. అయినప్పటికీ సుంకం అలాగే ఉంది.



*భారతదేశం రాయితీలతో కాకుండా విశ్వాసంతో చర్చలు జరపాలి. ఏకపక్ష వాణిజ్య చర్యల భవిష్యత్ అమలును బిటిఎ స్పష్టంగా ప్రస్తావించాలి. సుంకాలు విధించే ముందు సంప్రదింపుల యంత్రాంగాలను, పారదర్శకమైన సమ్మతి సమీక్షలను, స్వతంత్ర వివాద పరిష్కార ప్రక్రియలను, అంగీకరించిన షరతులు నెరవేరిన తర్వాత సెక్షన్ 301 క్రింద చర్యలను తొలగించడానికి స్పష్టంగా నిర్వచించిన మార్గాలను ఇది ఏర్పాటు చేయాలి. లేకపోతే, ఈ ఒప్పందం వాషింగ్టన్ నుండి పదేపదే జరిగే ఏకపక్ష జోక్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది.*

సుంకాల ఉపశమనం లభిస్తుందనే ఆశతో న్యూఢిల్లీ అమెరికా ఏకపక్ష డిమాండ్లకు తలొగ్గుతూనే ఉండాలా? లేక అటువంటి సమస్యలను ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) పరిధిలోనే పరిష్కరించుకోవాలని పట్టుబట్టాలా? సమాధానం స్పష్టంగా ఉండాలి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కేవలం అమెరికా ఏకపక్ష సుంకాల చర్యలతో కలిసి ఉండే పత్రంగా మారడానికి భారతదేశం అనుమతించకూడదు.

అంతే శ్రద్ధకు అర్హమైన మరో ఆందోళన కూడా ఉంది. బలవంతపు కార్మిక శ్రమ పేరుతో సుంకాలు ఒక ప్రమాదకరమైన సంప్రదింపుల సంప్రదాయాన్ని సృష్టిస్తాయి. బిటిఎను ముగించే ముందు విధాన మార్పులను రాబట్టడంలో వాషింగ్టన్ విజయం సాధిస్తే, భారతదేశంతో సంప్రదింపులకు ఏకపక్ష ఒత్తిడే అత్యంత ప్రభావవంతమైన వ్యూహం అని భవిష్యత్ ప్రభుత్వాలు నిర్ధారణకు రావచ్చు. వచ్చేసారి సమస్య బలవంతపు కార్మిక శ్రమ విధానం కాకపోవచ్చు. అది వాతావరణ నిబద్ధతలు, డిజిటల్ నియంత్రణ, డేటా పాలన, వ్యవసాయ రాయితీలు, ఔషధాల ధరలు, మేధో సంపత్తి, కార్మిక ప్రమాణాలు లేదా భారతదేశ భౌగోళిక రాజకీయ సంబంధాలు కూడా కావచ్చు.నిజానికి, ఇటీవల అమెరికా వాణిజ్య చర్యలు ఇప్పటికే అటువంటి గమనాన్ని సూచిస్తున్నాయి. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా సమర్థించబడిన సెక్షన్ 232 సుంకాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. పరస్పర సుంకాలు విపరీతంగా పెరిగిపోయాయి. వ్యూహాత్మక అంశాలతో ముడిపడి ఉన్న దేశాల వారీ సుంకాలు సర్వసాధారణమయ్యాయి. అదనపు ఉత్పాదక సామర్థ్యంపై మరో సెక్షన్ 301 విచారణ ఇప్పటికే కొనసాగుతోంది.

నేటి 10 శాతం సుంకం సవాలు కాదు. రేపటి సమర్థనే అసలైన సవాలు. సుంకం 10శాతమైనా లేదా 12.5 శాతమైనా, శాశ్వత విధాన అనిశ్చితి పెట్టుబడులను నిరుత్సాహపరుస్తుంది, సరఫరా నిర్ణయాలను క్లిష్టతరం చేస్తుంది, ఫైనాన్సింగ్ ఖర్చులను పెంచుతుంది.

ఇది ఇతర వాణిజ్య భాగస్వాములకు పంపే సందేశం కూడా అంతే ఆందోళనకరమైనది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలకు చర్చలు జరుపుతూనే ఏకపక్ష సుంకాలు విధించటం బహుళపక్ష వాణిజ్య వ్యవస్థ క్రమంగా క్షీణించే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ వాణిజ్య చట్టం లేదా ప్రపంచ వాణిజ్య సంస్థ కాకుండా, దేశీయ రాజకీయ పరపతే మార్కెట్ ప్రవేశాన్ని నిర్ణయిస్తుందని దేశాలు ఎక్కువగా నిర్ధారణకు రావచ్చు. అది ప్రపంచ వాణిజ్యాన్ని పోటీపడే ప్రభావ క్షేత్రాలుగా విభజించడాన్ని వేగవంతం చేస్తుంది. నియమాల ఆధారిత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థకు అగ్రగామిగా నిలవడానికి భారతదేశం దశాబ్దాలుగా కృషి చేసింది. కేవలం కొంతమంది పోటీదారుల కంటే తక్కువ సుంకాన్ని పొందిందన్న కారణంతో ఆ సూత్రాన్ని విడిచిపెట్టకూడదు.

వీటన్నిటి అర్థం భారతదేశం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) నుండి వైదొలగాలని కాదు. దానికి పూర్తి విరుద్ధంగా, అమెరికాతో మరింత సన్నిహిత ఆర్థిక ఏకీకరణకు ఆధారమైన వ్యూహాత్మక తర్కం ఇప్పటికీ బలంగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా విస్తరిస్తోంది. సెమీకండక్టర్లు, రక్షణ రంగ తయారీ, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీల రంగాలలో సహకారం మునుపెన్నడూ లేనంత గాఢంగా ఉంది. సమర్థవంతంగా చర్చలు జరిపి కుదుర్చుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం, సరఫరా గొలుసుల స్థితిస్థాపకతను బలోపేతం చేయగలదు, ప్రపంచ తయారీ రంగం చైనాపై అధికంగా ఆధారపడకుండా వైవిధ్యపరుస్తుంది. భారతీయ ఎగుమతిదారులకు గణనీయమైన అవకాశాలను అందించగలదు. కానీ, ఈ సంబంధం వ్యూహాత్మకంగా ముఖ్యమైనది కాబట్టే, భారతదేశం రాయితీలతో కాకుండా విశ్వాసంతో చర్చలు జరపాలి. ఏకపక్ష వాణిజ్య చర్యల భవిష్యత్ అమలును బిటిఎ స్పష్టంగా ప్రస్తావించాలి. సుంకాలు విధించే ముందు సంప్రదింపుల యంత్రాంగాలను, పారదర్శకమైన సమ్మతి సమీక్షలను, స్వతంత్ర వివాద పరిష్కార ప్రక్రియలను, అంగీకరించిన షరతులు నెరవేరిన తర్వాత సెక్షన్ 301 క్రింద చర్యలను తొలగించడానికి స్పష్టంగా నిర్వచించిన మార్గాలను ఇది ఏర్పాటు చేయాలి. లేకపోతే, ఈ ఒప్పందం వాషింగ్టన్ నుండి పదేపదే జరిగే ఏకపక్ష జోక్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది.

అలాగే సుమారు 45 శాత ం ఎగుమతులు కొత్త సుంకాల పరిధిలోకి రాలేదని వాణిజ్య మంత్రిత్వ శాఖ సరిగ్గానే నొక్కి చెప్పింది. ఇవి స్పష్టమైన విజయాలు. అయినప్పటికీ, విజయాన్ని అంతిమంగా, భారతదేశం సుంకాన్ని 12.5శాతం నుండి 10శాతానికి తగ్గించుకోవడానికి చర్చలు జరిపిందా లేదా అనే దానితో కాకుండా, తుది ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఇటువంటి ఏకపక్ష చర్యలు సర్వసాధారణం కాకుండా నిరోధిస్తుందా లేదా అనే దానితో సరిచూసుకోవాలి.

ఒత్తిడిలో చర్చలు జరపడం వల్ల శాశ్వత భాగస్వామ్యాలు అరుదుగా ఏర్పడతాయని చరిత్ర సూచిస్తుంది. అందువల్ల, భారతదేశం బిటిఎ తుది దశలను స్పష్టతతో సమీపించాలి. స్వల్పకాలిక సుంకాల ఉపశమనం కోసం దీర్ఘకాలిక వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని వదులుకునే ప్రలోభాన్ని అది నిరోధించాలి. ఒక సమగ్ర వాణిజ్య ఒప్పందం ఏకపక్ష అడ్డంకులను చట్టబద్ధం చేయకుండా, వాటిని తగ్గించాలని అది పట్టుబట్టాలి.

# స్నేహం ఓ త్యాగం ఆపదలో అభయహస్తం!

స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయహస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన నీడను చేకూర్చే మహావృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్థ నేస్తాలు. బంధువులతో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటారు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతికి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటారు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు.

**జాతీయ స్నేహ దినోత్సవం–2026 :**

స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, బేదాభిప్రాయాలను దూరం చేసుకోవడం, పౌర సమాజం లో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట ఆగస్టు మాసంలోని మొదటి ఆదివారం రోజు, అనగా 02 ఆగస్టు 2026 న భారతదేశ వ్యాప్తంగా జాతీయ స్నేహ దినోత్సవం (నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే) పాటించడం కొనసాగుతున్నది. 2026 జాతీయ స్నేహ దినం వేదికగా స్నేహ మార్గం ద్వారా శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెంపొందించే ప్రయత్నాలు నిర్వహించాలి. వివిధ దేశాలు, జాతులు, మతాలు,



కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవా న్ని జరుపుకుంటాం. స్నేహ బందం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటా రు.

**స్నేహితులతో కొత్త ప్రపంచం పరిచయం :**

చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మనాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మనవెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. వయస్సు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంస్కృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది. జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, పాత స్నేహితుల సమావేశం పెట్టుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమతమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామాజిక మాధ్యమాల్లో స్నేహ బంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.

**(02 ఆగస్టు జాతీయ స్నేహ దినోత్సవం సందర్భంగా)**

జనరల్
STATE & REGIONAL NEWS
హైదరాబాద్
ఆదివారం
02-08-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


# సింగరేణికే మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్




● జెన్‌కోను వేలం నుంచి తప్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని పికెఒసి2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను జెన్‌కోకు కాకుండా సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సిడబ్ల్యుయు–ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొగ్గు వెలికితీత కనీస పరిజ్ఞానం గానీ, యంత్రాలు కూడా లేని జెన్‌కో ఈ వేలం పాటలో పాల్గొనడమంటే సింగరేణికి అన్యాయం చేయడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3న జరగనున్న బొగ్గు బ్లాక్ వేలంలో జెన్‌కో పోటీ నుంచి తప్పుకుని, డీప్‌సైడ్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ గతంలోను తాడిచర్ల1 గనిని జెన్‌కోకు కేటాయించినప్పటికీ, గనుల నిర్వహణ సామర్థ్యం లేక ఎఎంఆర్ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా బొగ్గు తవ్విస్తున్నారని, ఇందుకు టన్నుకు రూ.3800లు జెన్‌కో చెల్లిస్తుండగా అదే సింగరేణి రూ.3400లకే సరఫరా చేస్తోందన్నారు. ఇదే క్రమంలో, ప్రైవేట్ కాంట్రాక్టర్లకే లాభం చేకూర్చడం ద్వారా వందల కోట్లను దోచుకునేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బొగ్గు వెలికితీతలో ఎంతో పరిజ్ఞానం ఉన్న పలు ప్రైవేట్ సంస్థలు మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ టెండర్లలో ఈసారి ఆసక్తి చూపలేదని, అయినప్పటికీ ఏ మాత్రం పరిజ్ఞానం గానీ యంత్రాంగం గానీ లేని జెన్‌కో టెండర్‌లో పాల్గొనడం వెనుక ఇంధన శాఖలోని కొంతమంది అధికారుల హస్తం ఉందని ఆరోపించారు. తద్వారా ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చడం ద్వారా వందల కోట్లు దండుకునేందుకే ఇదంతా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో ప్రస్తుతం 40 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 30 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి రాకపోతే 2032 తర్వాత మణుగూరు ప్రాంతంలో సింగరేణి కార్యకలాపాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో 3,500 మంది శాశ్వత ఉద్యోగులు, 2,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆయన తెలిపారు.

**బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది**

సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయాలనే కుట్రలు పన్నితే గతంలో బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి సంస్థ పట్ల వ్యవహరించిన తీరు కారణంగానే గత అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి విస్తరించి ఉన్న 11 నియోజకవర్గాల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బిఆర్‌ఎస్ తరహాలో వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో ఆ కాంగ్రెస్‌కు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, మణుగూరు బొగ్గు గనిని వేలం పాట నుంచి జెన్‌కోను తప్పించి సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా ఇలాంటి ప్రయత్నాలను కార్మిక ఉద్యమాలతో అడ్డుకున్నామని వారు గుర్తు చేశారు. మీడియా సమావేశంలో ఎఐటియూసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఎస్‌సిడబ్ల్యుయు నేత వేణుమాధవ్ పాల్గొన్నారు.



# భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా బిల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ విద్వేషపూరిత ప్రసంగం, విద్వేషపూరితమైన నేరాల (నివారణ) బిల్లు 2026'పై ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ తన బాధ్యతను నిష్పాక్షికంగా, సమగ్ర పరిశీలనతో, నిర్మాణాత్మక చర్చల స్ఫూర్తితో నిర్వహిస్తుందనే పూర్తి విశ్వాసం ఉందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 'తెలంగాణ విద్వేషపూరిత ప్రసంగం, విద్వేషపూరితమైన నేరాల (నివారణ) బిల్లు 2026'పై ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ తొలి సమావేశం శనివారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది. సమావేశంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, సెలెక్ట్ కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, సిపిఐ శాసనసభాపక్ష నాయకులు, కమిటీ సభ్యులు కూనంనేని సాంబశివరావు, కమిటీ సభ్యులు దానం నాగేందర్, కోవా లక్ష్మి , జి.మధుసూదన్ రెడ్డి, తోట లక్ష్మి కాంతారావు, కవ్వంపల్లి సత్యనారాయణ, మామిడాల యశస్విని, కోనేటి మాణిక్ రావు, అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభా కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఈ బిల్లును సమగ్రంగా పరిశీలించి, తగిన సిఫార్సులతో కూడిన నివేదికను శాసనసభకు సమర్పించే ముఖ్యమైన బాధ్యతను ఈ కమిటీకి సభ అప్పగించినట్లు చెప్పారు. సెలెక్ట్ కమిటీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా, భవిష్యత్తు తరాలకు కూడా మార్గదర్శకంగా ఉండే విధంగా సభ్యుల సహకారంతో నియమాలను రూపొందిస్తామని తెలిపారు. సెలెక్షన్ కమిటీలో అనుభవం ఉన్న సభ్యులు ఉన్నారని, అందరం కలిసి సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. తరుచు సమావేశాలు నిర్వహిస్తూ సాధ్యమైనంత త్వరగా నివేదికను సభాపతి అందజేస్తామని వెల్లడించారు.

# అంతర్రాష్ట్ర, ప్రాంతీయ అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



● దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో రాష్ట్రం తరఫున ప్రస్తావించాల్సిన కీలక అంతర్రాష్ట్ర, ప్రాంతీయ అంశాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రణాళిక శాఖకు సూచించారు. ఇందుకోసం రాష్ట్రానికి సంబంధించిన అన్ని ఎజెండా అంశాలను సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 20న తమిళనాడులోని చెన్నై సమీపంలోని మహాబలిపురంలో జరగనున్న దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశం సన్నాహకాలపై సిఎస్ సంజయ్ జాజు శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ప్రాథమిక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ తరఫున కౌన్సిల్ ముందు ఉంచాల్సిన అంశాలతో పాటు, వివిధ శాఖలు చేపట్టాల్సిన సన్నాహకాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సిఎస్ జాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన సమాచారం, గణాంకాలు, ప్రతిపాదనలతో సమావేశానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతర్రాష్ట్ర ప్రాధాన్య అంశాలు, ప్రాంతీయ ప్రయోజనాలకు సంబంధించిన కీలక సమస్యలను గుర్తించి, వాటిని కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రం తరఫున ప్రస్తావించే అవకాశాలను పరిశీలించాలని ప్రణాళిక శాఖకు సంజయ్ జాజు సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ అంశాలపై రానున్న రెండు రోజుల్లో పూర్తి వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తెలంగాణ తరఫున సమగ్ర ప్రతిపాదనలు, సిఫార్సులను రూపొందించి ముఖ్యమంత్రి పరిశీలనకు పంపించాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ అధికారులు వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, గౌరవ్ ఉప్పల్, ఈ.శ్రీధర్, క్రిస్టినా జెడ్ జోంగ్తు తదితరులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు కోసం యువత రాజకీయాల్లోకి రావాలి

● సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ్మా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ భవిష్యత్ కోసం యువత రాజకీయాల్లోకి రావాలని, కేంద్ర యువజన వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సమర శంఖం పూరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ్మా పిలుపునిచ్చారు. తద్వారా యువత ఈ దేశ భవిష్యత్‌ను నిర్ణయించాలని కోరారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర 3వ మహాసభల లోగోను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటి నరసింహ్మా మాట్లాడుతూ దేశంలో అత్యధిక జనాభా యువతదే అయినప్పటికీ, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ వైపు సాగుతోందని విమర్శించారు. జాతీయ యువజన విధానం పేరుతో ప్రకటనలు చేస్తున్నా, యువతకు శాశ్వత ఉద్యోగాలు, నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి అంశాలపై స్పష్టమైన హామీలు అమలు కావడంలేదన్నారు. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయకుండా, ఎన్నికల సమయంలో మాత్రమే యువతను గుర్తు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. యువత రాజకీయాలకు దూరంగా ఉంటే ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరిరక్షణలో యువత ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగ, విద్య, వైద్య, కార్మిక హక్కులు, మహిళల భద్రత, రైతుల సంక్షేమం, శాస్త్రీయ దృక్పథం వంటి అంశాలపై ఉద్యమాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

**యువతకు కొత్త దిశానిర్దేశం చేసే చరిత్రాత్మక వేదికగా మహాసభలు**

సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు యువతకు కొత్త దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక వేదికగా నిలుస్తాయని రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన విధానాలు, నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యా, వైద్య రంగాల పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం, శాంతి, శాస్త్రీయ సోషలిజం వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిపి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు వారు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో మహాసభలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు బిజ్జా శ్రీనివాసులు, లింగం రవి, నానాబాల రామకృష్ణ, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, ఎం.శ్రీమాన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.




# 19 నుంచి పోలీసు కొలువులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (టిఎస్‌ఎల్‌పిఆర్‌బి) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 7,437 పోలీసు, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఆన్‌లైన్ దరఖాస్తుల తేదీలను ప్రకటించింది. ఈ నెల19 ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 9 సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని బోర్డు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. దరఖాస్తులు www.tgprb.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే స్వీకరిస్తామని, ఇతర మార్గాల్లో పంపిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. ఈ నియామక ప్రక్రియలో సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్, ఫైర్‌ఫైటర్, వార్డర్, డిప్యూటీ జైలర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తదితర పోస్టులు ఉన్నాయి. బోర్డు నిర్ణయించిన ఒకేసారి చెల్లించే ఫీజుతో దరఖాస్తు, ప్రిలిమినరీ రాత పరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్/ఎఫిషియెన్సీ టెస్ట్, ఫైనల్ రాత పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్, బయోమెట్రిక్స్, ఫలితాల ప్రాసెసింగ్ తదితర మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. పోస్టును బట్టి ఒసి/బిసిలకు రూ.600 నుంచి రూ.1,500, ఎస్సీ/ఎస్టీ స్థానిక అభ్యర్థులకు రూ.600 నుంచి రూ.750 వరకు ఫీజు నిర్ణయించింది. ఒకటి కంటే ఎక్కువ కామన్ ప్రొసీజర్ కేటగిరీలకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు ఒకే పిఎంటి, పిఇటి నిర్వహించి, అదనపు దరఖాస్తులపై ఫీజు రాయితీ కూడా కల్పిస్తామని బోర్డు వెల్లడించింది. అలాగే దరఖాస్తు చేసుకునే ముందు మొబైల్‌లో ఆధార్ ఫేస్ అథెంటికేషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

తెలంగాణ ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటి కలెక్టరు వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబగద్వాల జిల్లా

ఫారం - VII

రూఢి ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

జిల్లా కలెక్టరు, జోగులాంబ గద్వాల ప్రొసిడింగ్స్ నెం. G/372/2025 — తేది : 09.06.2025
ప్రత్యేక ఉపకలెక్టరు, (భూసేకరణ) జె.యల్.ఐ.పి లేఖ నెం. A2/41/2018 — తేది : 06.06.2026
జిల్లా రాజపత్రం నెం. 15/2026 — తేది : 06.06.2026

ఈ దిగువ నిర్దిష్ట పరచిన జోగులాంబగద్వాల జిల్లా, గద్వాల మండలము మేలచెర్వు గ్రామము విస్తీర్ణము ఎ. 6.475 సెం.లు ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా అనగా Package No. 99(D) D-17 Canal నిర్మాణ నిమిత్తము, అవసరమైయున్నదని భావించనైనది.
కావున జోగులాంబగద్వాల జిల్లా, గద్వాల మండలము మేలచెర్వు గ్రామము విస్తీర్ణము ఎ.6.475 సెం.లు గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

| క్ర. సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు) | [illegible] |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 1 | లావుణి పట్టా | మెట్ట | 2.225 | ప్రభుత్వ భూమి **అనుభవదారులు** 1. మాదమ్మ W/o పెద్ద తిమ్మన్న | లేవు |
| 2 | 127 | పట్టా | మెట్ట | 0.725 | 1.బోయ తిమ్మమ్మ W/o పెద్ద వీరన్న **అనుభవదారులు** 1. బోయ తిమ్మమ్మ W/o పెద్ద వీరన్న | లేవు |
| 3 | 128 | పట్టా | మెట్ట | 1.275 | 1.మల్లమ్మ W/o యేల్కూర్ పక్కీరన్న 2.రహీముద్దీన్ S/o ఇమామ్ సాబ్ **అనుభవదారులు** 1.M.D.రహీముద్దీన్ S/o ఇమామ్ సాబ్ 2.మల్లమ్మ W/o పకీరన్న | లేవు |
| 4 | 129 | పట్టా | మెట్ట | 0.25 | 1.రాముడు S/O కుర్వ నాగన్న 2. జయలక్ష్మి W/o కుర్వ పరుశరాముడు **అనుభవదారులు** 1. కుర్వ ఈదన్న S/o నాగన్న | లేవు |
| 5 | 139 | పట్టా | మెట్ట | 0.60 | 1. కుర్వ అనంతమ్మ W/o హనుమంతు **అనుభవదారులు** 1. అనంతమ్మ W/o హనుమంతు 2.బాట | లేవు |
| 6 | 140 | పట్టా | మెట్ట | 0.60 | 1. కూతల వెంకటమ్మ W/o కుత్యాల బోయ కృష్ణ 2.చింతలన్న S/o సుంకన్న 3. కుర్వ కిష్టమ్మ W/o చెంద్రన్న 4.కుర్వ ఆంజనేయులు S/o ఈదన్న 5. పరుశరాముడు S/o సుంకన్న **అనుభవదారులు** 1. కుర్వ సుంకన్న S/o పి.చింతలన్న 2.కె.అనంతమ్మ W/o హనుమంతు | లేవు |
| 7 | 141 | పట్టా | మెట్ట | 0.80 | 3. బాట 1. బోయ పెద్ద రాముడు S/o చిన్నయ్య 2. బోయ చిన్న రాముడు S/o చిన్నయ్య 3. బోయ తిమ్మన్న S/o చిన్నయ్య **అనుభవదారులు** 1. పెద్ద రాముడు S/o చిన్నయ్య 2.చిన్న రాముడు S/o చిన్నయ్య 3.P.B.తిమ్మన్న S/o చిన్నయ్య | లేవు |
| మొత్తం విస్తీర్ణం : 6.475 | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.
ఇట్టి భూసేకరణ వలన ఎవ్వరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావసం మరియు పునరుపాధి కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.
భూసేకరణ తల పెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోతమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టరు. జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల
సం/- అదనపు కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా
సం/- కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO NO. 578/LA/PP/Advt/Pub/2026-27



# నామినేటెడ్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్ కసరత్తు... విధివిధానాలు ఖరారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పిఎసిఎస్) డైరెక్టర్లు, చైర్మన్లతో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెట్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్ కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా శనివారం టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి సమావేశమై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి పార్టీ పరంగా అనుసరించాల్సిన విధివిధానాలను రూపొందించారు. ఉమ్మడి జిల్లాలకు నియమించిన ఇంఛార్జీ మంత్రులు, ఆయా జిల్లాల్లోని మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, సీనియర్ నాయకులతో సమావేశమై అందరీ సమన్వయంతో ఆశావహుల జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ నామినేటెడ్ పోస్టుల్లో భర్తీలో సుమారు 60 శాతం స్థానాలను గత మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గంలో పనిచేసిన నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకులకు కేటాయించడంతో నియామకాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించారు. అన్ని స్థాయిల్లో సంప్రదింపులు పూర్తిచేసి తుది జాబితాను సిద్ధం చేసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటారని సమావేశంలో నిర్ణయించారు.

# సుప్రీంకోర్టు తీర్పుతో సాగునీటి ప్రాజెక్టులకు ఊతం

సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గౌరవెల్లి, పాలమూరు రంగారెడ్డి, సీతమ్మసాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీం కోర్టు తీర్పు కొత్త ఊపునిస్తుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని, రైతుల సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని తెలిపారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ, సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వంటి ప్రముఖులను నియమించి సుప్రీంకోర్టులో సమర్థవంతంగా న్యాయపోరాటం చేసిన ఫలితంగానే ఈ అనుకూల తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల పరిరక్షణలో ముఖ్యమంత్రి తీసుకున్న చొరవ, ప్రభుత్వం చేసిన న్యాయ పోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని పొన్నం ప్రభాకర్ అభినందించారు. సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఒక్కరోజులో 2.20 లక్షల లావాదేవీలు
# మీసేవ ఆల్‌టైమ్ రికార్డు

● డిజిటల్ సేవల్లో తెలంగాణ మరో మైలురాయి

● దేశంలోనే నంబర్-1 ప్రభుత్వ ఆన్‌లైన్ వేదికగా మీసేవ : మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వేదిక మీసేవ మరో అరుదైన రికార్డును సృష్టించింది. సాధారణంగా రోజుకు 70 నుంచి 80 వేల మధ్య నమోదయ్యే లావాదేవీలు, జూలై 31న ఒక్కరోజే 2,20,172కు చేరుకుని ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేశాయి. ప్రజల నుంచి లభిస్తున్న విశ్వాసం, ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ సంస్కరణల ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ డిజిటల్ వేదికను మరింత బలోపేతం చేస్తూ ప్రభుత్వ సేవలను ఒకే వేదికపై వేగంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంత భారీ స్థాయిలో ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా లావాదేవీలు పూర్తికావడం దేశంలోనే మీసేవను అత్యుత్తమ ప్రభుత్వ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌గా నిలబెట్టిందన్నారు. జూలై 31న నమోదైన లావాదేవీల్లో ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఫ్యామిలీ కార్డు దరఖాస్తులు, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు అత్యధికంగా నమోదై తొలి మూడు స్థానాల్లో నిలిచాయని వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చి, అత్యాధునిక సాంకేతికతతో సేవల వేగం, నాణ్యత, పారదర్శకతను మరింత పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం

● ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులకు మంత్రి తుమ్మల భరోసా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్‌పామ్ రైతుల సమస్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుందని, రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా అన్ని చర్యలు చేపడుతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులకు భరోసా ఇచ్చారు. శనివారం సచివాలయంలో వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, శాంభరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు మంత్రి చేపడుతున్న చర్యలను రైతు నాయకులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలు సకాలంలో అందుబాటులో ఉండేలా కంపెనీలను ఆదేశించాలని, అవసరమైన ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రిని ఆయిల్ పామ్ కంపెనీల ద్వారా తక్కువ ధరలకు సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తప్పకుండా అన్ని చర్యలు చేపడుతుందని ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అధికారులు, కంపెనీలు, రైతులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రాంతం దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని, ఆయిల్ పామ్ అధిక ఆదాయం అందించే పంట అని, దీనికి మార్కెటింగ్ సమస్యలు లేవని, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం కూడా తక్కువగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రైతులు కోరిన వెంటనే నాణ్యమైన మొక్కలను అందుబాటులో ఉంచేలా ఆయిల్ పామ్ కంపెనీలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : మియాపూర్ సర్కిల్-48, ఎస్‌ఎల్‌పి జోన్.**
టెండర్ నోటీస్ ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)
Nit No. 12/EE/CMC/CIR-48/2026-27 — Dt: 31.07.2026
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా (05) పనుల కొరకు నెం. Nit No. 12/EE/CMC/CIR-48/2026-27 (ఐటెమ్ నెం.01 నుండి 05), తేది: 31.07.2026 ప్రకారం టెండర్లను ఆహ్వానించడమైనది. **అంచనా విలువ:** రూ.75.78 లక్షలు, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్ 01.08.2026 ఉ.11:30గం.ల నుండి బిడ్ల విక్రయం ప్రారంభమవుతుంది మరియు బిడ్ల సమర్పణకు ఆఖరి తేది: 11.08.2026 ఉ.11:30గం.ల వరకు మరియు సమర్పణ సమయానికి ఒక గంట ముందు బిడ్ల విక్రయం ముగుస్తుంది. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, ఎస్‌ఎల్‌పి జోన్ : సిఎంసి
DIPR R.O. No. : 7126-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

**చొప్పదండి మున్సిపాలిటీ**
సంక్షిప్త టెండర్ నోటీసు
(1) NIT నం. 01/MCC/ E1/2026-27, తేదీ: 01-08-2026
(2) MGF & 15వ ఆర్థిక సంఘం (Tied) గ్రాంట్ల కింద పనులు - పనుల సంఖ్య: 28, మొత్తం అంచనా విలువ: రూ. 65.50 లక్షలు.
(3) బిడ్లు సమర్పించడానికి చివరి తేదీ: 11-08-2026, సాయంత్రం 5:00 గంటలకు.
(4) బిడ్లు తెరిచే తేదీ: 12-08-2026, ఉదయం 11:00 గంటల నుండి.
(5) 15వ ఆర్థిక సంఘం (Untied) గ్రాంట్ కింద హైడ్రాలిక్ ఎక్స్‌కావేటర్ అద్దెకు తీసుకోవడం - పనుల సంఖ్య: 01, మొత్తం అంచనా విలువ: రూ. 5.00 లక్షలు.
(6) బిడ్లు సమర్పించడానికి చివరి తేదీ: 05-08-2026, సాయంత్రం 5:00 గంటలకు.
(7) బిడ్లు తెరిచే తేదీ: 06-08-2026, ఉదయం 11:00 గంటల నుండి.
మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన అధికారి పేరు & చిరునామా: కమిషనర్, చొప్పదండి మున్సిపాలిటీ, జిల్లా: కరీంనగర్, సంప్రదించవలసిన నంబర్: 9032538877; వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, చొప్పదండి మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 7159-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

**సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, STSQM (HQ) CMC, 2వ అంతస్తు, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, NAC బిల్డింగ్, ఇజ్జత్ నగర్-500 084.
RFQ No. 03/SE/STSQM/CMC/2026-27 — Date: 01.08.2026
"ఫ్రంట్ బ్రష్ అమరిక, టిల్టింగ్ బ్రష్ & రెండు సక్షన్ హెడ్‌లతో కూడిన రెండు వైపు బ్రష్‌లు, నాన్ స్లీపర్ క్యాబిన్, సైడ్ PTO తో కూడిన 12T GVW LCV స్ప్రే లాన్స్, 10మీటర్ల హోస్‌తో కూడిన హై ప్రెషర్ వాటర్ పంప్ (20 LPM @ 40 Bar) ఎలక్ట్రికల్ రివర్స్ అలారం, సైడ్ వ్యూ మిర్రర్స్, రిఫ్లెక్టర్ స్ట్రిప్స్ & టూల్ బాక్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, ఇనిషియల్ కమిషనింగ్ స్పేర్స్'తో కూడిన 3.0 క్యూ.మీ. ట్రక్ మౌంటెడ్ రోడ్ స్వీపింగ్ మెషిన్" కొనుగోలు కోసం సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (CMC) కొటేషన్లు కోరుతోంది. ఆ సక్తిగల సంస్థలు నిర్దేశించిన "కొటేషన్ కోసం అభ్యర్థన ఫారం" లోని కొరకు తమ పోటీ కొటేషన్లను సీల్డ్ కవర్ ద్వారా ఆఫీస్ ఆఫ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (STSQM), సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, 2nd ఫ్లోర్, NAC బిల్డింగ్, ఇజ్జత్ నగర్-500084 చిరునామాకు సమర్పించవలసిందిగా కోరడమైనది.
RFQ షరతులు :
1. చెల్లుబాటు అయ్యే GST రిజిస్ట్రేషన్, పాన్ కార్డు ఉన్న మ్యానుఫాక్చరర్ /సప్లయర్స్ /ఏజెన్సీలు మాత్రమే RFQను సమర్పించడానికి అర్హులు.
2. CMC ద్వారా టెండర్లను పిలవడం కోసం సంస్థలు వర్తించే అన్ని పన్నులతో సహా తమ పోటీ ధరలను సమర్పించాల్సి ఉంటుంది. ఉదహరించిన ధరలను ధృవీకరించిన తర్వాత, RFQను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు CMCకి ఉంటుంది.
3. కొటేషన్లు 10.08.2026, ఉదయం 11:00 గంటల లోపు సమర్పించాలి.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ STSQM, CMC.
DIPR R.O. No. : 7153-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

**చౌటుప్పల్ పురపాలక కార్యాలయం, యాదాద్రి భువనగిరి జిల్లా.**
నెం. E1/289/MCCPL/2026-27 — ఆసక్తి వ్యక్తీకరణ (EOI) — తేదీ: 01.08.2026
మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టే అన్ని రకాల పనులకోసం థర్డ్ పార్టీ నాణ్యతా ప్రమాణాల నియంత్రణల సంప్రదింపుల సేవలు అందించడానికి ఆసక్తిగల సంస్థల నుండి ప్రతిపాదనలను మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ఆహ్వానిస్తున్నారు.ఆసక్తిగల సంస్థలు అన్ని రకాల పనులను చేపట్టేందుకు తమ ఆర్థి ప్రతిపాదనలతోపాటు ఆసక్తి వ్యక్తీకరణను, అవసరమైన పత్రాలను పురపాలక సంఘం కమిషనర్‌కు తేదీ: 06.08.2026 సాయంత్రం 4.00 గంటల సమయానికి అందజేయవలసిందిగా కోరడమైనది.
కన్సల్టెన్సీ సంస్థలకు ఉండాల్సిన అర్హతలు:
ఎ. సంస్థ కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే రిజిస్ట్రేషన్ పొంది ఉండవలెను.
బి. కన్సల్టెన్సీ సంస్థ కనీసం 17 సంవత్సరాలుగా (పదిహేడు) ఉనికిలో ఉండి థర్డ్‌పార్టీ పనులకుగాను సంప్రదింపుల కర్తగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండాలి.
సి. సదరు కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వరంగంలో థర్డ్‌పార్టీ నాణ్యతా ప్రమాణాల నియంత్రణ సంప్రదింపులకర్తగా కనీసం పది సంవత్సరాలు (పది) అనుభవం కలిగి ఉండాలి.
డి. టెండరుదారుడు గడచిన ఐదు సంవత్సరాలకాలంలో లెక్కచూసినప్పుడు ఏదోఒక సంవత్సరంలో ఏడాదికి రూ.1.00 కోట్లు టర్నోవరు కలిగి ఉండాలి. టెండరుదారుడు చార్టర్డ్ ఎకౌంటెంటు ధృవీకరించిన ఆడిట్ ప్రతిని మాకు సమర్పించాలి.
ఇ. సదరు కన్సల్టెన్సీ సంస్థ ఒకే యు.ఎల్.బి. అంటే అర్బన్ లోకల్ బాడీలో ఒక టి.పి.క్యూ.సి ఏజన్సీగా రూ.100 కోట్ల పనులను (ప్రాజెక్టు/వర్కులు) నిర్వహించి ఉండాలి. సదరు సంస్థ సంబంధిత అనుభవంగల పత్రాలను సమర్పించాలి. ఈ పత్రాలను ధృవీకరించే అధికారి హోదా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్థాయికి తగ్గకూడదు. అంతకంటే తక్కువస్థాయివారు ఈ ధృవీకరణలు ఇవ్వకూడదు.
ఎఫ్. తెలంగాణ రాష్ట్రంలోని ఏ నగర పాలక సంస్థలోనైనా సదస్సు కన్సల్టెన్సీ సంస్థకు టి.పి.క్యూ.సి సేవలు అందించడంలో పది సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలి.సంబంధిత ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా మాకు సమర్పించాలి.
జి. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం నెం: 14436/E1/2012-1, తేదీ: 27.06.2012 ప్రకారం సదరు కన్సల్టెన్సీ సంస్థ ఐఎస్ఓ / బిఐఎస్ సర్టిఫికేషన్ కలిగి ఉండాలి. గడచిన పది సంవత్సరాలకు సంబంధించిన సర్టిఫికేషన్ ప్రతిని మాకు సమర్పించాలి.
హెచ్. సదరు సంస్థ ఎన్.ఎ.బి.ఎల్ (నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్)వారి గుర్తింపు పొంది ఉండాలి. ఈ గుర్తింపు గడచిన ఐదు సంవత్సరాలుగా ఉనికిలో ఉంటూ చెల్లుబాటైనదిగా ఉండాలి. (మరొక సంస్థతో ఉమ్మడిగా కలిసి కార్యక్రమాలు నిర్వహించినా,అనుసంధానంతో వ్యవహారాలు చేసినా సదరు గుర్తింపు అనుమతించబడదు)
ఐ. కన్సల్టెన్సీ సంస్థకు జి.ఎస్.టి. కోసం చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ ఉండాలి.తాజా జి.ఎస్.టి రిజిస్ట్రేషన్ ప్రతిని మాకు సమర్పించాలి.
జె. సదరు కన్సల్టెన్సీ సంస్థకు వృత్తి పన్ను రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
కె. కన్సల్టెన్సీ సంస్థకు ప్రావిడెంట్ ఫండ్ పి.ఎఫ్&ఇ.ఎస్.ఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
ఎల్. టెండరుదారుడు తప్పనిసరిగా తన పాన్ కార్డును, సంస్థ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను మాకు సమర్పించాలి.
ఎం. టెండరుదారుడు తప్పనిసరిగా తన సొంత సంస్థకు సంబంధించిన అనుభవాన్ని కూడా తెలియజేసే పత్రాన్ని సమర్పించాలి.
సం/- కమిషనర్ చౌటుప్పల్ పురపాలక సంఘం
DIPR R.O. No. : 7172-PP/CL/ADVT/2026-27, Date: 01-08-2026

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
ఆదివారం
02-08-2026
www.prajapaksham.in

మహానగరి
GREATER HYDERABAD



## గ్రామసభలో అభివృద్ధి పనులపై కీలక నిర్ణయాలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామ సమస్యలకు గ్రామసభలే సరైన వేదిక అని నారేగూడ గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్ అన్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేయడంతో పాటు వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, రైతులు నిత్యం వినియోగించే రహదారి వర్షాల కారణంగా బురదమయంగా మారడంతో దానిని పునరుద్ధరించాలని నిర్ణయించారు. అలాగే గ్రామంలో ఇంకుడు గుంతలు తవ్వించి వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసినట్లు సభలో తెలిపారు. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమం లక్ష్యాలను గ్రామ ప్రజలకు వివరించి, వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి వనరుల సమర్థ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి శోభ, వార్డు సభ్యులు, బిఎల్ఓలు,బిఎల్ఏలు, జిపిఒ పరమేష్, నాయకులు కృష్ణ, శ్రీనివాస్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు : తహసీల్దార్ మతీన్

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని కాప్రా తహసీల్దార్ మతీన్ స్పష్టం చేశారు. జవహర్‌నగర్ పరిధిలోని వికలాంగుల కాలనీ, బాలాజీ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో నిబంధనల కు విరుద్ధంగా వెలిసిన నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు శనివారం ఉక్కుపాదం మోపారు. వివిధ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారం అందడంతో తహసీల్దార్ మతీన్ ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది.



రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జెసిబి సాయంతో ఆయా నిర్మాణాలను కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. జవహర్‌నగర్ ప్రాంతంలో అక్రమ కట్టడాలు, భూఆక్రమణలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని తెలిపారు. ప్రజలు ఇళ్లు లేదా ఇతర నిర్మాణాలు చేపట్టే ముందు తప్పనిసరిగా సంబంధిత మున్సిపల్/రెవెన్యూ శాఖల నుంచి ముందస్తు అనుమతు లు పొందాలని అధికారుల బృందం సూచించింది. ఈ కూల్చివేత కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి ముందడుగు

### తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సరిత గోగుల

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** గురుకుల్ కళాశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధులను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సరిత గోగుల అడిగి తెలుసుకున్నారు.కళాశాల చుట్టూ తిరిగి పరిసరాలను పరిశీలించారు.ఎండోమెంట్ శాఖ ఆధీనంలో కొనసాగుతున్నందున ఈ కళాశాలను ప్రభుత్వం ఆధీనంలో తీసుకునే విధంగా మా మంత్రులతో చర్చించి ఈ గురుకుల్ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అవసరమైన ఉపాధ్యాయులను నియమించే విధంగా చూస్తానని ఆమె కోరారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధి ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి కళాశాలకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్,కీసరగుట్ట డైరెక్టర్ సగ్గు అనితశ్రీనివాస్,మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, హనుమంత్ రెడ్డి,కళాశాల ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** స్థానిక బాలాజీ నగర్ పరిధిలోని ముత్తుస్వామి కాలనీకి చెందిన 21 సంవత్సరాల యువకుడు డేనియల్ అదృశ్యమైనట్లు జవహర్ నగర్ ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీస్ లు వెల్లడించారు. ముత్తుస్వామి కాలనీకి చెందిన లక్ష్మణ్ కుమారుడైన డేనియల్ (21) ప్రస్తుతం ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. జులై 31 (శుక్రవారం) మధ్యాహ్నం సుమారు 3:00 గంటల ప్రాంతంలో ఇంట్లో చెప్పి బయటకు వెళ్లా డు. అయితే, రాత్రి అయినా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు అతని ఫోన్‌కు కాల్ చేశారు. ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితుల వద్ద గాలించినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. దీంతో చివరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. యువకుడి అదృశ్యంపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ యువకుడికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ, కుటుంబ సభ్యులకు గానీ సమాచారం అందించాల్సిందిగా కోరారు.

# అర్హత ఉన్న ఒక్క ఓటూ పోనీయొద్దు

### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గాంధీ భవన్‌లో శనివారం హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటరు సవరణ ప్రక్రియపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా తాను, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, పార్లమెంట్ ఇన్చార్జి ఎంపి మల్లు రవి, నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, డిసిసి అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏలు), సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు సవరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ గుర్తింపు కార్డు నమోదును జాప్యం లేకుండా ప్రారంభించిందని, ప్రజలు అవసరమైన ఆధార పత్రాలు సమర్పించి ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయాలని మంత్రి కోరారు. కొన్ని రాజకీయ పార్టీలు ఓట్ల తొలగింపునకు ప్రయత్నించే అవకాశం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ అర్హత ఉన్న ప్రతి ఓటర్‌కి న్యాయం జరిగేలా కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటరు సవరణ ప్రక్రియ మరింత వేగం పుంజుకునేలా నియోజకవర్గ ఇన్చార్జిలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 10లోగా ఎన్యూమరేషన్ ఫారాలన్నీ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానాస్పద (అనామలీస్) ఓటర్లను వ్యక్తిగతంగా సంప్రదించి, వారి ఓటు ఎక్కడ తుది నమోదు కావాలో నిర్ధారించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## పరిశుభ్రం, పచ్చదనంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలి

### ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బోడుప్పల్‌ను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని ఎంఎంసి కమిష నర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ ప్రాంతంలో శనివారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించిన ఆయన పారిశుద్ధ్యం, రహదారుల నిర్వహణ, పచ్చదనం, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల (సి అండ్ డి వేస్ట్) నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రహదారుల పక్కన పేరుకుపోయిన మట్టి, చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించి రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కాలనీల్లో ప్రతి ఇంటి ముందు ఏర్పాటు చేసిన ప్లాంటర్ బాక్స్‌లో తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనర్ ఆదేశించారు. ఖాళీగా ఉన్న ప్లాంటర్ బాక్స్‌లను గుర్తించి సంబంధిత గృహ యజమానులకు నోటీసులు జారీ చేయాలని, 15 రోజుల్లో మొక్కలు నాటని పక్షంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే వినియోగంలో లేని ప్లాంటర్ బాక్స్‌లను తొలగించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోయకుండా అధీకృత సంస్థ ద్వారానే సేకరణ, రవాణా, శాస్త్రీయ ప్రాసెసింగ్ చేపట్టాలని స్పష్టం చేశారు. అక్రమంగా వ్యర్థాలు పారబోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత, పచ్చదనం, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణతో సుస్థిర పట్టణాభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

## నేడు రెండు కళాశాలల్లో నషా ముక్త యువ ప్రతిజ్ఞ

### శ్రీనిధి, సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌ల ఎంపిక




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మై భారత్ ఆదివారం నిర్వహించనున్న నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్‌సంకల్ప్ అభియాన్ రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లోని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, మేడ్చల్‌లోని కండ్లకోయలలోని సిఎంఆర్ టెక్నికల్ కళాశాలలు ఎంపికయ్యాయి. ఈ రెండు కళాశాలలతో పాటు తెలంగాణా రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లాలోని కావేరి విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలల్లో దీనికి సంబంధించిన ప్రధాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ జాతీయ ఉద్యమం లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి వర్చువల్ విధానంలో యువతను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం ఈ కళాశాల ప్రాంగణంలో చేరిన యువతతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే నషా ముక్త యువ ప్రతిజ్ఞ చేయించనున్నారు. వీటికి అదనంగా రాష్ట్రంలోని మరో ఐదు జిల్లాల్లో జిల్లాస్థాయి కార్యక్రమాలు చేపట్టి యువత, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కల్సి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సంకల్ప ప్రతిజ్ఞ చేయనున్నారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయటం లక్ష్యంగా కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న తెలంగాణా రాష్ట్రంలో నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్‌సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు జరగనున్నాయి.దీనిలోని భాగంగా సామూహిక ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీలు, యువజన సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించనున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం జిల్లాలోన్ని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, యువ జన సంఘాలు, ప్రభుత్వ శాఖలు, ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో విస్తృతస్థాయిలో సమన్వయ ఏర్పాట్లు చేపట్టింది.

## ఘనంగా మర్రి లక్ష్మారెడ్డి కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే



**ప్రజాపక్షం/దుండిగల్:** మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో సంయుక్తంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. బి.టెక్, బి.ఫార్మసీ, ఎంబిఎ కోర్సులు పూర్తిచేసిన వారికి ఉత్తీర్ణత పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి, చైర్మన్ ఫర్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, పద్మజ శ్రీరామ్ రీజినల్ లీడర్, పాల్గొని ఉత్తీర్ణులైనటువంటి విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ అంటే కేవలం యంత్రాలు, సర్క్యూట్లు లేదా సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు. సమస్యలకు పరిష్కారాలు చూపించి, జీవితాలను మెరుగుపరుస్తూ, సమాజ అభివృద్ధికి తోడ్పడే సృజనాత్మక ఆలోచన నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, డేటా సైన్స్, సుస్థిర సాంకేతికతలు ప్రపంచాన్ని వేగంగా మారుస్తున్నాయనీ. ఈ మార్పులకు అనుగుణంగా నిరంతరం నేర్చుకుంటూ, నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, సమాజానికి విలువను సృష్టించగలిగిన వారే నిజమైన విజయవంతమైన ఇంజనీర్లు అని ఆయన అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ మీరు జీవితంలోని కొత్త దశలోకి అడుగుపెడుతున్న ఈ సమయంలో, ప్రపంచం వేగంగా మారుతోందని, కాబట్టి నిరంతరం నేర్చుకుంటూ, కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవడం మీ గొప్ప బలం, విజయం అనేది కేవలం జీతం లేదా పదవితో కాదు మీరు నిలబెట్టే విలువలు, సమాజంపై చూపే సానుకూల ప్రభావంతో కొలవబడుతుందనీ, ఎదురుదెబ్బలు, వైఫల్యాలు వచ్చి నా వాటిని పాఠాలుగా స్వీకరించి ఆత్మవిశ్వాసం, పట్టుదల, నిజాయితీతో ముందుకు సాగితే మీరు విజయవంతమైన ఇంజనీర్లుగానే కాకుండా సమాజానికి ఆదర్శ ప్రాయమైన నాయకులుగా కూడా నిలుస్తారు అని ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మురళి, ప్రసాద్, కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అను శ్రేయ రెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్ణబ్ మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే మంచి, చెడులపై సమగ్ర అవగాహన

### జిల్లా సెషన్స్ జడ్జి కమ్ చైర్మన్ బాల భాస్కరరావు




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** విద్యార్థి దశలోనే మంచి చెడు విషయాల పై సమగ్ర అవగాహన కల్పించటం ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యతగా విద్యతోపాటు నైతికవిలువలను నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెషన్స్ జడ్జి కమ్ చైర్మన్ బాల భాస్కరరావు అన్నారు. నియమితులైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కలెక్టరేట్‌లో జిల్లా న్యాయసేవా అధికారిక సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న వారంతా బాలలే అని, నేటి సమాజంలో పిల్లలు ఎన్నో రకాల వేధింపులు, ఇతర సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీటిని ఎదుర్కొనే ధైర్యాన్ని పిల్లల్లో కలిగించాలని సూచించారు. బాల్యదశ నుండే పెరుగుతున్న మొబైల్ ఫోన్, డిజిటల్ మీడియాల వినియో గం, మాదక ద్రవ్యాల ప్రభావంపై నిరంతరం నిఘా ఉండాలన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ప్రతి పాఠశాలలో రికార్డుల ప్రకారం ఒక్కరే ఉన్నప్పటికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లలు వేధింపులు, అసభ్యకర ప్రవర్తన లాంటి ఎలాంటి ఇబ్బందుల కు గురైనా వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేలా విద్యాసంస్థలు చూడాలే తప్ప తమ విద్యాసంస్థ విలువ పడిపోతుందన్న భావనతో ఆ విషయాన్ని దాచిపెట్టి తమంతట తాము నచ్చచెప్పి సెటిల్మెంట్ చేసే యత్నాలు చేస్తే వారు సైతం చట్టప్రకారం శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు, న్యాయవ్యవస్థలో న్యాయసేవలు అందుకోలేని అణగారిన వారికోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు ఉచిత న్యాయసేవలు అందిస్తున్నాయన్నారు. ఈ అవగాహనా కార్యక్రమం ద్వారా చైల్డ్ ప్రొటెక్షన్ అధికార్లకు సంబంధిత చట్టాల పట్ల సమగ్ర అవగాహన కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నయ్య, కుషాయిగూడ ఎసిపి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.






## ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆటోల నిర్ణయం వద్దు

### ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్ యూనియన్ డిమాండ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆటోలను తీసుకొని వచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ ఏఐటియుసి జిల్లా ఆటో రిక్షా డ్రైవర్ యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం మల్కాజిగిరి రైల్వేస్టేషన్ ప్రాంగణంలో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి, మహేందర్, సాయి, ఆరీఫ్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనే కాంగ్రెస్ లక్ష్యం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** మౌలిక వసతుల కల్పనే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్కిల్ మహదేవపురం, షిరిడీ హిల్స్, సాయిగ్రామ్, బాలయ్య నగర్, రావి నారాయణ రెడ్డి తదితర ప్రాంతాలలో సుమారు రూ.2.41 కోట్ల వ్యయంతో అంతర్గత సిమెంటు రోడ్డు పనులకు కూన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో త్వరలోనే మరో యాబై కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో కోట్ల రూపాయల నిధులను ఎప్పుడూ తెచ్చిన దాఖలాలు లేదని అన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో బిఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సర్ కార్యక్రమాన్ని ఈ నెల పదవ తేదీ వరకు పొడిగించారని, తప్పనిసరిగా ఓటర్లందరు తమ వివరాలను సమర్పించాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తినా తాను ముందుండి పరిష్కరిస్తానని అన్నారు. బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా ప్రజలకు మౌలిక వసతులను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని పేర్కొన్నారు. నియోజకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్యులు శ్రీధర్ బాబు సహకారంతో మరిన్ని నిధులను తీసుకువస్తానని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి డిసిసి ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్, నాయకులు బుచ్చిరెడ్డి, ప్రసాద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు అవసరం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** వర్షాకాలం మొదట్లో సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం మన బాధ్యత అని ట్రస్మా స్టేట్ అసోసియేట్ అధ్యక్షులు లయన్ కె.రామేశ్వర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ పద్మారావునగర్‌లోని ఆర్ఎస్‌కె హైస్కూల్ ఆవరణలో, మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ ఆంజనేయులు, రవి కుమార్, కిషోర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



## ప్లేస్‌మెంట్ విజయానికి అనురాగ్‌లో శిక్షణ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్లేస్‌మెంట్‌లలో విజయం సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో అనురాగ్ విశ్వవిద్యాలయంలో మూడురోజుల ప్రత్యేక శిక్షణా శిబిరం నిర్వహించారు. ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఇంటర్వ్యూ నైపుణాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. అనురాగ్ విశ్వవిద్యాయం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సమాచార సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో ఐఈఈఈఎస్ఐటీ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో జులై 27 నుంచి 29 వరకు కెరీర్ క్యాటలిస్ట్ ప్లేస్‌మెంట్ విజయానికి యాప్టిట్యూడ్, రీజనింగ్ అంశంపై మూడు రోజుల శిక్షణ శిబిరం నిర్వహించారు. నాలుగో సంవత్సరం బి.టెక్ సమాచార సాంకేతిక కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొనగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)కు చెందిన సాంకేతిక శిక్షకురాలు డి.భవాని అప్టిట్యూడ్, తార్కిక ఆలోచన గణిత సామర్థ్యం, సమయ నిర్వహణ ఇంటర్వ్యూ వ్యూహాలపై శిక్షణ అందించారు. కార్యక్రమాన్ని డా.జి.ఎల్ ఆనంద్ బాబు, సమన్వయం చేయగా డా.నితీషా శర్మ విద్యార్థులు ఇలాంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జి.శేఖర్ రెడ్డి, కార్యక్రమ నిర్వహణలో భాగస్వామ్యమయ్యారు. భవిష్యత్తులోనూ ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## జవహర్ నగర్‌లో దారి దోపిడీ

### లిఫ్ట్ పేరిట బైక్ ఆపి నగదు, గూగుల్ పే ద్వారా సొమ్ము అపహరణ

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కిన ఓ వ్యక్తి, మరికొందరితో కలసి ఓ వ్యక్తిని బెదిరించి నగదు, ఆన్‌లైన్ బదిలీ ద్వారా సొమ్ము గుంజిన సంఘటన జవహర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. జవహర్ నగర్ ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... కీసరలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ఆవుల పద్మారావు (52) జులై 31వ తేదీ రాత్రి సుమారు 7:45 గంటల సమయంలో చిన్న పని నిమిత్తం జవహర్‌నగర్ లోని అంబేద్కర్ నగర్‌కు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అంబేద్కర్ నగర్ బోర్డు సమీపంలో సుమారు 23 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని యువకు డు ఆయనను లిఫ్ట్ అడిగాడు. మానవత్వంతో పద్మారావు సదరు యువకుని బైక్‌పై ఎక్కించుకోగా, కొద్ది దూరం వెళ్లాక ఆ యువకుడు బైక్‌ను సమీపంలోని ఒక సందులోకి తీసుకువెళ్లాడు. వెంటనే అక్కడికి మరికొందరు వ్యక్తులు చేరుకు ని పద్మారావు బైక్‌ను అడ్డుకున్నారు. ఆయనను బలవంతంగా లోపలికి తీసుకెళ్లి భయభ్రాంతులకు గురిచేశారు. బాధితుని వద్ద ఉన్న రూ.4,000/– నగదును లాక్కున్నారు. అంతేకాకుండా ఆయన మొబైల్ ఫోన్ నుండి మరొకరి ఖాతాకు రూ,800/– గూగుల్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఈ విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరిస్తూ నిందితులు అక్కడి నుండి పరారయ్యారు.

**కేసు నమోదు, దర్యాప్తు:** బాధితుడు పద్మారావు ఫిర్యాదు మేరకు జవహర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## 'ఆపరేషన్ ముస్కాన్'తో 125మంది చిన్నారులకు రక్షణ

**ప్రజాపక్షం/వికారాబాద్:** చిన్నారుల హక్కుల పరిరక్షణ; బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ , భిక్షాటనలో ఉన్న పిల్లల రక్షణ, విద్యకుదూరమైన చిన్నారులను తిరిగి విద్యావ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా వికారాబాద్ జిల్లా పోలీసులు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో 125మంది చిన్నారులను రక్షించినట్లు జిల్లా ఎస్పి స్నేహమెహ్రా తెలిపారు. జిల్లా ఎస్పి తెలిపిన వివరాల ప్రకారం గత నెల ప్రారంభం నుంచి, జులై 31 వరకు మొత్తం 125 చిన్నారులకు రక్షణ కల్పించారు, వీరిలో 116 మంది బాలురు, 9మంది బాలికలు ఉన్నారు. మొత్తం 97మందికి కార్మికులకు విముక్తి కల్గించారు. భిక్షాటనలో ఉన్న ఒక చిన్నారిని రక్షించడంతో పాటు బాల్యవివాహాన్ని అడ్డుకుని కాపాడినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 41 మంది చిన్నారులను కూడా రక్షించినట్లు ఎస్పి తెలిపారు. .

## గూడూరులో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

కొత్తూరు మాజీ ఎంపిపి పిన్నింటి మధుసూదన్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** రాత్రి సమయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపిపి పిన్నింటి మధుసూదన్‌రెడ్డి వివరించారు. శనివారం కొత్తూరు మండల పరిధిలోని గూడూరు గ్రామంలో పెండ్లిమడుగు రాజు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైన్లను మాజీ ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరు మండలంలోని వివిధ గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను త్వరలోనే ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని వివరించారు. మండలంలోని గూడూరు గ్రామం నుండి ఈ పనుల కు శ్రీకారం చుట్టడం జరుగుతుందని, ఇందుకు ప్రజలందరు సహాకరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజలందరి సౌకర్యార్థం ఏర్పాటు చేస్తు న్న ఈ కార్యక్రమాలకు ప్రజలందరు ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో అభినందనీయమని వివరించారు. ముమ్మందు సమాజ సేవా కార్యక్రమాలను చే సేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టె డి నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ మీసాల ఆరోగ్యం, రాములు గౌడ్, సర్పంచ్ మీనాక్షీ దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 31లోగా ఇకెవైసి, బయోమెట్రిక్ పూర్తి చేసుకోండి

**ప్రజాపక్షం/కేశంపేట:** అర్హులైన రేషన్ కార్డు లబ్దిదారులు ఆగస్టు 31వ తేది వరకు ఈకెవైసీ, బయోమెట్రిక్ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు కృషి చేయాలని సర్పంచ్ సులోచన శ్రీను సూచించారు. శనివారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి సర్పంచ్ సులోచన శ్రీను గ్రామస్తులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సులోచన శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను నిర్విరామంగా అందుకోవాలంటే ప్రతి లబ్ధిదారుడు విదిగా ఇకెవైసి, బయోమెట్రిక్ నమోదు చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు సంబంధిత మీసేవా కేంద్రాలకు వెళ్ళి ఇకెవైసి, బయోమెట్రి నమోదు చేయించుకుంటే భవిష్యత్ వచ్చే పథకాలు పూర్తి స్థాయిలో వర్తిస్తాయని తెలిపారు. గ్రామాల నుండి వచ్చే ప్రజలకు అధికారులు, మీ సేవా కేంద్రాల నిర్వాహకులు సహాకరించేందుకు కృషి చేయాలని సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి 50కుర్చీల బహుకరణ



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రభుత్వ ఆసుపత్రికి 50కుర్చీలను బహుకరించారు. శనివారం కేశంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ కుమారుడు వై. మురళీ కృష్ణ యాదవ్ 50కుర్చీలను అంధించారు. అదే విధంగా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి అవసరం ఉన్న మేరకు సహాయ సహకారాలు అంధించేందుకు కృషి చేస్తానని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏమైన వైద్య పరికరాలు అవసరం ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అంధించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానిక డాక్టర్ ముర్తుజాకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అంధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి 50కుర్చీలు అంధించిన మురళికృష్ణ యాదవ్‌కు వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ వేణుగోపాలచారి, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, నాయకులు జమాల్‌ఖాన్, శ్రీనివాస్, రామకృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## యాచారం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పంబాల అంజనేయులు



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక శనివారం యాచారం మండల కేంద్రంలోని సాయిశరణం గార్డేన్‌లో జరిగింది.మండలానికి చెందిన వివిధ దినపత్రికల రిపోర్టర్లు ఈ సమావేశానికి హజరైనారు. మండలంలో జర్నలిస్టులు ఎదురుకుంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. నూతన ప్రెస్ క్లబ్ యాచారం మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా పంబాల అంజనేయులు, అలంపల్లి రవిందర్,, ఉపాధ్యక్షులుగా ఎట్టి లక్ష్మ య్య, గుండే రాఘవేందర్, పంచార కార్యదర్శిగా నరేంధర్‌రెడ్డి, కోశాధికారిగా మడ్డి యాదగిరి,గౌరవ అధ్యక్షులుగా మక్కపల్లి శ్రీనివాస్,సహాయకార్యదర్శులుగా రాంచందర్, నరేంధర్,లు ఎన్నికైనారు. నూతనంగా ఎన్నికైన అంజనేయులు మాట్లాడుతూ విలేకరుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. అర్హులైన విలేకరులందరికి ఇండ్లస్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. నాపై ఎం తో నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టిన పెద్దలకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

## చౌరస్తా విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** చౌరస్తా విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంతోపాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులు పేర్కొన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆర్‌ఎన్ రాము ఆధ్వర్యంలో మానవ హారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. చౌరస్తా విస్తరణ చేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడమే కాకుండా పట్టణం అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు, వ్యాపారులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకొని ముందుకు సాగాలని కోరారు. ప్రజలు అన్ని విధాల అభివృద్ధి సాధించడంతోపాటు ట్రాఫిక్ లేని పట్టణంగా మారే అవకాశాలు ఉంటాయని, అధికారులు నాన్చుడు దోరణి అవలంభించకుండా పనుల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



# వాక్ ఫ్రీ డ్రైవ్‌లో 15 ప్రాంతాల్లో 313 ఆక్రమణల తొలగింపు







17.95 కి.మీ మేర ఫుట్‌పాత్‌లు రహదారులు ఆక్రమణల నుంచి విముక్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలకు ఫుట్‌పాత్‌లు, రహదారులు అందుబాటులో ఉంచే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) చేపడుతున్న 'వాక్ ఫ్రీ' కార్యక్రమంలో భాగంగా 15 గుర్తించిన ప్రాంతాల్లో విస్తృతంగా ఆక్రమణల తొలగింపు చేపట్టింది. ఈ డ్రైవ్‌లో మొత్తం 17.95 కిలోమీటర్ల పరిధిలో 313 ఆక్రమణలను తొలగించి ప్రజా ప్రదేశాలను తిరిగి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. శేరిలింగంపల్లి జోన్‌లో 8.5 కిలోమీటర్ల మేర 106 ఆక్రమణలు తొలగించారు. ఇందులో నార్సింగిలో 30, పటాన్‌చెరులో 15, అమీన్‌పూర్‌లో 27, మియాపూర్‌లో 18, శేరిలింగంపల్లిలో 16 ఆక్రమణలు తొలగించినట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి జోన్‌లో 2.6 కిలోమీటర్ల పరిధిలో 53 ఆక్రమణలు తొలగించారు. మాధాపూర్‌లో 22, ఆల్విన్ కాలనీలో 11, కూకట్‌పల్లిలో 20 ఆక్రమణలను తొలగించారు. కుత్బుల్లాపూర్ జోన్‌లో 6.85 కిలోమీటర్ల మేర 154 ఆక్రమణలు తొలగించారు. చింతల్లో 18, జీడిమెట్లలో 27, కొంపల్లిలో 16, గాజుల రామారంలో 12, నిజాంపేట్‌లో 42, దుండిగల్‌లో 18, మేడ్చల్‌లో 21 ఆక్రమణలు తొలగించినట్లు చెప్పారు. తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ ఆక్రమణలు జరగకుండా ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. పాదచారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ప్రజా ప్రదేశాలను ఆక్రమణల నుంచి విముక్తంగా ఉంచడం లక్ష్యంగా 'వాక్ ఫ్రీ' కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన అన్నారు.

### 'ప్రాజెక్ట్ ఉద్వాసన'లో 100 కిలోలకు పైగా దివ్య వ్యర్థాల సేకరణ

ఆధ్యాత్మిక విశ్వాసాలకు గౌరవం కల్పిస్తూనే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) చేపట్టిన 'ప్రాజెక్ట్ ఉద్వాసన డివైన్ డ్రైవ్'కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్.బి. నగర్ జోన్‌లలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 100 కిలోలకు పైగా దివ్య వ్యర్థాలు సేకరించినట్లు అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ తెలిపారు. ఉప్పల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, మల్కాజిగిరి జోన్‌లో నేరేడ్‌మెట్ ముదుగుళ్ల ఆలయం, ఎల్.బి. నగర్ జోన్‌లో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయాలను ప్రత్యేక కేంద్రాలుగా ఏర్పాటు చేసి పాత దేవతామూర్తులు, చిత్రపటాలు, ఫ్రేములు, ఇతర పవిత్ర వస్తువులను సేకరించారు.ప్రజలు అందజేసిన పవిత్ర వస్తువులను చెరువులు, నాలాలు, రహదారులపై పారవేయకుండా సంప్రదాయబద్ధంగా ఉద్వాసన నిర్వహించిన అనంతరం పర్యావరణహిత రీసైక్లింగ్‌కు తరలించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడమే 'ప్రాజెక్ట్ ఉద్వాస న' ప్రధాన ఉద్దేశమని రఘు ప్రసాద్ చెప్పారు. నగర పరిశుభ్రత, జలవనరుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన ప్రజలను కోరారు.

## అన్ని దానాల్లోకెల్ల అన్నదానం గొప్పది

**ప్రజాపక్షం/మియాపూర్ :** ఆకలిగొన్న వారి ఉచితంగా అన్న వితరణ చేయ డం మానవీయతకు నిదర్శనం అని హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ అన్నారు. భారీ స్థాయిలో అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొండ విజయ్ కుమార్ హాజరై ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన కొన్ని ఏళ్లుగా ఉచితంగా పోషక విలువలతో కూడిన భోజనం ఉచితంగా అందజేయడం జరుగుతుందని అన్నారు. చందానగర్‌లోని గంగారం హోప్ ఫౌండేషన్ కార్యాల యం వద్ద ఉచిత భోజనం అందించడం ద్వారావేలాది మంది ఆకలిని తీర్చగలగడం గొప్ప పరిణామమన్నారు.



## ముర్రుపాలు తాగిస్తేనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నవజాత శిశువులు ఆరోగ్యంగా ఉండాలంటే ముర్రుపాలు తాగిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండే అవకాశాలు ఉంటాయని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు వివరించారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు పరిధిలోని షాద్‌నగర్ ఏసబ్ సెంటర్ ఆవుట్‌రేచ్ ఏరియాలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వ్యాధి నిరోధక కార్యక్రమంలో తల్లిపాల వారోత్సవాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లిపాలను తాగించేందుకు కృషి చేయాలని సూచించారు. ముర్రు పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కారామని, మహిళలు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా కృషి చేయాలని పేర్కొన్నారు. జన్మనించి నప్పటి నుండి తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలల తరువాత అదనపు ఆహారం ప్రారంభించినప్పటికి రెండేళ్ళు లేదా అంటే ఎక్కువ కాలం తల్లిపాలు బిడ్డకు ఇవ్వాలని సూచించారు. తల్లిపాల ద్వారానే శిశువుకు అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా అందడంతోపాటు రోగ నిరోధక శక్తి పెరిగి విరేచనాలు, న్యూమోనియా, చెవి ఇన్‌ఫెక్షన్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. మొదడు ఎదుగుదల, జ్ఞాపకశక్తి తెలివితేటలు సైతం మెరుగు పడే అస్కారం ఉంటుందని తెలిపారు. తొలి ఆరు నెలల వరకు నీరు, తేనే, గ్లూకోజ్ నీరు, ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, రాత్రి, పగలు అనే తేడా లేకుండా శిశువుకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టిచర్ జయమ్మ, ఏఎన్‌ఎం ఇస్తేరు రాణి, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## కాలేజీ యాజమాన్య వేధింపులే శ్రావ్య ఆత్మహత్యాయత్నానికి కారణం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కనీస వసతులు లేకుండా, అర్హత కలిగిన అధ్యాపకులు లేకుండా నడుపుతున్నరని అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్ పేటలోని నేతాజీ నర్సింగ్ కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు శ్రావ్య అనే విద్యార్థినిని వేధింపులకి గురి చేయటం వలన ఆమె ఆత్మహత్య యత్నం చేసిందని,అందుకు కారణమైన యాజమాన్యం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమా(ఎఐఎస్‌ఎఫ్)అఖిల భారత యువజన సమా(ఎఐవైఎఫ్)ఆధ్వర్యంలో శనివారం కాలేజీ ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతులు లేకుండా నడిపుతున్నాయని వాటి దారిలోనే నేతాజీ నర్సింగ్ కాలేజీ కూడా ఉండాల్సిన కనీస వసతులు, అర్హత,అనుభవం కలిగిన అధ్యాపకులు లేకుండా నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయమని అడిగిన శ్రావ్య అనే విద్యార్థినిని లక్ష్యంగా కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు నిరంతరం వేధింపులకి గురిచేయటంతో ఆ అమ్మాయి జులై 12 నాడు కాలేజీ భవనంపై నుండి దూకి ఆత్మహత్య యత్నం చేసిందని ఈ సంఘటనలో ఆమె రెండు కాళ్ళు పూర్తిగా విరిగిపోయాయన్నారు. ఇప్పటి వరకు కూడా కాలేజీ యాజమాన్యం అమ్మాయిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ఇతర ప్రాంతాల ఎమ్మెల్యల అనుచరులమని అమ్మాయి తల్లిదండ్రులకి ఫోన్‌లు చేయించి బెదిరింపులకి గురిచేయటం దుర్మార్గమన్నారు. తక్షణమే కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ అధికారులు స్పందించి నేతాజీ నర్సింగ్ కాలేజీ అనుమతులని రద్దు చేసి కాలేజీ యాజమాన్యం పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే భవిష్యత్తు మీద ఎంతో ఆశతో కాలేజీకి వచ్చి యాజమాన్యం వేధింపుల కారణంగా తీవ్రంగా గాయపడి రెండు కాళ్ళు విరిగిన శ్రావ్యకి మెరుగైన వైద్యం అందించి ఆమెకి న్యాయం చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్,మహిళా కో కన్వీనర్ పార్వతి,ని ఖిల్, ఎఐవైఎఫ్ అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షుడు శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పొడిగింపు సమయాన్ని నాణ్యత పెంపునకు వినియోగించాలి

భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పొడిగించిన నేపథ్యం లో, లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశానికి హాజరైన భారత ఎన్నికల సంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, కె చంద్రారెడ్డిలు ఘన స్వాగతం పలికా రు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ, ఇప్పటి వరకు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు. ప్రారంభంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే డిజిటైజేషన్ వేగం తక్కువగా ఉండటంతో పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో,ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫోటోలు, పత్రాల అప్‌లోడ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ,ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా,నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొ త్తం 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని,ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,056 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు.

## గురుకుల పాఠశాలలో శాశ్వత నీటి సమస్య పరిష్కారం

**ప్రజాపక్షం/కొత్తూరు:** గిరిజన గురుకుల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. శనివారం కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో కేశంపేట మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ సొంత నిధులతో బోరు వేయించారు. గిరిజన గురుకుల పాఠశాలలో తీవ్ర నీటి సమస్య ఉందని ఉపాధ్యాయ బృందం స్థానిక సర్పంచ్ లలిత గోపాల్‌నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో సర్పంచ్, గ్రామస్తులు మాజీ ఎంపిపి రవీందర్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్ళారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం పడుతున్న ఇక్కట్లు వివరించారు. వెంటనే స్పందించిన వీరందర్ యాదవ్ అధ్యాపకులు, గ్రామస్తులతో మాట్లాడి సొంత ఖర్చులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పెంటనోళ్ళ యాదగిరి, సర్పంచ్ నర్సమ్మ శ్రీను, మాజీ సర్పంచులు జంగయ్య, సంతోష్ నాయక్, రమేష్, మాజీ ఎంపిటిసి వడ్డె బాలయ్య, నాయకులు మిట్టునాయక్, నరసింహా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యుకె ఉద్యోగాల పేరుతో రూ.5 కోట్లకు పైగా టోకరా..

27 మంది బాధితులు.. కేసు నమోదు చేసిన సిసిఎస్ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లో టియర్–2 వర్క్ వీసాలు, ఉద్యోగాలు, స్పాన్సర్‌షిప్‌లు ఇప్పిస్తామని నమ్మించి 27 మంది నుంచి రూ.5 కోట్లకు పైగా వసూలు చేసిన అంతర్జాతీయ మోసగాళ్ల ముఠాపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. యుకెలో స్థిరపడే అవకాశం కల్పిస్తామని ఆశ చూపి కోట్ల రూపాయలు వసూలు చేసి, చివరకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సైదాబాద్‌కు చెందిన మహ్మద్ అయూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు ప్రకారం.. 2022లో యూకేలో నివసిస్తున్న మహ్మద్ షాహెద్‌ను తన బంధువు ద్వారా పరిచయం చేశారు. యుకెలో హెల్త్‌కేర్, ఐటి, పేరోల్, నిర్మాణ రంగాలతో పాటు పలు విభాగాల్లో టియర్–2 వర్క్ వీసాలు, ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మిన మహ్మద్ అయూబ్ తన సోదరుడు ముజ్తబా, బంధువులు, స్నేహితులు సహా మొత్తం 27 మంది అభ్యర్థుల నుంచి డబ్బులు సేకరించి నిందితులకు అందజేశాడు. 2023 ఫిబ్రవరి నుంచి 2025 వరకు నగదు, ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీలు, విదేశీ బ్యాంకు ఖాతాల ద్వారా రూ.5.05 కోట్లకు పైగా చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల నమ్మకం పొందేందుకు ముగ్గురికి యుకె వీసాలు ఇప్పించినప్పటికీ, అక్కడికి వెళ్లిన తర్వాత హామీ ఇచ్చిన ఉద్యోగాలు కల్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలల తరబడి వివిధ కారణాలు చెబుతూ వేచి పెట్టి, చివరకు స్పాన్సర్‌షిప్ రద్దయిందని చెప్పడంతో వారు తీవ్ర ఆర్థిక నష్టంతో తిరిగి భారత్‌కు రావాల్సి వచ్చిందని తెలిపారు. వీసా ప్రక్రియ ఆరు నెలల్లో పూర్తికాకపోతే మూడు నెలల్లో డబ్బు తిరిగి ఇస్తామని చెప్పినా, ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదని ఆరోపించారు. వీసా అపాయింట్‌మెంట్లు, వైద్య పరీక్షలు, స్పాన్సర్ ఆమోదం, యూకే అధికారుల అనుమతులు ఆలస్యం అవుతున్నాయని చెబుతూ బాధితులను నమ్మించిన నిందితులు, చివరకు 2026 మార్చిలో డబ్బులు తిరిగి ఇవ్వబోమని స్పష్టంగా చెప్పి, చట్టపరంగా ఏం చేయాలనుకుంటే చేసుకోవచ్చని సవాల్ చేసినట్లు ఫిర్యాదులో వెల్లడైంది. ఈ మోసానికి యుకెలో ఉన్న మహ్మద్ షాహెద్ ప్రధాన సూత్రధారి కాగా, అతని భార్య అఫ్షా జబీన్, సోదరుడు సాదిక్ మహ్మద్, బంధువులు రిఫా తస్లీన్, నస్రీన్ బేగం, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ నసీరుద్దీన్ అలియాస్ అదీమ్ తదితరులు డబ్బుల సేకరణ, బ్యాంకు ఖాతాల వినియోగం, బాధితులతో సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఇమ్రాన్, శామ్ అనే వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు చేయాలని బాధితుడు కోరాడు. ఫిర్యాదు ఆధారంగా బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ ఆధారాలు, వాట్సాప్ చాట్స్, ఆడియో రికార్డులు, వీసా పత్రాలు, విదేశీ ఖాతాల వివరాలను సేకరిస్తూ నిందితులపై మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసపోయిన ఇతర బాధితులు కూడా ముందుకు వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసంపై ఇఒడబ్ల్యు ఉక్కుపాదం

పుణెలో ఇద్దరు కీలక నిర్వాహకుల అరెస్ట్..





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇ కామర్స్, డైరెక్ట్ సెల్లింగ్ పేరుతో అధిక ఆదాయం వస్తుందని నమ్మించి రెండు కుటుంబాల నుంచి రూ.28 లక్షలు వసూలు చేసిన మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) మోసంలో హైదరాబాద్ సిటీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యూ) కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసులో క్యునె ట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్‌కు చెందిన ఇద్దరు ఇండిపెండెంట్ ప్రతినిధులు పదామ టి సురేందర్ రెడ్డి, పర్విందర్ సింగ్‌లను పూణేలో అరెస్ట్ చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితులను అధిక లాభాల పేరుతో ఆకర్షించిన నిందితు లు, బజాజ్ ఫైనాన్స్ ద్వారా వ్యక్తిగత రుణాలు ఇప్పించి మొత్తం రూ.28 లక్షలు వసూలు చేశారు. అనంతరం ఇది ఈకామర్స్ వ్యాపారం కాదని, బైనరీ చైన్ ఆధారిత మల్టీ లెవల్ మార్కెటింగ్ పథకమని బాధితులు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో సంస్థ డైరెక్టర్ దిలీప్‌రాజ్ పుక్కెల్లాను ఇప్పటికే మే 27న అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డిసిపి ఎస్. చైతన్య కుమార్ ప్రజలను హెచ్చరిస్తూ.. కొత్త సభ్యులను చేర్పితేనే ఆదాయం వస్తుందని చెప్పే పిరమిడ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లకు దూరంగా ఉండాలని, ఇటువంటి మోసాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## ఎఐటియుసి జిల్లా మహాసభలను జయప్రదం చేయండి: దత్తు నాయక్

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఎఐటియుసి జిల్లా మహాసభలను జయప్రదం చేయలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తు నాయక్ కోరారు.రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ లోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎఐటియుసి నాలుగవ రంగారెడ్డి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.రంగారెడ్డి జిల్లాలో 27 మండలాల నుంచి వచ్చే ప్రతినిధులు హాజరవుతారు ఆయా మండలాలలో సమస్యలు,మొత్తం జిల్లా వారిగా తీసుకుని నిర్ణయాలు,రాష్ట్ర కమిటీ నిర్ణయాలు ఈ మహాసభలలో చర్చించి స్థానిక సమస్యలను తీర్మానం చేసుకొని భవిష్యత్తు పోరాటాలకు ఈ మహాసభ నాంది పలకాల్సిన అవసరం ఉందని, ఈ మహాసభలకు వచ్చే ప్రతినిధులకు అందరికీ ఏర్పాట్లు మహేశ్వరం డివిజన్ ఆహ్వాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయగలరని కోరుచున్నట్లు తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బోనాల సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన చెక్కులని మహేశ్వరం ఎంఎల్‌ఎ పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర టియు ఎఫ్ఐడిసి చైర్మన్,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి,ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చెన్నారెడ్డి పంపిణీ చేశారు. అందులో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని జిల్లెల్లగూడ మచ్చ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల అభివృద్ధి కొరకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎం ఎల్ ఎ సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర టియుఎఫ్ఐడిసి చైర్మన్,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చెన్నారెడ్డి, మహేశ్వరం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచెన్న గారి లక్ష్మారెడ్డి,పాల్గొని ఆలయాల అభివృద్ధి కోసం 33 చెక్కులను అర్చకులు, ఆలయ కమిటీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేయడం, కొత్తగా ఏర్పడిన ఆలయాలకు కూడా సహాయం అందించేలా చర్యలు తీసుకోవడం ద్వారా ఆధ్యాత్మిక రంగానికి విశేష ప్రోత్సాహం అందించారని తెలిపారు. అంతేకాకుండా,బోనాల సందర్భంగా ఆలయాల అభివృద్ధి నిధుల కోసం కొత్తగా దరఖాస్తు (అర్జీ)చేసుకున్న అర్హులైన వారందరికీ కూడా ఇలాంటి చెక్కులను ప్రభుత్వం త్వరితగతిన అందజేయాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతం నరసింహారెడ్డి,రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పైళ్ల శేఖర్ రెడ్డి, స్థానిక మీర్పేట్ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి,జిల్లెలగూడ అధ్యక్షులు సిద్దాల శ్రీశైలం,58 డివిజన్ అధ్యక్షులు ఏడు దొడ్ల సురేందర్ తదతరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
02-08-2026
www.prajapaksham.in



## హామీల అమలులో విఫలం




**ప్రజాపక్షం/కవాడిగూడ:** ఎన్నికల సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని బిజెపి జాతీయ ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మ ణ్ విమర్శించారు. శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నాచౌక్ వద్ద టీచర్లు చేపట్టిన మహా ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, ఎమ్మెల్యే మాలకొండయ్య, కారం వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, సంఘం నాయకులు భాస్కర్, నవీన్, సంధ్యారాణి, ఉషారాణి, ఉమా, శ్రీనివాస్ గౌడ్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటి సరఫరా



**ప్రజాపక్షం/కవాడిగూడ:** గత కొద్ది నెలలుగా గాంధీనగర్ డివిజన్ పరిధిలోని టిఆర్‌టి క్వార్టర్స్‌లో కలుషిత నీరు సరఫరా జరుగుతోందని బిజెపి సికింద్రాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ అధికారులపై మండిపడ్డారు. సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రత్న సాయిచంద్, ఆనంద్‌రావు, సాయి గౌడ్, శ్యామ్, స్థానికులు మధుమతి, శాంసన్,అజయ్,విష్ణు, వంశీ, సోలమన్, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

## ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** వెర్చ్ కన్సల్టింగ్ ఎల్‌ఎల్‌పి వ్యవస్థాపకుడు, సీఈఓ డా.చిక్కాల వేణుగోపాల్‌రావు ప్రతిష్ఠాత్మక బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. అవార్డును రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రావు మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని తనకు అందించిన తెలంగాణ గవర్నర్, కార్యక్రమ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బోనాల చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** దేవుని తోట ఆలయంలో బోనాల పండుగకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆలయ కమిటీ నిర్వాహకులకు అందించడం జరిగింది. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ యువనేత ముఠా జయసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, కొండ శ్రీధర్‌రెడ్డి, రాకేష్ కుమార్, శ్యామ్‌యాదవ్, శంకర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి కమిటీ సమావేశం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** బోనాల పండుగ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు, బస్తీ పెద్దలతో ఖైరతాబాద్ పోలీసులు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఖైరతాబాద్ సిఐ బి.వెంకట్‌రెడ్డి, అడ్మిన్ ఎస్ఐ ఎండి సమీర్ పాల్గొని బోనాల పండుగను శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని, సామాజిక సామరస్యాన్ని కాపాడాలని కోరారు.

## గంగపుత్ర జెఎసి ఆధ్వర్యంలో బోనాలు



**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** మొక్కులు తీర్చే మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ మేరకు వారాసిగూడ గంగపుత్ర జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం బోనాలను నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. కార్యక్రమంలో గంగపుత్ర సంఘాలు, సొసైటీలు, మహిళా సంఘాలు ఏకమై ఈ పండుగను నిర్వహించనున్నారు.

## రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి : ప్రొ.హరగోపాల్

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** దేశవ్యాప్తంగా మావోయిస్టులనే ఆరోపణలతో ఎంతోమంది రాజకీయ ఖైదీలు జైళ్లలో మగ్గుతున్నారని, వీరందరినీ వెంటనే విడుదల చేయాలని రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక తెలంగాణ కన్వీనర్ ప్రొ.హరగోపాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో సుమారు 50 మంది రాజకీయ ఖైదీలు జైళ్లలో ఉన్నారని, వీరిలో చాలామంది అనారోగ్య సమస్యలు, వయోభారంతో బాధపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా, ప్రజా సంఘాల నేతలపై పెట్టిన అక్రమ ఉపా కేసులను ఎత్తేయాలని కోరారు. సమావేశంలో వేదిక కో– కన్వీనర్లు ప్రొఫెసర్లు గడ్డం లక్ష్మ ణ్, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# తయారీ రంగంలో కాగిత పరిశ్రమకు కీలక స్థానం

### తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత తయారీ రంగంలో కాగిత పరిశ్రమ కీలకమైన స్థానాన్ని ఆక్రమించిందని తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి అన్నారు. ప్రపంచ పోటీతత్వంలో కొనసాగించాలంటే కాగిత పరిశ్రమ ఆవిష్కరణలు, సుస్థిరత, సాంకేతిక పురోగతిని స్వీకరించాలని సూచించారు. హైదరాబాద్ ఎఫ్‌టిసిసిఐలో శనివారం ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎఫ్‌పిటిఎ), తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ (టిపిఎంఎ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జాతీయ కాగిత దినోత్సవ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పర్యావరణహిత ప్యాకేజింగ్, రీసైక్లింగ్ విధానాలపై దృష్టిసారిస్తే కాగిత పరిశ్రమ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టిజిఐపాస్ ద్వారా 30 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. పేపర్, పేపర్‌బోర్డు ప్యాకేజింగ్ రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టంచేశారు. టిపిఎంఎ అధ్యక్షులు డాక్టర్ నరేంద్ర పర్చూరి మాట్లాడుతూ కాగిత పరిశ్రమ పురోగతికి, మరిన్ని పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం తరపున తమ సంపూర్ణ మద్దతు, సహకారం కొనసాగుతుందన్నారు. ఎఫ్‌పిటిఎ అధ్యక్షులు టి.కిషన్ సింగ్, టిపిఎంఎ గౌరవ కార్యదర్శి అశిశ్ జైన్ భన్సాలీ మాట్లాడుతూ పేపర్, పేపర్ బోర్డు ప్యాకేజింగ్ ఉత్పత్తులపై ప్రస్తుతమున్న 18 శాతం జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షులు కె.కె.మహేశ్వరి మాట్లాడుతూ ఐటిసి భద్రాచలం యూనిట్ ఒక్కటే ఏటా దాదాపు 10 లక్షల టన్నుల కాగితం ఉత్పత్తి చేస్తుండటం ఈ రంగం సాధించిన అభివృద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టిపిఎంఎ అధ్యక్షులు అభిషేక్ విజయవర్గియా, టోపా అధ్యక్షులు రాధాకృష్ణ, ఎసిసిటి అధ్యక్షులు ఆదిత్య శర్మ, తెలంగాణ సిఎఐటి అధ్యక్షులు విమల్ కుమార్ పాల్గొన్నారు.

### యూరాలజికల్ క్యాన్సర్‌ల కచ్చిత చికిత్సపై..

# అంతర్జాతీయ సదస్సు ప్రారంభం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూరాలజికల్ క్యాన్సర్‌ల ఖచ్చితమైన చికిత్సా విధానాలపై చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా నిలిచింది. సొసైటీ ఆఫ్ జెనిటోయూరినరీ ఆంకాలజిస్ట్స్ (సోగోకాన్) నిర్వహిస్తున్న 5వ వార్షిక సదస్సు సోగోకాన్ 2026 శనివారం నుంచి ప్రారంభమైంది. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, అపోలో హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రెండు రోజుల సదస్సుకు దేశ, విదేశాల నుంచి 200 మందికి పైగా ఆంకాలజిస్టులు, సర్జన్లు, రేడియేషన్ నిపుణులు, పాథాలజిస్టులు హాజరవుతున్నారు. 'ప్రెసిషన్ ఆంకాలజీ ఇన్ యాక్షన్' ప్రధానాంశంగా సాగుతున్న ఈ సదస్సులో ప్రోస్టేట్, బ్లాడర్, కిడ్నీ, టెస్టిస్, పీనిస్ క్యాన్సర్‌ల నిర్ధారణ, చికిత్సలో వస్తున్న పురోగతులపై చర్చలు జరుగుతున్నాయి. మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, రోబోటిక్ సర్జరీలు, ఆధునిక రేడియేషన్ టెక్నాలజీలు, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి అంశాలు శాస్త్రీయ కార్యక్రమంలో ప్రధానంగా చోటుచేసుకున్నాయి. సదస్సును ట్రస్టు బోర్డు సభ్యురాలు నారా బ్రాహ్మణి ప్రారంభించారు. ఖచ్చిత చికిత్స అంటే జియోమిక్స్, ఏఐ, టార్గెటెడ్ థెరపీల సమ్మేళనంతో పాటు మానవత్వం, కరుణతో వ్యవహరించడమని ఆమె అన్నారు. డాక్టర్ రాకేష్ శర్మ నేతృత్వంలోని యూరో ఆంకాలజీ బృందం ఈ దిశగా ముందుండటం గర్వకారణమన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సంజయ్ అడ్డా మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞాన మార్పిడి, బహుళ విభాగాల సమన్వయానికి సోగోకాన్ కీలక వేదికగా నిలుస్తోందన్నారు. సైంటిఫిక్ చైర్మన్ డాక్టర్ రాకేష్ ఎం. శర్మ మాట్లాడుతూ బసవతారకంఅపోలో భాగస్వామ్యం పరిశోధన, విద్యా రంగాల్లో ఉత్తమతను బలోపేతం చేస్తుందన్నారు. ప్రొఫెసర్ నోయెల్ క్లార్క్, ప్రొఫెసర్ మనీష్ కోఫ్లీ, డాక్టర్ జాన్ క్రిస్టోడొలియాస్, డాక్టర్ యాన్ షక్మన్, డాక్టర్ అలెజాండ్రో బెర్లిన్ తదితర అంతర్జాతీయ నిపుణులు భారతీయ ఆంకాలజిస్టులతో కలిసి పాల్గొన్నారు.

# ఇంటికి రక్ష ఇంకుడు గుంత



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** నీటి సమస్యకు చెక్ పెట్టేందుకు ఆలస్యంగానైనా ప్రజలు మేల్కొంటున్నారు. ఇందులో భాగంగానే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రకాష్‌నగర్ వార్డు పరిధిలోని మోతీలాల్ నెహ్రూనగర్ వినోద్ శ్రీ భాష్యం భవన యజమానులు సమర్థవంతమైన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని వర్షపు నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలిచారు. భవన యజమానులు కేవలం ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసీ) పొందేందుకు అవసరమైన నిబంధనలను పాటించడానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో పెరిగే నీటి అవసరాలు, భూగర్భ జలాల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సదరు భవన యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/రవీంద్రభారతి:** వేదం, జ్యోతిషం, పంచాంగం, సిద్ధాంతం, ఆగమం , ధర్మశాస్త్ర సంప్రదాయాల పరిరక్షణకు విశేషంగా కృషిచేస్తున్న తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాలు శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, దేవాదాయ, ధర్మదాయ కమిషనర్ ఎం.హనుమంతరావు, సిఎం ప్రజావాణి నోడల్ అధికారి కె.విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ మహోత్సవాలకు శ్రీశ్రీశ్రీ అభినోద్దండ విద్యాశంకర భారతీ స్వామి ముఖ్యఅతిథిగా విచ్చేసి, విద్వత్సభ సంహిత దశాబ్ది దీపిక'ను ఆవిష్కరించారు. తెలంగాణ విద్వత్సవభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి కోశాధికారి మరుమాముల వెంకటరమణ శర్మ స్వామి వారిని సత్కరించారు. రాష్ట్ర దేవాదాయశాఖ పరిధి ఆలయాల్లో ఆగమ సలహాదారులను నియమించాలని విద్వత్సభ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



**ప్రజా పక్షం / హైదరాబాద్ :** చార్మినార్ పరిధి లోనిహరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో 78వ వార్షిక బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా కె.ఆకాష్, ఉజ్వల్ అమ్మవారికి అక్షిత , అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ పూజారి రవినారాయణ వీరిపై అమ్మవారి కృప, కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు.

## ఎంజిబిఎస్ పరిసరాల్లో జులూం?

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** దేశంలోనే పేరొందిన ఎంజిబిఎస్ పరిసరాల్లో ప్రయాణీకులపై కొందరు స్థానికులు దౌర్జన్యానికి పాల్పడుతూ నిలువుదోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన దినసరి కూ లీల నుంచి అధిక మొత్తంలో వసూలు చేసేలా చేస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ వారిని సైతం బెదిరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికేతరులు కావడంతో వారు స్వస్థలాలకు చేరుకునే తొందరలో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మౌనంగా వెళ్లిపోతున్నట్లు సమాచారం.కోత్వాల్ సజ్జనార్ దృ ష్టి సారించి ఎంజిబిఎస్ పరిసరాల్లో నెలకొన్న గూ ం డాయిజానికి చెక్‌పెట్టాలని కోరుతున్నారు.

## గిరిజా చంద్రన్‌కు 'మీనాక్షి అమ్మ' అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/రవీంద్రభారతి:**శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ గురు డాక్టర్ రమాదేవి వారి అమ్మను స్మరించుకొంటూ 11వ మీనాక్షి అమ్మ అవార్డు ప్రదానోత్సవం హైదరాబాద్ రవీంద్రభారతిలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా 'నీలావతి విజయం అను దాదినమ్మ కలాపం' నృత్యరూపక కార్యక్రమాన్ని డా.శృతి చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. దాదినమ్మ కలాపం నృత్యరూపకంలో భాగంగా డాక్టర్ రమాదేవి నడుముకు మంచం కట్టుకొని ప్రదర్శన ఇచ్చి, వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గిరిజా చంద్రన్‌కు మీనాక్షి అవార్డును కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా.రాఘవాచారి, కేంద్ర ఎస్ఎన్ఎ యువ అవార్డు గ్రహీత డా.వసంత్ కిరణ్, కళాకృష్ణ, శృతి చంద్రశేఖర్, డాక్టర్ రమాదేవి ప్రదానం చేసి, అభినందించారు.


## రాజకీయాల్లో బూతు సంస్కృతికి బిజెపియే బీజం

### ఆప్ ప్రధాన అధికార ప్రతినిధి డా.దిడ్డి సుధాకర్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** రాజకీయాల్లో బూతు సంస్కృతికి బిజెపియే బీజం వేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రధాన అధికార ప్రతినిధి డా. దిడ్డి సుధాకర్ విమర్శించారు. గత 12 ఏళ్లుగా భారత రాజకీయాల్లో ద్వేషపూరిత భాష, వ్యక్తిగత దాడులు, సోషల్ మీడియా ట్రోలింగ్, కుటుం బాలపై అసభ్యపదజాలం, ప్రత్యర్థులను దేశ ద్రోహులుగా చిత్రీకరించడం వంటి విష సంస్కృతి కి ప్రోత్సాహం లభించిందని, ఈ పరిస్థితికి ప్రధాన బాధ్యత అధికార పార్టీ బిజెపిదేనన్నారు. శనివా రం హైదరాబాద్ లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాల యంలో ఆయన మాట్లాడారు. దేశ రాజకీయా లను విషపూరితం చేసినవారు సంస్కారం గురించి ఉపన్యాసాలివ్వడం ప్రజలు నమ్మరన్నారు. బిజెపి సోషల్ మీ డియా విభాగం, అనుబంధ సంస్థలు ప్రత్యర్థి పార్టీల నేతలపై, కొంతమంది మహిళలపై, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలపై వ్యక్తిగత దాడులకు పాల్పడిన ఉదాహరణలు దేశ ప్రజలు చూశారని గుర్తుచేశారు. ఇటీవలి ప్రజా ఉద్యమంలో యువత ఆవేశంతో ఉపయోగించిన అసభ్య పదజాలం, వ్యక్తిగత దూషణలు తాను సమర్థించనని, కానీ ఈ అంశాన్ని అడ్డంపెట్టుకొని బిజెపి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. అధికార పార్టీ బిజెపి ముందు మారాలని, అప్పుడే దేశ రాజకీయాల్లో మర్యాద, విలువలు, ప్రజాస్వామ్య సంస్కృతి బలపడతాయని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



### -సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**ప్రజాపక్షం/సనత్‌నగర్:** ప్రజా సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. ఈ మేరకు రాజేశ్వరినగర్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో వివిధ శాఖలకు చెందిన అధికారులు మహేష్, సతీష్, ఆశిష్, శేఖర్, సనత్‌నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, ఇబ్రహీం, పురుషోత్తం, కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సభ్యులు నారాయణ, మహేష్, వాడకట్టు శ్రీకాంత్, శేషు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల సమస్యల పరిష్కారానికి ముందడుగు: సరిత గోగుల

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:**గురుకుల్ కళాశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధులను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సరిత గోగుల అడిగి తెలుసుకున్నారు.కళాశాల చుట్టూ తిరిగి పరిసరాలను పరిశీలించారు.ఎండోమెంట్ శాఖ ఆధీనంలో కొనసాగుతున్నందున ఈ కళాశాలను ప్రభుత్వం ఆధీనంలో తీసుకునే విధంగా మా మంత్రులతో చర్చించి ఈ గురుకుల్ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అవసరమైన ఉపాధ్యాయులను నియమించే విధంగా చూస్తానని ఆమె కోరారు.ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధి ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి కళాశాలకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్,కీసరగుట్ట డైరెక్టర్ సగ్గు అనితశ్రీనివాస్,మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, హనుమంత్ రెడ్డి,కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# 'జలసిరి' విజయానికి గ్రామసభలే కీలకం



**ప్రజాపక్షం/నవాబుపేట్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామసభలు కీలక పాత్ర పోషించాలని అధికారులు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించి, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయడమే జలసిరి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. శనివారం అక్నాపూర్, నరేగూడ, మైతాఫ్ ఖాన్‌గూడ, గుల్లగూడ,గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై విస్తృతంగా చర్చించారు. ఫామ్‌పాండ్లు, బోర్‌వెల్ రీచార్జింగ్ వంటి పనులను చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో జలసిరి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వందశాతం పూర్తి చేయడంలో అక్నాపూర్ గ్రామ సర్పంచ్ అరుణ బందయ్య గౌడ్, నారేగూడ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్, మైతాఫ్ ఖాన్‌గూడ సర్పంచ్ దుర్గయ్య, గుల్లగూడ సర్పంచ్ కవిత కీలక పాత్ర పోషించినట్లు గ్రామసభలో ప్రశంసించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పారిశుద్యం, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, బావులుబోర్ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వీధిదీపాల మరమ్మతులు వంటి అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియ, జలసిరి కార్యక్రమాల ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు వివరించి, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు చంద్రకళ, శోభ, స్వప్న, ఉపసర్పంచ్‌లు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, సంజీవ్‌రావు, జీపీఓలు పరమేష్,రాజు,బిఎల్‌ఓ,బి ఎల్‌ఏ,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా : కొలను కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** పేద ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలను కృష్ణారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లిలో కొలను కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల నుండి పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, యువకులు విచ్చేసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. పుట్టిన రోజు కేక్‌ని కట్ చేసి అందరికి పంచిపెట్టారు. మాజీ కార్పొరేటర్‌లు కొలను వీరేందర్ రెడ్డి, ఆవుల జగన్ యాదవ్, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున విచ్చేసి కృష్ణారెడ్డికి శుభాకాంక్షలను తెలిపారు. అదేవిధంగా ఈ సందర్భంగా కొలను కృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడతానని అన్నారు. తన జీవితాన్ని పేద ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. తన పై ఇంతగా ఆదరాభిమానాలను చూపిస్తున్న ప్రతిఒక్కరికి కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, సతీశ్, విక్రమ్ రెడ్డి, పాల్గొన్నారు.

## గండిమైసమ్మ జంక్షన్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

### గాజులరామారం టీ-జంక్షన్ వద్ద ఫ్రీ లెఫ్ట్ మార్గాల ఏర్పాటు

### పరిశీలించిన శేషాద్రిని రెడ్డి, డిసిపి, సైబరాబాద్ ట్రాఫిక్

**ప్రజాపక్షం/దుండిగల్:**శేషాద్రిని రెడ్డి, ఐ.పి.ఎస్., డి.సి.పి., సైబరాబాద్ ట్రాఫిక్II, వై.వెంకటేశ్వరరావు, ఎ.సి.పి., జీడిమెట్ల ట్రాఫిక్ డివిజన్ గండిమైసమ్మ జంక్షన్ మరియు గాజులరామారం టీజంక్షన్ వద్ద చేపట్టిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా గండిమైసమ్మ జంక్షన్ వద్ద ట్రయల్ రన్‌లో భాగంగా జంక్షన్‌ను సిమెంట్ బ్రిక్స్‌తో తాత్కాలికంగా మూసివేసి, వాహనాల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ యూటర్న్‌లను ఏర్పాటు చేయడం చేశారు. ఐ.డి.పి.ఎల్ మరియు మియాపూర్ వైపు నుండి మేడ్చల్ వైపు వెళ్లే వాహనాలు గండిమైసమ్మలోని యూనివర్సల్ బేకరీ వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ ద్వారా మేడ్చల్ వైపు వెళ్లే విధంగా మార్గం కల్పించారు. అదే విధంగా, ఓ.ఆర్.ఆర్ మరియు మేడ్చల్ వైపు నుండి మియాపూర్ వైపు వెళ్లే వాహనాలు గాయత్రి మెడోస్ వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ ద్వారా మియాపూర్ వైపు వెళ్లే విధంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టడం ఈ మార్పుల ద్వారా గండిమైసమ్మ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గి, వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగడంతో పాటు, పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం అదే విధంగా గాజులరామారం టీజంక్షన్ వద్ద ఫ్రీ లెఫ్ట్ మార్గంలో వాహనాలు ఎలాంటి అంతరాయం లేకుండా వెళ్లేందుకు బ్యారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు, వాహనదారుల అవగాహన కోసం ఫ్రీ లెఫ్ట్ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. వాహనదారుల సౌకర్యం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందనీ అధికారలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా.

భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహారము హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

ఫారం-6

ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్ నెం. G/466/2026, తేదీ: 10.7.2026
ప్రత్యేక ఉపకలెక్టర్ (భూ.సే) జే.ఎల్.ఐ.పి, లేఖ నెం. E/46/2023 తేదీ: 08.7.2026
జిల్లా రాజపత్రం నెం.27/2026 తేదీ: 10.7.2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగులాంబగద్వాల జిల్లా, గట్టు మండలము, మాచర్ల గ్రామము పరిధి నందు ఈ క్రింది షెడ్యూలలో ఉదహరించిన ఎ.23.448 సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా ఎడమ ప్రధాన కాలువ నిమిత్తము జవహార్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా సేకరించవలసిన అవసరము ఉన్నదని జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టం 2016 (యాక్ట్ నెం.21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇచ్చియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్ట్‌కు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధములో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూలు

| క్ర. సం. | సర్వే నెం. / ఎస్.ఓ. నెం. | పట్టా / ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట / తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు / హె.నెం. | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులుగల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు వివరములు | సంఖ్య | నిర్మాణములు వివరములు | సంఖ్య |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 448 | పట్టా | మెట్ట | 1.616 | 1)బోయ అంజనమ్మ W/o ఓరుగు చిన్న తిమ్మప్ప<br>2)వరుగు నర్సప్ప S/o నాగ<br>3) వరుగు సరోజ W/o వర్గు కర్రెప్ప<br>4)బోయ జములమ్మ W/o రాముడు<br>5)M. కృష్ణ S/o M.హనుమంతప్ప<br>6) వరుగు చంద్రయ్య S/o వరుగు కిష్టప్ప<br>7)వరుగు నాగప్ప S/o వరుగు బజారి<br>8)ఈడ్డి నాగరాజు గౌడ్ S/O నర్సింహులు గౌడ్<br>9)M.కృష్ణ S/o M.హనుమంతప్ప<br>10) ఓరుగు అంజనమ్మ W/o ఓరుగు నాగప్ప<br>11)బూరుగు ఈరమ్మ W/o బోరుగు రాగప్ప<br>12) ఓరుగు సరస్వతమ్మ W/o ఓరుగు చంద్రయ్య<br>13)జంగియాటి మీనాక్షి W/o J. భీమేష్<br>14) వరుగు నర్సింహులు S/o వరుగు చంద్రయ్య<br>15) చాకలి రామకృష్ణ S/o తాయప్ప | - | - | - | - | | - | | |
| 2 | 449 | పట్టా | మెట్ట | 2.169 | 1) రాజేంద్రరావు S/o శ్రీనివాసరావు<br>2)కె. రాఘవేంద్రరావు S/o కె.శ్రీనివాసరావు<br>3)పల్నాడు పౌల్ట్రీ ఫామ్ లిమిటెడ్. చైర్మన్ మందపాటి విజయభాస్కర్ రెడ్డి | - | - | - | - | | - | | |
| 3 | 450 | పట్టా ఇనామ్ | మెట్ట | 0.405 | 1)బోయ జంగాటి శంకరమ్మ W/o శీలప్ప<br>2) కుర్వ పెద్ద ఈరన్న S/o చిన్న తాయప్ప<br>3) కుర్వ చిన్న ఈరన్న S/o తాయప్ప<br>4) కుర్వ బట్టలయ్య S/o మల్లయ్య | - | - | - | - | | - | | |
| 4 | 460 | పట్టా | మెట్ట | 4.364 | 1) Md.అలావుద్దీన్ S/o మోదీన్ స<br>2) నర్సన్న S/o బజరన్న<br>3)అలీ S/o హుసేని<br>4)ఖాజా S/o హుసేని<br>5) చిన్న రామన్న S/o హనుమంతు<br>6) శంషాద్ బేగం W/o Md. అలావుద్దీన్ | - | - | - | - | | - | | |
| 5 | 461 | పట్టా | మెట్ట | 1.654 | 1)Md.అలావుద్దీన్ S/o మోదీన్ స<br>2)అలీ S/O హుసేని<br>3)MD. వసీం పాషా S/o Md. అలావుద్దీన్<br>4) ఖాజా S/o హుసేని | - | - | - | - | | - | | |
| 6 | 462 | పట్టా | మెట్ట | 0.072 | 1) కొద్దెడ్డి తిప్పయ్య S/o కొడ్డెడ్డి నర్సప్ప<br>2)కె.సరస్వతి W/o జమ్మన్న<br>3)కొద్దెడ్డి బడేన్న S/o కొడ్డెడ్డి నర్సప్ప<br>4) వి.మధుసూధన్ గౌడ్ S/o నారాయణ గౌడ్<br>5)హరిజన్ ఆనంద్ S/o నాగప్ప<br>6)బుడ్డనరాయల సరోజ W/o బుడ్డనరాయల మల్లేష్<br>7) అంజనమ్మ W/o అర్జునప్ప<br>8)తిమ్మప్ప S/o శ్రీరాములు<br>9) నాగప్ప S/o ముకెన్న<br>10) మల్లేష్ S/o ముకెన్న<br>11)ఈడిగి నాగరాజు గౌడ్ S/o నర్సింహులు గౌడ్<br>12)పెద్ద హనుమంతు S/o ముకెన్న<br>13)H.నరేష్ S/o H.గోపాల్<br>14)కొద్దెడ్డి సుజాత W/o కొడ్డెడ్డి తిమ్మప్ప<br>15)కొద్దెడ్డి సోమయ్య S/o కొడ్డెడ్డి నర్సప్ప<br>16)ఈడ్డి నాగలక్ష్మి W/o వెంకటన్న గౌడ్ | - | - | - | - | | - | | |
| 7 | 463 | పట్టా | మెట్ట | 1.692 | 1) కుర్వ పెద్ద ఈరన్న S/o చిన్న తాయప్ప<br>2) కుర్వ చిన్న ఈరన్న S/o తాయప్ప | - | - | - | - | | - | | |
| 8 | 464 | పట్టా | మెట్ట | 0.082 | 1) నర్సన్న S/O లక్ష్మ య్య<br>2) కుర్వ వేములమ్మ W/o పెద్ద ఈరన్న<br>3) తిమ్మప్ప S/o లక్ష్మ య్య | - | - | - | - | | - | | |
| 9 | 468 | పట్టా | మెట్ట | 0.724 | 1)P.G.పెద్ద భీమన్న S/o గంగన్న<br>2)కుర్వ హేమలత W/o పెద్ద వీరన్న<br>3) హనుమంతు S/o హనుమయ్య<br>4) కుర్వే వేములమ్మ W/o పెద్ద ఈరన్న | - | - | - | - | | - | | |
| 10 | 469 | పట్టా | మెట్ట | 0.709 | 1)P. G. రవిబాబు S/o నేష చిన్న గంగప్ప<br>2)P.G.నాగరాజు S/O చిన్న గంగప్ప<br>3)P.G.చిన్న భీమన్న S/O నేష చిన్న గంగప్ప | - | - | - | - | | - | | |
| 11 | 470 | పట్టా | మెట్ట | 1.025 | 1) వర్గు తిమ్మప్ప S/o సవరన్న<br>2) వర్గు తాయప్ప S/o వర్గు సవరప్ప<br>3)సుజాత ఎదిగి W/o లేట్ ఎల్లా గౌడ్<br>4) నర్సింహులు S/o హుసేనప్ప | - | - | - | - | | - | | |
| 12 | 475 | పట్టా | మెట్ట | 0.627 | 1)బోయ సావిత్రమ్మ W/o బోయ తిమ్మప్ప<br>2)పింజరి చిన్న ఖాజాన్నా S/o రాజసాబ్<br>3) పెద్ద తిమ్మప్ప S/o తిమ్మయ్య<br>4)భీమేశ్వరి @పద్మ W/o బోయ నాగరాజు<br>5)కిస్తప్ప S/o తలారి కర్రెన్న<br>6)బోయ సంధ్య W/O బోయ రాముడు<br>7)బోయ తిమ్మప్ప S/o కిస్తప్ప<br>8) బి.తిమ్మప్ప S/o నర్సింహులు<br>9)కుర్వ లక్ష్మి W/o కుర్వ రాముడు<br>10)మైబు W/o పెద్ద ఖాజా<br>11)పింజరి రంజు బీ W/o పింజరి రాజాసాబ్<br>12)బోయ ఈదమ్మ W/o బోయ తిమ్మప్ప<br>13)పింజరి ఖాసిం S/o పెద్ద ఖాజా సబ్<br>14)పింజరి ఖాజమ్మ W/o పింజరి పెద్ద మౌలా | - | - | - | - | | - | | |
| 13 | 476 | పట్టా | మెట్ట | 2.135 | 1) కుర్వ గోకరమ్మ W/o పెద్ద రాముడు<br>2) కుర్వ శంకరమ్మ W/O కుర్వ కర్రెన్న<br>3) సుజాత W/o ప్రతాప్<br>4) కుర్వ రేవతమ్మ W/o కుర్వ కర్రెప్ప | - | - | - | - | | - | | |
| 14 | 477 | పట్టా | మెట్ట | 3.011 | 1) బి. రాధమ్మ W/o తిమ్మప్ప<br>2) బి. తిమ్మప్ప S/o నర్సింహులు<br>3)శ్రీ రాముడు S/o నర్సప్ప<br>4) రామలింగడు S/o నారప్ప<br>5) నర్సింహులు S/o బి. నర్సప్ప<br>6)చెన్నప్ప S/o నర్సప్ప | - | - | - | - | | - | | |
| 15 | 483 | పట్టా | మెట్ట | 1.479 | 1) ఎం. జ్యోతి, భార్య: ఎం. రామ్ ప్రసాద్ | - | - | - | - | | - | | |
| 16 | 484 | పట్టా | మెట్ట | 0.048 | 1) ప్రభుత్వ భూమి | - | - | - | - | | - | | |
| 17 | 487 | పట్టా | మెట్ట | 1.636 | 1)పరిగి రామి రెడ్డి S/o మునెప్ప<br>2)బి.భాగ్యమ్మ W/o పి.అంజి రెడ్డి<br>3)కుమ్మరి పద్మావతి W/o కుమ్మరి వెంకటస్వామి | - | - | - | - | | - | | |
| విస్తీర్ణము : 23.448 | | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్తాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా గారు, ప్రత్యేక ఉపకలెక్టర్, జె.ఎల్.ఐ.పి, గద్వాల మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికార మివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలో సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్ గారి అనుమతి లేకుండా షెడ్యూల్ లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైనా లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టర్,జె.ఎల్.సి.పి, గద్వాల, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

సం/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, గద్వాల

సం/-
అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జోగులాంబగద్వాల జిల్లా

సం/-
కలెక్టర్ జోగులాంబగద్వాల జిల్లా

DIPR RO NO. 571/LA/PP/Advt/Pub/2026-27

# వాణిజ్య సిలిండర్ ధర రూ. 192 తగ్గింపు

## ఎటిఎఫ్ ధర లీటర్‌కు రూ. 5 పెంపు



**న్యూఢిల్లీ :** హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య సంస్థలు ఉపయోగించే వంట గ్యాస్ ధర తగ్గింది. 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్‌పై రూ. 192 తగ్గిస్తున్నట్లు శనివారం చమురు సంస్థలు ప్రకటించాయి. అయితే అంతర్జాతీయ ధరల పోకడలకు అనుగుణంగా ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ఎటిఎఫ్) ధరను లీటరుకు రూ. 5 పెంచారు. ఫిబ్రవరిలో పశ్చిమాసియా ఘర్షణలు ప్రారంభం కావడంతో సరఫరా అంతరాయాల వల్ల ఇంధన ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం ధరలను కాస్త తగ్గిస్తూ వస్తుంది. జులైలో 19 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధరలను రూ. 183 తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి తగ్గింది. అయితే ఎటిఎఫ్ ధర మాత్రం తాజాగా పెరిగింది. పభుత్వ రంగ చమురు సంస్థల సమాచారం ప్రకారం తాజాగా వాణిజ్య సిలందర్ ధర తగ్గడంతో ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ ధర గతంలో రూ. 2,930 ఉండగా, ఇప్పుడు రూ. 2,738కి తగ్గింది. అదే సమయంలో, ఎటిఎఫ్ ధర లీటరుకు రూ. 110 నుండి రూ. 115కి పెరిగింది. కోల్‌కతా 19 కిలోల గ్యాస్ బండ రూ. 2,872.50 ఉండగా, హైదరాబాద్‌లో రూ. 2,985కి దిగొచ్చింది. జూన్ నెలలో పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ధరలు రికార్డు స్థాయికి చేరిన తర్వాత, జులై 1, ఆగస్టు 1 తేదీలలో కమర్షియల్ ఎల్‌పిజి ధరలలో ఈ రెండు తగ్గింపులు జరిగాయి. ఫిబ్రవరి చివరలో సంఘర్షణ మొదలైన తర్వాత, కమర్షియల్ ఎల్‌పిజి ధరలు 19 కిలోల సిలిండర్‌పై భారీగా రూ. 1,373 పెరిగాయి (ఫిబ్రవరిలో రూ. 1,740.50 నుండి జూన్‌లో రూ. 3,113.50కి). దీనితో పాటు, మార్కెట్ ధర కలిగిన 5 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ. 808.50 నుండి రూ. 762కి తగ్గించారు. అంతర్జాతీయ ధరలు, విదేశీ మారకం రేట్ల ఆధారంగా ప్రతి నెలా మొదటి తేదీన సవరించబడే ఈ ధరలు, వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా రాష్ట్రాల వారీగా మారుతూ ఉంటాయి. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ ఎల్‌పిజి (14.2 కిలోల సిలిండర్) ధర రూ. 942 వద్ద యథాతథంగా ఉంది. డొమెస్టిక్ ఎల్‌పిజి ధరలను చివరిసారిగా జూన్ 7న 14.2 కిలోల సిలిండర్‌పై రూ. 29 మేర పెంచారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల సరఫరాలో అంతరాయాలు, అంతర్జాతీయ ఇంధన ధరల పెరుగుదల కారణంగా మార్చిలో ధరలు రూ. 60 మేర పెరిగాయి. దేశంలోనే అతిపెద్ద చమురు సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ ఎ.ఎస్. సాహ్నీ శుక్రవారం మాట్లాడుతూ, డొమెస్టిక్ ఎల్‌పిజి (14.2 కిలోల సిలిండర్) ధరలు వాస్తవ వ్యయం కంటే చాలా తక్కువగా ఉండటం వల్ల సిలిండర్‌కు రూ. 503 చొప్పున నష్టం వాటిల్లుతోందని తెలిపారు. మే నెలలో లీటరుకు సుమారు రూ. 7.50 చొప్పున పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలలో కూడా ఎటువంటి మార్పు లేదు.

# రూ. 2 లక్షల కోట్లు దాటిన జిఎస్‌టి వసూళ్లు

## జులైలో 15.4 శాతం పెరుగుదల




**న్యూఢిల్లీ :** దేశీయ లావాదేవీలు సహా దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు పెరగడంతో జులైలో స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది జులైతో పోలిస్తే ఈ వసూళ్లు 15.4శాతం ఎక్కువని కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. సిజిఎస్‌టి రూ.39,835 కోట్లు, ఎస్‌జిఎస్‌టి రూ.47,881 కోట్లు, ఐజిఎస్‌టి వసూళ్లు రూ.1,23,000 కోట్లుగా ఉన్నాయి. గతనెలలో రిఫండ్లు 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లకు చేరుకున్నాయి. రిఫండ్లను మినహాయించిన అనంతరం నికర జిఎస్‌టి ఆదాయం 1.81 లక్షల కోట్లుగా ఉంది. జులై నెలలో జిఎస్‌టి కింద నమోదైన ఆదాయం సిజిఎస్‌టి రూ.39,835 కోట్లు ఉండగా, రాష్ట్ర వస్తు, సేవల పన్ను ఎస్‌జిఎస్‌టి రూ.47,881 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజిఎస్‌టి వసూళ్లు రూ.1.23 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. అయితే, ఈ గణాంకాలు దేశవ్యాప్తంగా వ్యాపార కార్యకలాపాలు, అంతర్రాష్ట్ర వాణిజ్యం, దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు మెరుగుపడుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, జులై నెలలో పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం మొత్తం రూ.29,968 కోట్ల రిఫండ్‌లు జారీ చేసింది. ఇది గత ఏడాది జులైతో పోలిస్తే 13.1 శాతం అధికం. అలాగే, రిఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత ప్రభుత్వానికి లభించిన నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లకు పైగా ఉంది. అసెస్‌మెంట్ ఇయర్ 2026–27కు సంబంధించి ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు కూడా భారీ స్థాయిలో నమోదయ్యాయి. జులై 31 నాటికి 5.9 కోట్లకు పైగా ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది.

## విద్యార్థుల నిరసనలపై క్రూరత్వానికి

# మోదీ క్షమాపణ చెప్పాలి

- బాధితుడి పాత్ర పోషిస్తూ ఆనందం పొందుతున్నారు
- రాజకీయ ప్రత్యర్థులపై ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారు
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మండిపాటు



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. తనను దూషించిన యువకులను క్షమించానని చెబుతూ నరేంద్ర మోదీ బాధితుడికి పాత్ర పోషించడంలో ఆనందం పొందుతున్నారని పేర్కొంది. విద్యార్థి నిరసనకారుల పట్ల క్రూరంగా వ్యవహరించడం, పేపర్ లీక్‌ల కారణంగా వారు అనుభవించిన మానసిక క్షోభకు ప్రధానమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ప్రధాన మంత్రి ఇన్‌స్టాగ్రామ్ సభలు తీవ్రమైన ఆత్మవ్యామోహానికి నిదర్శనమని, అవి ఎవరినీ మోసం చేయలేవని కూడా ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. 'శుక్రవారం అర్ధరాత్రి తన స్వార్థాన్ని ప్రదర్శిస్తూ, ప్రధానమంత్రి మన యువతను క్షమించానని అన్నారు. ఇది దేశానికి, ఆయన ప్రభుత్వ హయాంలో బాధపడి, ఆయన నుండి క్షమాపణను న్యాయబద్ధంగా డిమాండ్ చేస్తున్న మన యువతకు అవమానం. ప్రధాన మంత్రి ఇన్‌స్టాగ్రామ్ సభలు ఎవరినీ మోసం చేయలేవు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో, జంతర్ మంతర్ వద్ద తన దివంగత తల్లి కూడా అసభ్యకరమైన దూషణలకు గురయ్యారని తెలిసి తనకు బాధ కలిగిందని మోదీ అన్నారు. మన కుమార్తెలు అలాంటి భాషను ఉపయోగించారని విచారం వ్యక్తం చేస్తూనే, దారితప్పిన పిల్లలను క్షమించాలని ఆయన పిలుపునిచ్చారు. దానిపై జైరామ్ రమేశ్ స్పందిస్తూ తాను జీవసంబంధం లేని ప్రధానమంత్రి అని చెప్పుకునే ఆయన, బాధితుడి పాత్రను పోషించడంలో ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. మోదీ తన పూర్వ ప్రధానులు, రాజకీయ ప్రత్యర్థులపై నీచమైన ద్వేషాన్ని ప్రయోగిస్తారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'వారిని అప్రతిష్టపాలు చేయడానికి ఆయన తన బహిరంగ ప్రసంగాలలోనే కాకుండా పార్లమెంటులోనే తరచుగా అబద్ధాలను ప్రచారం చేస్తారు. పార్లమెంటులోనూ, బయట కూడా ఆయన దుర్భాషలాడే దూషకుల సైన్యాన్ని రంగంలోకి దించి, వారికి పూర్తి రక్షణ కల్పిస్తారు. పేపర్ లీక్‌లతో నిండిన ఎన్‌టిఎ ద్వారా, విద్యార్థి నిరసనకారులపై హోం మంత్రిత్వ శాఖ ఆమోదంతో ఆయన చూపిన క్రూరత్వం ద్వారా లక్షలాది మంది యువతకు కలిగించిన మానసిక క్షోభకు ప్రధాని క్షమాపణ చెప్పాలని యావత్ దేశం కోరుకుంటోంది. 2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో ప్రధాని అట్టహాసంగా ప్రకటించిన రామ మందిర్ ట్రస్ట్ చేసిన 'చందా చోరీ అస్తా ధోకా'కు ఆయన క్షమాపణ చెప్పాలని యావత్ దేశం ఎదురుచూస్తోంది. కోట్లాది మంది జీవనోపాధులను నాశనం చేసి, లక్షలాది ఎంఎస్‌ఎంఇలను మూతపరిచిన 2016 నవంబర్ 8 నాటి ఆయన తుగ్లక్ తరహా నోట్ల రద్దుకు కూడా దేశం ఆయన క్షమాపణను ఇప్పటికీ ఆశిస్తోంది. ఈ జాబితాకు అంతులేదు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

# ఇ–20, శుద్ధ పెట్రోల్ ఎంచుకునే అవకాశమివ్వాలి

## ఈనెల 4న ప్రధాని నివాసం వద్దకు పాదయాత్ర
## ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** పెట్రోల్ బంకుల వద్ద శుద్ధ పెట్రోల్, ఇ–20లలో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రాలు సమర్పించేందుకు ఆగస్టు 4న ప్రధానమంత్రి నివాసం వరకు పాదయాత్ర చేయనున్నట్లు శనివారం ఆయన ప్రకటించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఇ–20 ఇంధనంపై జరిగిన టౌన్ హాల్ తరహా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, సోమవారం మధ్యాహ్నం వినతిపత్రాలు సేకరించి, సుమారు 100 మందితో కలిసి లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని నరేంద్ర మోదీ నివాసం వరకు పాదయాత్రకు నాయకత్వం వహిస్తానని తెలిపారు. పెట్రోల్ స్టేషన్లలో ఇ–20, సాధారణ పెట్రోల్‌లలో ఒకదాన్ని ఎంచుకునే అవకాశాన్ని వినియోగదారులకు కల్పించాలని, ఇ–20 మిశ్రమ పెట్రోల్ ధరలను తగ్గించాలని, పెట్రోల్ ధరలను కూడా తగ్గించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇ–20 వాహనాలకు నష్టం కలిగించదని చెప్పడానికి ప్రభుత్వం ఉదహరించిన నివేదికను బహిరంగపరచాలని కూడా మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రభుత్వాన్ని కోరారు. అధ్యయనాలు జరిగాయని, ఇ–20 వాహనాలకు హాని కలిగించదని కేంద్రం చెబుతోందని, మరి ఆ నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. వివిధ రాష్ట్రాల నుండి ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై, ఇ–20 వినియోగంపై తమ అనుభవాలను, ఆందోళనలను, తమ వాహనాలతో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పంచుకున్నారు.

# కేరళలో భారీ వర్షాలు, వరదలు

- ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో విరిగిపడిన కొండచరియలు
- నలురుగు మృతి, శిథిలాల నుంచి మరికొంత మందిని రక్షించిన దళాలు

**ఇడుక్కి/కొట్టాయం :** కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదలు పోటెత్తాయి. మరోసారి కొండచరియలు విరిగిపడ్డాయి. శనివారం ఇడుక్కి, కొట్టాయంలో కొండచరియలు విరిగిపడడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. శిథిలాల్లో చిక్కుకుకున్న అనేక మందిని రక్షించినట్లు అధికారులు చెప్పారు. మరణించిన వారిలో ఇడుక్కి జిల్లాలోని కుడయత్తూర్ సమీపంలోని అదూర్మల ప్రాంతానికి చెందిన సుమతి (65) ఒకరుగా గుర్తించారు. శనివారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో శిథిలాలు ఆమె ఇంటిని ఢీకొట్టాయని జిల్లా యంత్రాంగం పేర్కొంది. స్థానికులు ఆమె భర్త రవిని, వారి కుమారుడు రతీష్‌ను రక్షించగలిగారు. వారిద్దరికీ గాయాలు కావడంతో తోడుపుజలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో ఆ కుటుంబం ఇల్లు ధ్వంసమైందని అధికారులు తెలిపారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్), అగ్నిమాపక, రక్షణ దళం, పోలీసులు, రెవెన్యూ అధికారుల బృందం చేపట్టిన గాలింపు చర్యల అనంతరం సుమతి మృతదేహాన్ని వెలికితీశారు.



కొట్టాయం జిల్లా పూంజార్‌లోని పయ్యనితోటంలో జరిగిన కొండచరియల విరిగిపడే ఘటనలో ఒక యువకుడు మరణించగా, అతని తల్లి శిథిలాల కింద చిక్కుకుపోయారు. మరణించిన వారిని జానీ కుమారుడు జోసెఫిన్ (24), అతని తల్లి రెజీనా జానీ (46)గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. జోసెఫిన్‌ను రక్షించినప్పటికీ, ఆసుపత్రికి తరలిస్తుండగా అతను గాయాల కారణంగా మరణించాడు. ఉదయం 10:30 గంటల ప్రాంతంలో రెజీనా మృతదేహాన్ని వెలికితీశారు. మరొక ఘటనలో, ఇడుక్కి జిల్లాలోని వాగమన్ ప్రాంతంలో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ప్రభాకరన్ నాయర్ (77) అనే వ్యక్తి మరణించారు. కొట్టాయం జిల్లా వైకోమ్‌కు చెందిన నాయర్, కొండచరియలు విరిగిపడిన సమయంలో తన బంధువుల ఇంటిలోని ఒక పడకగదిలో నిద్రిస్తున్నారని అధికారులు తెలిపారు. గంటల తరబడి సాగిన గాలింపు చర్యల తర్వాత ఆయన మృతదేహాన్ని వెలికితీశారు. ఇడుక్కి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, వరదలు సంభవించినట్లు సమాచారం అందింది.

పుల్లకాయర్ నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో కొక్కయార్ లోలెవల్ క్రాసింగ్ (చప్పత్) నీట మునిగింది. చుట్టుపక్కల ప్రాంతంలో సుమారు ఆరు ఇళ్లు నీట మునిగిపోగా, ప్రభావిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. కొట్టప్పన, వజవార మధ్య రోడ్డుపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే వండిపెరియార్‌లోని చోట్టుపర వాగులో నీటి మట్టం పెరగడంతో జాతీయ రహదారి 183పై నీరు నిలిచిపోయింది. మధ్య కేరళతో పాటు, కొల్లం జిల్లాలోని కొండ ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసినట్లు సమాచారం. అలాగే, కోజికోడ్, మలప్పురం, కన్నూర్, పాలక్కాడ జిల్లాల్లో వరదలు, చిన్నపాటి కొండచరియలు విరిగిపడిన ఘటనలు నమోదయ్యాయి. భారీ వర్షాల కారణంగా నదీ జలాలు పొంగిపొర్లి రావడంతో కోజికోడ్‌లోని ఎంగాపుజ పట్టణం పూర్తిగా నీట మునిగింది. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున వయనాడ్ ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్‌ను నియంత్రించారు. మలప్పురంలో నీటి గుంటలో పడి నాలుగేళ్ల చిన్నారి మరణించింది. కేరళలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### కిశ్త్‌వాడ్‌లో క్లౌడ్‌బరస్ట్..

జమ్ముకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో శనివారం తెల్లవారుజామున మేఘ విస్ఫోటం సంభవించింది. ఆకస్మిక వరదలతో రోడ్లు బురదమయమయ్యాయి. భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడడంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కిశ్త్‌వాడ్, దోడా, రాంబన్ జిల్లాల్లో నదులు పొంగుతుండడంతో పలు వాహనాలు కొట్టుకుపోయాయి. ఈ మూడు జిల్లాలలోని పాఠశాలలను మూసివేసి.. ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నష్టపరిహారం అందిస్తామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించారు. వారం రోజుల పాటు పూంఛ్, కిశ్త్‌వాడ్, జమ్ము, రాంబాన్, ఉధంపూర్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొండచరియల ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. కిశ్త్‌వాడ్, మచైల్ ప్రాంతాల్లో కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు.

## భారత విదేశాంగ విధానం బలోపేతంలో

# దోవల్ కీలకపాత్ర

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా
## జాతీయ భద్రత సలహాదారుకు లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం ప్రదానం




**న్యూఢిల్లీ :** భారత విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్ కీలక పాత్ర పోషించారని, జాతీయ భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయం వెనుక ఆయన పాత్ర, సలహాలు ఉన్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం అన్నారు. ఢిల్లీలో ఎన్ఎస్ఎ దోవల్‌కు 'లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం2026'ను ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని తిలక్ స్మారక్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. పురస్కారం అనంతరం జరిగిన కార్యక్రమంలో షా ప్రసంగించారు. తిలక్ ఆశించిన సాంస్కృతిక జాతీయవాద మార్గంలో భారత్ పయనిస్తోందని, ఆ మార్గం నుండి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని షా స్పష్టం చేశారు. 2014లో బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ తీసుకున్న మొదటి నిర్ణయం అజిత్ దోవల్‌ను ఎన్ఎస్ఎగా నియమించడమేనని షా పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరోలో దోవల్ సుదీర్ఘ సేవా కాలాన్ని ఆయన కొనియాడారు. ఇంటెలిజెన్స్ కార్యకలాపాల స్వభావం దృష్ట్యా దోవల్ చేసిన పనులలో చాలా వరకు ఎప్పటికీ పూర్తిగా బయటపెట్టలేమని షా చెప్పారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం భారత సాయుధ దళాల రక్షణ, దాడి సామర్థ్యాలను సమూలంగా మార్చివేసిందని, ఇందులో దోవల్ గణనీయమైన కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. తిలక్ అందించిన అసమానమైన సేవలను ఆయన కొనియాడారు. **దేశ ప్రయోజనాలకోసం యువత అంకితమవ్వాలి : దోవల్**

వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా నిలిచి, దేశ ప్రయోజనాల కోసం తమను తాము పూర్తిగా అంకితం చేసుకోవాలని అజిత్ దోవల్ దేశ యువతకు పిలుపునిచ్చారు. అలాగే బలమైన దేశాన్ని నిర్మించడానికి భారత్ ముందున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్వేచ్ఛ అంటే తమకు నచ్చినట్లుగా ప్రవర్తించడమేనని నేటి యువత భావించవచ్చని, కానీ వాస్తవం అది కాదని దోవల్ అన్నారు. 'నేటి యువత తమను తాము పూర్తిగా అంకితం చేసుకోవాలి. కేవలం దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తామని భావించాలి. వారు చిన్నపాటి వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలి, ఒకవేళ అటువంటి ఆలోచనలు తలెత్తినా వాటిని విస్మరించాలి' అని ఆయన అన్నారు. భారత దేశం తన చరిత్రలో ఒక కీలక దశలో ఉందని, ప్రస్తుత అవకాశాన్ని చేజారనివ్వకూడదని దోవల్ పేర్కొన్నారు. భారత దేశ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, దేశం తన లక్ష్యంలో విజయం సాధిస్తుందని, చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందన్నారు.

# అభిజీత్ దీప్కేకు అస్వస్థత

**ఛత్రపతి సంభాజీనగర్ :** 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అస్వస్థతకు గురయ్యాడు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఉన్న ఆయన నివాసంలో శనివారం వైద్యులు ఆయనను పరీక్షించి, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీప్కే రక్తపోటు (బిపి) కొంచెం తక్కువగా ఉందని, ఆయన వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. ఉదయం పూట తన నివాసంలోని పార్కింగ్ ప్రాంతంలో ప్రజలను కలుస్తున్నప్పుడు దీప్కే అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 11:45 గంటలకు పార్కింగ్ ప్రాంతంలో తన కోసం వేచి ఉన్న కొందరిని కలిసేందుకు ఆయన కిందకు వచ్చారు. కానీ అశాంతిగా అనిపించడంతో ఇంటి వెనుక భాగానికి వెళ్లారు, అక్కడ ఆయన వాంతి చేసుకున్నారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే, ఆయన వెళ్లిపోయారు. ఆ తర్వాత, ఆయనను పరీక్షించడానికి వైద్యులను పిలిపించినట్లు ఆయన తండ్రి భగవాన్ దీప్కే తెలిపారు. డాక్టర్ విశాల్ లహనే వారి నివాసానికి వచ్చి దీప్కేను పరీక్షించారు.


## ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక చట్ట సవరణ బిల్లుకు

# రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ :** నిందితుల విచారణను వేగవంతం చేయడానికి ప్రతి రాష్ట్రంలోనూ 'ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల'ను ఏర్పాటు చేయడం, ప్రభుత్వ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో శిక్షలను కఠినతరం చేయడం లక్ష్యంగా రూపొందించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఈ వారం ప్రారంభంలో పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026'కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇకపై, ప్రశ్నపత్రాల లీకేజీ కేసులకు సంబంధించిన దర్యాప్తు ప్రక్రియను రెండు నెలల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ లేదా అక్రమ పద్ధతులకు పాల్పడే వ్యక్తులకు కనీసం 5 ఏళ్లు, గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల జరిమానా విధించబడుతుంది. నేరాల విషయంలో, సవరించిన చట్టం కనీసం ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకు జరిమానా విధించాలని ప్రతిపాదిస్తోంది.

BIETE NARSAMPET
Balaji Institute of Elementary Teacher Education
Approved by NCTE & Affiliated to SCERT, Hyd
Laknepally, NARSAMPET, Dist: Warangal - 506 331 (TG)
CONTACT: 9866078590, 7702076967
ADMISSION NOTIFICATION - 2026-27
D.Ed - "B" CATEGORY SEATS PHASE-II
Application forms can be obtained from the College Office or download from the college website www.mcedn.org & email: balajiinstituteofeducation@gmail.com filled in applications along with relevant certificates shall be submitted in the college office on or before 03-08-2026 & 04-08-2026 by 3.00 pm. Registration Fee is Rs. 1000/-, Eligibility and Qualification 50% in Inter / Equivalent Exam & DEECET-.2026 Qualified candidates.
CHAIRMAN

## పాకిస్థాన్ బ్రాడ్ పీక్ హిమపాతంలో
# ప్రసిద్ధ పర్వతారోహకుడు పుర్జా మృతి



కాఠ్మండు:పాకిస్థాన్ కారంకోరంపర్వతాలలోని బ్రాడ్ పీక్ వద్ద సంభవించిన భారీ హిమపాతంలో నేపాల్‌కు చెందిన ప్రసిద్ధ పర్వతారోహకుడు నిర్మల్ పుర్జా (నిర్మల్ నిమ్స్‌దై పుర్జా) సహా పదిమంది పర్వతారోహకులు మరణించారు. ''ఎలైట్ ఎక్స్‌పెడిషన్'' తన సోషల్ మీడియా ఖాతా ద్వారా శనివారం ఈ విషయం ధృవీకరించింది. సాధారణ నడకతో ప్రారంభించి శిఖరాగ్రాలను అందుకున్న పుర్జా ఆ శిఖర కొనల దగ్గరే మరణించారు. ఈ హిమపాతం (అవలాంచీ)లో మరణించిన నలుగురు పర్వతారోహకుల మృతదేహాలను పాకిస్థానీ సహాయ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. కానీ పుర్జా సహా మిగిలిన ఆరుగురు పర్వతారోహకులకోసం గాలింపు చేస్తున్నామని వారు చెబుతున్న నేపథ్యంలో ఎలైట్ ఎక్స్‌పెడిషన్ ఈ విషయం పేర్కొంది. జులై 30వ తేదీన పుర్జాసహా ఆయన బృందం బ్రాడ్ పీక్‌పై ఉన్న సమయంలో హిమపాతం వారిపై విరుచుకుపడింది. ట్రాకింగ్‌లో గమనించినప్పుడు వారున్న ప్రదేశం మారిపోయింది. వారంతా కొండ కిందిభాగానికి కొట్టుకుపోయినట్లు ట్రాకింగ్ డేటా చూపించిందని ఆయన వ్యాపార భాగస్వామి మింగ్మా గ్యాబూ షెర్పా చెప్పారు.సిగ్నల్ ఒకచోట ఆగిపోయిందని, ఆ తర్వాత మళ్ళీ కదలడం ప్రారంభించినట్లు చూపించిందని చెప్పారు.పర్వతారోహణ ప్రపంచంలో నిమ్స్ దాయిగా ఖ్యాతి గాంచిన పుర్జా ప్రాజెక్ట్ పాజిబుల్‌ను పూర్తిచేసి గొప్ప గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రపంచంలో 8000 మీటర్ల కంటే ఎత్తైన పర్వతాలను ఏడు నెలల్లో అధిరోహించాలని 2019లో నిర్దేశించుకుని ఆరునెలల ఆరు రోజుల్లోనే లక్ష్యం పూర్తిచేశారు. అవలీలగా 189 రోజుల్లో 14 పర్వతాలను అధిరోహించి పర్వతారోహణకు, సాహసకృత్యాలకు ఒక సరికొత్త నిర్వచనం చెప్పిన నిర్మల్ నిమ్స్ పుర్జా వయసు 43 సంవత్సరాలు.ఒక మనిషి ఏదైనా సాధించాలని నిర్ణయించుకుంటే చేసి తీరుతాడని పుర్జా ప్రపంచానికి చాటి చెప్పారు. గతంలో ఆయన బ్రిటీష్ ప్రత్యేక దళాలలో పనిచేశారు. పర్వతారోహణలో సరికొత్త అంచులను చూసిన పుర్జా తన శక్తిసామర్థ్యాలు,మనోధైర్యం,నైపుణ్యంతో ప్రపంచదేశాలను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తారు. నేపాల్‌లోని మ్యాగ్డి జిల్లా దానా గ్రామంలో 1985 జులై 25న ఆయన జన్మించారు. బ్రాడ్‌పీక్ సమీపంలో ఉన్నప్పుడే తన జన్మదినం చేసుకున్నారు. తర్వాత ఐదు రోజులకే మరణించారు. ఆయన కుటుంబానికి సుదీర్ఘమైన సైనికసేవా చరిత్ర ఉంది. నేపాల్ గూర్ఖా రెజిమెంట్‌లో ఆయన పనిచేశారు.గూర్ఖా గా ఉండటమే తన కల అని డైరీలో రాసుకున్నారు. 16 సంవత్సరాలు ఆయన సైన్యంలో పనిచేశారు.తీవ్ర శీతలవాతావరణాన్ని జీర్ణించుకుని ఆ వాతావరణంలో పోరాడగల సైనికుడుగా నైపుణ్యం సాధించారు.2012లో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ నుండి ఆయన పర్వతారోహణ చరిత్ర ప్రారంభమైంది.

# హమాస్ నిరాయుధీకరణను గేలి చేసిన ఇజ్రాయెల్




జెరూసలెం:గాజాలో హమాస్ నిరాయుధీకరణ ప్రణాళికను ఇజ్రాయెల్ గేలిచేసింది. హమాస్ ఆమోదించిన నిరాయుధీకరణ ప్రణాళికను తాము సమ్మతించబోమని నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది. హమాస్ పూర్తిగా ఆయుధాలు వదులుకోవాలని అప్పటివరకూ గాజా నుండి వైదొలగేదిలేదని ఇజ్రాయెల్ చెబుతుండగా,గాజా నుండి పూర్తిగా ఖాళీచేసి వెళ్ళిపోవాలని, దాడులు చేయబోమని హామీ ఇవ్వాలని, అప్పుడే ఆయుధాలు వదిలిపెడతామని హమాస్ చెబుతున్నది. తాము నిరాయుధీకరణకు ఒప్పుకున్నామని, ఇక భారం, బాధ్యత అంతా ఇజ్రాయెల్‌దేననీ హమాస్ పేర్కొంది. ఈ పరస్పర అవిశ్వాసాలమధ్య ట్రంప్ గురువారం ఎంతో గర్వంగా గాజా బోర్డ్ ఆఫ్ పీస్‌కు చెందిన హమాస్ నిరాయుధీకరణ ప్రణాళిక పూర్తి పాఠాన్ని విడుదల చేశారు. హమాస్ అంగీకారంతో ఇజ్రాయెల్ చాలా...చాలా సంతోషంగా ఉందని పత్రికాగోష్ఠిలో ట్రంప్ ప్రకటించగానే నవ్వులు వినిపించాయి. హమాస్ నిరాయుధీకరణ ప్రణాళికకు ఒప్పుకున్నట్టు విజయగర్వంతో ఆడంబరంగా ప్రకటించారని,అమలు అవకాశాలు తక్కువేనని విశ్లేషకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రణాళిక అమలు జరిగితే గాజాకు సరిహద్దు ముప్పు తగ్గిపోతుంది. కొత్త భూభాగం కలుస్తుంది. ఐతే గాజా పునర్నిర్మాణానికి ప్రకటించిన 20 సూత్రాల ప్రణాళికను ఇజ్రాయెల్ ఆమోదించకపోతే ట్రంప్ చాలా నిరాశకు గురవుతారని సీనియర్ అమెరికా అధికారి చెప్పారు. గాజా శాంతి మండలి నిరాయుధీకరణ ప్రణాళికను హమాస్ అంగీకరించిందని ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే అమెరికా అధికారి ఈ విషయం చెప్పారు.హమాస్ అంగీకారాన్ని ట్రంప్ చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు.కానీ సంబంధిత భాగస్వాములలో ఏ ఒక్కరికీ విశ్వాసం కనిపించడంలేదన్నదే విశ్లేషకుల ప్రధాన ప్రశ్న. ఇది గాజాలో హమాస్‌తో పాటు అన్ని గ్రూపుల నిరాయుధీకరణకు దారితీస్తుందని, తద్వారా శాశ్వత శాంతి,భద్రతల దిశగా ఒక ముందడుగు అని ట్రంప్ చేసిన ప్రకటనపై నెతన్యాహూ స్వయంగా స్పందించలేదు.హమాస్ ఏదో ఒకరూపంలో దాడులు కొనసాగిస్తుందని ఇజ్రాయెల్, తమ జాతి నిర్మూలనకు ఇజ్రాయెల్ ఊచకోతలు కొనసాగిస్తుందని పాలస్తీనియన్లు అపనమ్మకంతో ఉన్నారు.ఇక్కడ సమస్య మూలాలు పరిష్కారం కాలేదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.ఐక్యరాజ్య సమితి 2803 వ తీర్మానం (2025)ద్వారా ట్రంప్ ప్రతిపాదించిన సమగ్ర శాంతి ప్రణాళిక మార్గనిర్దేశానికి ఒక నిబంధనల చట్రాటన్ని ఏర్పరచింది. ఈ ప్రణాళిక ప్రకారం గాజాలో పౌర పరిపాలన,భద్రతా విధులన్నింటినీ గాజా జాతీయ పరిపాలనా కమిటీ (ఎన్‌సిఎజి)కి స్వాధీనం చెయ్యాలి. దీనిని హమాస్ సహా అన్ని వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఎన్‌సిఎజి స్వతంత్రంగా వ్యవహరించాలని, ఎవ్వరూ జోక్యం చేసుకోకూడదని హమాస్ కోరుతున్నది. ఈ ఎన్‌సిఎజి పరివర్తనకాలంలో తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తుంది. పాలస్తీనా చట్టాలు,అంతర్జాతీయ ప్రమాణాలు,సుపరిపాలనా సూత్రాలకు అనుగుణంగా ఈ కమిటీ పనిచేయాలి. గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యాలను ఎక్కడా ఉనికి జాడ లేకుండా సురక్షితంగా బయటకు సాగనంపాలి.అమెరికా మధ్యవర్తిత్వంలో ఇజ్రాయెల్–గాజా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల తర్వాత ట్రంప్ గాజాలో హమాస్ నిరాయుధీకరణ ప్రణాళిక విడుదల చేశారు.

## ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవి రేసులో
# కోస్టారికా మహిళ రెబెకా ముందంజ



సాన్‌జోస్:ఐక్యరాజ్యసమితి తదపరి ప్రధాన కార్యదర్శి పదవికోసం జరుగుతున్న పోటీలో లాటిన్ అమెరికా దేశం కోస్టారికా మాజీ ఉపాధ్యక్షురాలు రెబెకా గ్రిన్‌స్పాన్ ముందంజలో ఉన్నారు. గయానాకు చెందిన మాజీ విదేశాంగమంత్రి కరోలిన్ రోడ్రిగ్స్ బిర్కెట్ రెండోస్థానంలో ఉన్నారు. దౌత్యవేత్తలు రాయిటర్స్‌కు చెప్పిన సమాచారం ప్రకారం ఈ పదవికోసం ఏడుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. భద్రతామండలిలో అనిధికారికంగా జరిగిన మొదటి పోలింగ్‌లో విచిత్రంగా ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షణ సంస్థ అధిపతిగా ఉన్న రఫేల్ గ్రోస్సీ ఈ రేసులో మూడోస్థానంలోకి వెళ్ళిపోయారు.ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న ఆంటోనీ గుటెర్రెస్ 2026 డిసెంబరు 31వ తేదీన పదవీ విరమణ చేస్తారు.ఈ నేపథ్యంలో కొత్త ప్రధాన కార్యదర్శి కోసం వేట ప్రారంభమైంది. భద్రతా మండలిలో ఉన్న 15 సభ్యదేశాల ప్రతినిధులు రహస్యంగా నిర్వహించిన స్ట్రా పోల్‌లో రెబెకా గ్రిన్‌స్పాన్‌కు పది ప్రోత్సాహక ఓట్లు లభించాయి. సాధారణంగా భద్రతామండలి సిఫార్సు మేరకు జనరల్ అసెంబ్లీ తీర్మానం ద్వారా సమితి ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటారు. భద్రతామండలిలో వీటో అధికారం ఉన్న ఐదు శాశ్వత సభ్య దేశాలలో ఏ ఒక్క దేశం నుండీ ప్రధాన కార్యదర్శి ఎన్నిక కాకూడదు. ఎందుకంటే ఆ పదవికి అభ్యర్థిని సిఫార్సు చేయడంలో ముఖ్యభూమిక ఈ దేశాలకే ఉంటుంది. పైగా అభ్యర్థిని వీటో చేసే అధికారం కూడా ఈ దేశాలకు ఉంది.ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా ఉన్న పోర్చుగీసుకు చెందిన ఆంటోనియో గుటెర్రెస్ ఆ దేశంలోని సోషలిస్టు పార్టీ తరపున ప్రతిపక్ష నాయకుడుగా,సోషలిస్టు ఇంటర్నేషనల్‌కు చెందిన 25 మంది ఉపాధ్యక్షులలో ఒకరుగా ఎన్నికయ్యారు.కోఫీ అన్నన్ పదవీ విరమణ చేసిన తర్వాత 2017 జనవరి 1వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టారు. వరుసగా రెండుసార్లు పదవిలో కొనసాగిన గుటెర్రెస్ మరో ఐదునెలల్లో వైదొలగుతారు.

# వలసల నివారణకు గోడ నిర్మాణం:స్పెయిన్

- మాడ్రిడ్‌లో నిరసన ప్రదర్శనలు
- దాదాపు అంతా వెళ్ళిపోయారు:67కు పెరిగిన మృతుల సంఖ్య




సియూటా:మొరాకో నుండి వేలాదిమంది వలస ప్రజలు ఉప్పెనలాగా స్పెయిన్‌పై విరుచుకుపడటంతో స్పెయిన్ నగరం మాడ్రిడ్‌లో ప్రజలు భారీ సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. సముద్రమార్గంలో ఐదు కిలో మీటర్ల దూరం ఈదుకుంటూ దాదాపు 60,000 మంది వలస ప్రజలు స్పెయిన్ సముద్ర తీరానికి చేరుకుని నగరాల్లోకి ప్రవేశించడాన్ని అంతర్జాతీయ నేరముఠాల దుర్మార్గపూరిత చర్యగా ఆ దేశ ప్రధానమంత్రి సాంఛెజ్ విమర్శించారు. కొన్ని యూరప్ దేశాలు తమకు ప్రతికూలంగా, స్వార్థపూరితంగా స్పందించాయని, విభజనను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడాయని విమర్శించారు. ఈ మేరకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్‌కు ఒక లేఖ రాశారు. ఐతే 48 గంటల్లోనే సరిహద్దుల్లో పరిస్థితులను తాము అదుపులోకి తెచ్చామని పేర్కొన్నారు. 84000 మంది భద్రతా సిబ్బందిని ప్రజల భద్రత కోసం వీధుల్లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జర్మన్ ఛాన్సలర్ మెర్జ్ మాత్రం స్పెయిన్‌కు అనుకూలంగా స్పందించారు. ఇదిలా ఉండగా, వలస ప్రజలను మొరాకో ప్రభుత్వం తిరిగి తీసుకువెళ్ళాలని, దీనిపై స్పందించాలని పలు యూరప్ దేశాలు డిమాండ్ చేశాయి. మరోవైపు ఈ విధంగా అక్రమంగా వచ్చిన వారిలో దాదాపు అందరూ వెనక్కు తిరిగి వెళ్ళిపోయారని అధికారులు చెప్పినట్లు మీడియా వార్తలు వెల్లడించాయి. అదేవిధంగా మొరాకో నుండి ప్రజలు తరలి వచ్చినప్పుడు అనేకమంది సముద్రం మధ్యలోనే మరణించారు. ఈ మృతులసంఖ్య శనివారం నాటికి 67కు చేరుకుంది. కాగా సముద్రమార్గంలో అక్రమంగా ప్రజలు ఈ విధంగా వలసలు రాకుండా అడ్డుకోవడానికి ప్రస్తుతం సముద్రతీరంలో ఉన్న కంచెకు అదనంగా మరో గోడను కూడా నిర్మించాలని స్పెయిన్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. అలలను అడ్డుకోవడానికి ఇప్పటికే కంచెలు నిర్మించారు. అదనంగా గోడలు కడతారు. టీవీలలో ఆ దృశ్యాలను తాను చూశానని, ఆశ్చర్యపోయానని, ఇది ఒక రకంగా మరో పొరుగుదేశంపై దాడితో సమానమైనదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటలీ ప్రధానమంత్రి జార్జియో మెలోనీ స్పందిస్తూ అదంతా చాలా దిగ్భ్రాంతికరంగా ఉందన్నారు.

# అమెరికాకు సహకరిస్తే బూడిదైపోతారు

## ఇరాన్ సైన్యాధిపతి హెచ్చరిక



టెహ్రాన్:పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను అమెరికా పతాకస్థాయికి తీసుకుపోతోందని ఇరాన్ మండిపడింది. అమెరికాకు ఏ దేశం మద్దతు ఇచ్చినాగానీ యుద్ధజ్వాలల్లో దగ్ధమైపోతారని ఇరాన్ సైనిక కేంద్రం కమాండ్ అధిపతి అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు. అమెరికా–ఇజ్రాయెల్ తమపై దాడులు చేస్తే పశ్చిమాసియాలో ఉన్న అమెరికా ఇంధన మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్‌పై చాలా తీవ్రస్థాయిలో దాడి చేస్తామని, పౌర ప్రాంతాలపై కూడా దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరికకు ప్రతిగా అబ్దుల్లాహీ ఈ ప్రకటన చేశారు. ఆయన ప్రకటనను ఇరాన్ మీడియా చదివి వినిపించింది. ఈ సంఘర్షణ సమయంలో అమెరికాకు ఎవరూ సహకరించవద్దని కోరారు. నేరాలు చేస్తూ, దురాక్రమణలకు పాల్పడే అమెరికాకు రక్షణ కవచంగా పనిచేసే ఏ దేశమైనాగానీ యుద్ధ జ్వాలల్లో బూడిదైపోతుందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచి లాభపడాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. హౌతీ తిరుగుబాటు ఉగ్రవాదులనుండి తప్పించుకోవడానికి ఒక కొత్త అంతర్జాతీయ కూటమి ఏర్పాటు చేసేందుకు సౌదీ అరేబియా ఒక కొత్త అంతర్జాతీయ కూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అల్–మానిటర్ చెప్పిన సమాచారం ప్రకారం, ఎర్ర సముద్రంలో నౌకా రవాణా భద్రత,యెమెన్‌కు చెందిన అన్సార్ అల్లాహ్ తిరుగుబాటు ఉద్యమానికి చెందిన హౌతీలను అదుపు చేయడానికి అంతర్జాతీయ కూటమి ఏర్పాటు చేయాలని సౌదీ అరేబియా భావిస్తోంది. ఈజిప్టు, సూడాన్, జిబూటీ, సోమాలియా దేశాలు ఇప్పటికే ఈ కూటమిలో చేరడానికి అంగీకారం తెలియజేశాయి.

# పోటెత్తి శాంతిస్తున్న గోదావరి

- కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- మూసుకుపోయిన రహదారులు
- స్తంభించిన రవాణా
- పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ అంకిత్



ప్రజాపక్షం/భద్రాచలం:భద్రాచలం వద్ద గోదారి పోటెత్తి శాంతిస్తోంది. శనివారం సాయంత్రం నుండి అతిస్వల్పంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం తెల్లవారు ఝామున 2 గం. సమయంలో గోదావరి 53 అడుగులకు చేరుకోవడం అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. శనివారం మధ్యాహ్నం 12 గం.లకు 56.10 అడుగుల వరకు చేరుకుని నాలుగు గంటల పాటు నిలకడగా మారింది. సాయంత్రం 5గం. నుండి క్రమంగా తగ్గుతూ 54.6 అడుగులకు చేరుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి 53 అడుగుల పై బడి వరద ఉండటంతో తుది ప్రమాదహెచ్చరిక కొనసాగుతోంది. ఇది ఆదివారం నాటికి క్రమేపీ తగ్గి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 48 అడుగుల దిగువకు ప్రవహించే అవకాశం ఉన్నట్లు సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. ఎగువ భారీ వర్షాలు కురవడంచో ఇంద్రావతి, ప్రాణహిత ఉప నదులు పొంగటంతో పాటు తాలిపేరు నుండి నీటిని భారీగా గోదావరిలోకి విడుదల చేయడంతో వరద పోటెత్తింది. దీంతో గడిచిన మూడు రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నెమ్మదిగా శాంతిస్తోంది. రాగల రోజుల్లో వర్ష సూచన ఉండటంతో వర్షాలు పడే అవకాశం ఉంది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో కలెక్టర్ అంకిత్ భద్రాచలంలో మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అధికారులను స్వయంగా అప్రమత్తం చేస్తూ లోతట్టు ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ కరకట్ట వద్దకు చేరుకుని వరద ప్రవాహాన్ని గనిస్తున్నారు. మరో ప్రక్క విస్తా కాంప్లెక్స్ స్లూయిస్‌ల వద్ద మురుగునీటిని మోటార్ల సహాయంతో గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు.

**లోతట్టు ప్రాంతాలు జలమయం :** గోదావరి పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చర్ల మండలంలోని తేగడ వద్ద గోదావరి రోడ్డుపైన తిష్టవేసింది. భద్రాచలం సిఆర్‌పిఎఫ్ క్యాంపు సమీపంలోకి వరద నీరు చేరుకుంది. శివారులో కరకట్ట అసంపూర్తిగా ఉండటంతో అటుగా ప్రధాన రహదారిపైకి వరదనీరు ప్రవేశించింది. దుమ్ముగూడెం మండలంలో సున్నంబట్టి గంగోలు తూరుబాక ఏపి ఎటపాక గండాల బూర్గంపాడు మండలంలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం అశ్వాపురం మండలం పరిధిలోని చింతిర్యాల నెల్లిపాక బంజర్ గ్రామాల్లో రోడ్లపైకి గోదావరి చేరింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు రవాణా వ్యవస్థ స్తంభించింది. దుమ్ముగూడెం మండల పరిధిలోని గంగోలు డబుల్ బెడ్రూమ్ కాలనీ ప్రగళ్లపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరద శరణార్థులకు మంచినీరు భోజన అందించాలని, విద్యుత్ సదుపాయం నిరంతరాయంగా ఉండేలా చూడాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారితో కలెక్టర్ మాట్లాడుతూ వరదలు పూర్తి స్థాయిలో సాధారణ స్థితికి వచ్చేంత వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బంది ద్వారా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని గోదావరి నీరు ప్రవహించే ప్రదేశాలు కాలువలు, కుంటల వైపు వెళ్లవద్దని చిన్నపిల్లల పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఉత్తరాంధ్రకు గేట్‌వే

(మొదటి పేజీ తరువాయి)

థింసా నత్యంతో గిన్నిస్ రికార్డు సష్టించడం అమోఘమని, ఇది తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. థింసా నృత్యంలో పాల్గొన్న 13 వేల మందికి పైగా గిరిజన మహిళలకు మోదీ అభినందనలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు నడయాడిన నేల ఇది. గిరిజనుల హక్కుల కోసం అల్లూరి తన ప్రాణాలను అర్పించారని, అల్లూరి పేరుతో భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఉత్తరాంధ్ర యువత అభివద్ధికి ఈ విమానాశ్రయం ఒక రన్ వేలా, ఓ లాంచ్ ప్యాడ్ లా పని చేస్తుందన్నారు. గతంలో విమానాశ్రయాలకు ఒక కుటుంబం పేర్లు మాత్రమే ఉండేవని, కానీ తాము ఆ పద్ధతిని మార్చామని కాంగ్రెస్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శించారు. 2014 వరకు దేశం మొత్తం మీద 74 విమానాశ్రయాలుంటే... ఇప్పుడు 166 విమానాశ్రయాలు ఉన్నాయన్నారుపట్టణాల నుంచి కూడా విమానయాన సేవలు అందుతున్నాయన్నారు. ఉడాన్ పథకం ద్వారా తొలిసారి విమానం ఎక్కే అవకాశం చాలా మందికి లభించిందన్నారు. స్మోక్ ఎయిర్ పోర్టు మోడల్ కాశీ నుంచి అమత్ సర్ వరకు విస్తరించిందన్నారు. కోస్టల్ ఎకానమిక్ కారిడార్ అభివద్ధి చేస్తూ బ్లూ ఎకానమీని బలోపేతం చేస్తున్నామన్నారు. విశాఖ నుంచి కష్ణపట్నం వరకు ఉన్న పాత పోర్టులను ఆధునీకరిస్తున్నామని, వలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులను అభివద్ధి చేస్తున్నామన్నారు. విశాఖరాయపూర్ ఎక్స్ ప్రెస్ వే అభివృద్ధితో పాటు, దాదాపు రూ. 1 లక్ష కోట్ల ఖర్చుతో రైల్వే కనెక్టివిటీ పనులు జరుగుతున్నాయనీ ,వివిధ పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానం చేస్తున్నామని ప్రధాని వివరించారు. పెట్టుబడులు, ఉపాధి, అభివృద్ధి అనే లక్ష్యంతోనే ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని, ఉత్పత్తి పెరిగితే ఎగుమతులు పెరుగుతాయని, ఎగుమతులు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తారిస్తాయని, తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ప్రధాని విశ్లేషించారు. ఇదే అభివృద్ధి నమూనాను ఏపీలో అమలు చేస్తున్నామని పేర్కొంటూ, చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని ప్రధాని మోదీ ప్రశంసించారు.

అంతకుముందు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టుకు భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం అని, ఎర్ర బస్సు రాదన్నారు, కానీ ఎయిర్ బస్ వచ్చిందన్నారు. అవహేళన చేసిన వారు అడ్రస్ లేకుండా పోయారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రకే గర్వకారణం అన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం, రాజధాని అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని, 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేస్తామని , ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తాం అన్నారు. 2028 నాటికి అమరావతి మొదటి దశ పనులను పూర్తి చేసి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మిస్తున్నామని, శంషాబాద్ ఎయిర్ పోర్టుతో తెలంగాణ దశ దిశ మారిందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర దశ దిశ మారుతుందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు నాడు కొబ్బరికాయ కొట్టింది, ఇప్పుడు గుమ్మడి కాయ కట్టిందీ తామేనన్నారు. రెండేళ్లలో ప్రధాని మోదీ సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల పెట్టుబడులు వచ్చాయని, ఇవి పూర్తి అయితే 5.57 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్లు అబ్దుల్ నజీర్ పి. అశోక్ గజపతిరాజు , కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు , భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ అప్పల నాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



కడెం ప్రాజెక్ట్ వద్ద



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద

## నీటి నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి), ఎన్‌డిఎస్‌ఎ అధికారులు కూడా నిపుణుల కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారన్నారు. డిపిఆర్ ప్రకారం షీట్‌పైల్ ఫౌండేషన్ నిర్మించాల్సి ఉండగా స్కాంట్ పైల్ ఫౌండేషన్ నిర్మించారని, మూడు బ్యారేజీల పునాదుల నాణ్యతపై నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారని, 1959లో కడెం ప్రాజెక్టుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిందన్నారు. 2004 జులై 28న దివంగత సిఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు అందిస్తుండగా, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శించారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు గంట గంటకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నీటి పారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికి దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదని విమర్శించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి గత 34 నెలలుగా కాళేశ్వరం మూడు బ్యారేజీల నుంచి ఒక్క చుక్క నీటిని కూడ ఎత్తిపోకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి 340 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు.

**అనవసర రాజకీయాలు సరికాదు! :** శ్రీధర్‌బాబు మంత్రి శ్రీధర్‌బాబు మట్లాడుతూ శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను సందర్శించి ప్రస్తుత జలస్థితిని పరిశీలించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి ఎన్‌డిఎస్‌ఎ అనుమతించలేదని, దీనిపై అనవసర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నీటి తరలింపు పనులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగమేనని, మిడ్ మానేరు, ఫ్లడ్ ఫ్లో కాలువ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించబడినవేనని తెలిపారు.

**నాసిరకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయి! : వివేక్**

మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నాసిరకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయన్నారు. గురుత్వాకర్షణ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉన్నప్పటికి భారీ ఎత్తిపోతల ద్వారా వేల కోట్ల రూపాయల విద్యుత్తు వ్యయం జరిగేలా ప్రాజెక్టు రూపొందించారని విమర్శించారు. నీటిపారుదల రంగంలో తుగ్లక్ నిర్ణయాలతో లక్షల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, గడ్డం వినోద్‌కుమార్, వెడ్మ బొజ్జు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేయాలి**

భవిష్యత్తు తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా నిల్వ చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఇ టీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని సమీక్షించేందుకు మంత్రుల బృందం శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించింది. ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఇడి తెరపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్), ప్రస్తుత ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం, ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలపై కూడా సమగ్ర సమాచారం అందించారు. నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటిమట్టం, నీటి నిల్వ సామర్థ్యం, సిల్టేషన్ సమస్యలు, నీటి పారుదల నిర్వహణపై మంత్రులకు వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగాన్ని శాస్త్రీయంగా నిర్వహిస్తూ సాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రాజెక్టులో సిల్టేషన్ ప్రధాన సమస్యగా మారిందని, సుమారు 7.5 టిఎంసిల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో దాదాపు 50 శాతం వరకు పూడిక పేరుకుపోయినట్లు వివరించారు. దీనివల్ల నిల్వ సామర్థ్యం తగ్గుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. నీటిమట్టం 674–675 మీటర్లకు చేరినప్పుడు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రోజుల్లో నీటి విడుదల చేపట్టే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. పూడిక సమస్యను దశలవారీగా తగ్గించి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

**పంటలకు అవసరమైన రీతిలో నీరు విడుదల**

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టును మంత్రులు మంత్రులు మంత్రుల బృందం ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిలతో సందర్శించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టు అధికారులతో సమీక్ష నిర్వహించి నీటి నిల్వ భవిష్యత్తులో నీటి లభ్యత చేయాల్సిన మరమ్మతులపై చర్చించారు. పంటలకు అవసరమైన రీతిలో నీటి విడుదలకు అవసరమైన ప్రణాళికను త్వరలోనే అందిస్తామని తెలిపారు.

## మారిన మహానగర రూపు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోంది హైడ్రా అని సిఎం పేర్కొన్నారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి సిఎం హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా సిఎం ఒక ట్విట్ చేశారు. చెరువులను పరిరక్షించడమంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదని, భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమని సిఎం పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని సిఎం తెలిపారు.

# బాక్సింగ్‌లో భారత్‌కు పంచా పటాకా

**కామన్వెల్త్ క్రీడల్లో బాక్సింగ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా, అరుంధతి చౌదరి, ప్రియా ఘంఘూస్, సాక్షి చౌదరి**



**గ్లాస్గో:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బాక్సర్లు 5 పసిడి పతకాలు సాధించారు. 70 కిలోల విభాగంలో బాక్సర్ అరుంధతి చౌధరి స్వర్ణం గెలిచింది. బాక్సర్ ప్రియా ఘంఘూస్ మహిళల 60 కిలోల బాక్సింగ్ ఫైనల్ పోరులో అద్భుత ప్రదర్శన చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల 51 కిలోల ఫ్లైవెయిట్ విభాగం ఫైనల్‌లో భారత బాక్సర్ సాక్షి చౌదరి ఇంగ్లండ్‌కు చెందిన రూబీ వైట్‌ను చిత్తు చేసి స్వర్ణ పతకం కైవసం చేసుకుం ది. అంతకుముందు జరిగిన మహిళల బాక్సింగ్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు ప్రీతి పవార్, జైస్మిన్ లాంబోరియా అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాలను ముద్దాడారు. మహిళల 54 కిలోల విభాగం లో ప్రపంచ మూడో ర్యాంకర్ ప్రీతి పవార్ కెనడా కు చెందిన స్కార్లెట్ డెల్గాడోపై 5–0 తేడాతో ఏకపక్ష విజయం సాధించి, భారత్‌కు పసిడి పతకా న్ని అందించింది. అనంతరం జరిగిన 57 కిలోల విభాగంలో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జైస్మిన్ లాంబోరియా 5–0 తేడాతో ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన డిఫెండింగ్ ఛాంపియన్ మైఖేలా వాల్ష్ ను చిత్తు చేసి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. పురుషుల 55 కిలోల బాక్సింగ్ ఫైనల్‌లో భారత బాక్స ర్ జాదుమణి సింగ్ ఆస్ట్రేలియాకు చెందిన జే డిక్సన్ చేతిలో ఓటమి పాలై రజత పతకంతో సరిపెట్టుకున్నాడు.



# పారా షాట్‌పుట్‌లో సోనమ్‌కు స్వర్ణం

*రజతంతో మురిసిన శుభమ్!*

పారా షాట్‌పుట్‌లో సోనమ్ రానా, శుభమ్ జుయల్‌లు తొలి రెండు స్థానాల్లో నిలిచి పసిడి, రజత పతకాలు సాధించారు. శనివారం జరిగిన పురుషుల ఎఫ్ 57 ఫైనల్లో సోనమ్ ఇనుప గుండును ఏకంగా 13.40 మీటర్ల దూరం విసిరి స్వ ర్ణం గెలుపొందాడు. అతడిని అనుసరించిన శుభ మ్ 13.28 మీటర్లతో సిల్వర్ మెడల్ సొంతం చే సుకున్నాడు. గ్లాస్గో ఆతిథ్యమిస్తున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. పదోరోజును బాక్సర్లు ప్రీతి పవార్ , జా స్మినెలు స్వర్ణం ప్రారంభించగా.. ట్రిపుల్ జంప్ లో ప్రవీణ్ చిత్రవేల్, సెల్వ ప్రభు తిరుమరన్‌లు రజతం, కాంస్యం సాధించారు. డెకథ్లాన్‌లో దే శానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్. బాక్సర్ జె డిక్సన్ 55 కిలోల విభాగంలో రజతంతో సరిపెట్టుకున్నాడు. వీరి స్ఫూర్తి తో పారా అథ్లెట్లు సైతం పతకాలు కొల్లగొట్టారు. హోరాహోరీగా సాగిన పారా షాట్‌పుట్ ఫైనల్లో అదరగొట్టిన సోనమ్ రానా, శుభమ్ జుయల్‌లు స్వర్ణ, రజత పతకాలను ఒడిసిపట్టారు. సోనమ్ 13.40 మీటర్లు, శుభమ్ 13.28 మీటర్ల దూరం ఇనుపగుండును విసిరి ప్రథమ, ద్వితీయా స్థానాల్లో నిలిచారు. వీరి కంటే ముందే.. పారా షాట్‌పుట్ మహిళల విభాగంలో 40 ఏళ్ల షర్మిలా ధన్కర్ దేశానికి మొట్టమొదటి పసిడి అందించిన విషయం తెలిసిందే. కామన్వెల్త్ పారా షాట్ పుట్‌లో.. 20 ఏళ్లుగా పతకం కోసం నిరీక్షిస్తున్న భారత అథ్లెట్ల కలను సాకారం చేసింది షర్మిల.

# జావెలిన్ త్రోలో నీరజ్ సిల్వర్.. యశ్వీర్‌కు కాంస్యం




**గ్లాస్గో:** భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు.ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.

# డెకథ్లాన్‌లో తొలి పతకం

ట్రిపుల్ జంప్ క్వాలిఫయింగ్‌లో మెరిసిన ప్రవీణ్ చిత్రవేల్ , సెల్వ ప్రభు తిరుమరన్‌లు ఫైనల్లోనూ సత్తా చాటి పతకాలు సాధించారు. శనివారం జరిగిన ఫైనల్లో ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరం దూకి వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. డెకథ్లాన్‌లో దేశానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్. పోడియం మీద ఈ ముగ్గురూ సగర్వంగా పతకాలు స్వీకరించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు పదో రోజు కూడా పతకాల వేట కొనసాగించారు. బాక్సర్లు ప్రీతి పవర్, జాస్మినె లంబోరియాలు స్వర్ణాలు అందించగా.. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజతం, సెల్వ ప్రభు కాంస్యంతో మెరిశారు. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరంతో వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మొదట 16.05 మీటర్లు దూకిన ప్రవీణ్.. నాలుగో ప్రయత్నంలో 16.58 మీటర్ల మార్క్ అందుకున్నాడు. సెల్వ సైతం 15.87 మీటర్ల నుంచి.. నాలుగో ప్రయత్నంలో 16.52 మీటర్ల దూరంతో కాంస్యం గెలిచాడు.




## భారత స్టాక్ మార్కెట్లకు

# అంతర్జాతీయ పరిణామాలే కీలకం



ఈ నెల 27 నుంచి 31, 2026 వరకు జరిగిన వారపు ట్రేడింగ్‌లోభారత స్టాక్ మార్కెట్లు గణనీయమైన పుంజుకోవడాన్ని నమోదు చేశాయి. 'బుల్‌రన్' కొనసాగడంతో, అంతకుముందు వారం భారీ నష్టాలను ఎదుర్కొన్న మార్కెట్లు ఈ వారం తిరిగి బలాన్ని ప్రదర్శించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో వరుసగా, సెన్సెక్స్ 1,258.86 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 387.65 పాయింట్లు పెరిగింది. దీనికి భిన్నంగా ఈనెల 20 నుంచి 24 వరకు సాగిన గత వారంలో ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,091.77 పాయింట్లు, నిఫ్టీ 566.85 పాయింట్లు నష్టపోయాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా మధ్యప్రాచ్య పరిణామాల కారణంగా ఏర్పడిన అనిశ్చితి నుంచి కొంత ఉపశమనం లభించడంతో ఈ వారం మార్కెట్లలో కొనుగోళ్లకు ఊతం లభించింది. విదేశీ పెట్టుబడిదారుల వైఖరి, ముడి చమురు ధరల కదలిక, అమెరికా మార్కెట్ల పని తీరు వంటి అంశాలు వచ్చే వారం భారత ఈక్విటీ మార్కెట్లకు కీలకంగా మారనున్నాయి. కాగా, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు సంబంధించి హమాస్ తన ఆయుధాలను వదులుకునే ప్రక్రియకు అంగీకరించినట్లు వచ్చిన వార్త అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో సానుకూల భావనను పెంచే అవకాశం ఉంది. గాజా యుద్ధానికి ముగింపు దిశగా అడుగులు పడితే, భౌగోళిక రాజకీయ ప్రమాదాలు తగ్గి పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరగవచ్చు. ముఖ్యంగా యుద్ధ భయాలతో పెరిగిన చమురు ధరలు తగ్గే అవకాశం ఉంటే, చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు అది అనుకూల పరిణామంగా మారుతుంది. అయితే ఈ ఒప్పందం అమలు విషయంలో ఇంకా అనేక అనిశ్చితులు ఉన్నాయి. హమాస్ పూర్తిగా నిరాయుధీకరణకు అంగీకరిస్తుందా, ఇజ్రాయెల్ సైనిక ఉపసంహరణ ఎలా జరుగుతుంది, అంతర్జాతీయ పర్యవేక్షణ ఎంతవరకు విజయవంతమవుతుంది వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపవచ్చు. ఒకవేళ చర్చలు విఫలమైతే, మళ్లీ భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగి మార్కెట్లలో అస్థిరతకు దారితీసే అవకాశం ఉంది. వచ్చే వారంలో భారత మార్కెట్ల దృష్టి ప్రధానంగా కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై సంకేతాలు, రూపాయి మారకం విలువ, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహంపై ఉండనుంది. ఇటీవల భారీ పతనం తర్వాత వచ్చిన ఈ వారం రికవరీ మార్కెట్లో కొనుగోలుదారుల విశ్వాసం కొంత తిరిగి వచ్చిందనే సంకేతాన్ని ఇస్తోంది. మొత్తం మీద, అంతర్జాతీయ పరిణామాలు ఇంకా అనిశ్చితిలోనే ఉండటంతో, వచ్చే వారం మార్కెట్లు పూర్తిగా ఏకపక్షంగా కదిలే అవకాశం తక్కువ. చమురు ధరలు అదుపులో ఉంటే, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు తగ్గితే, విదేశీ పెట్టుబడులు తిరిగి పెరిగితే సెన్సెక్స్, నిఫ్టీ మరింత లాభాలను నమోదు చేసే అవకాశం ఉంది. మరోవైపు ప్రతికూల అంతర్జాతీయ వార్తలు వెలువడితే, ఇటీవల వచ్చిన లాభాలపై మదుపరులు లాభాల స్వీకరణకు దిగే అవకాశం కూడా ఉంటుంది. మొత్తంగా చూస్తే వచ్చే వారం భారత స్టాక్ మార్కెట్లకు అప్రమత్తతతో కూడిన ఆశావహ పరిస్థితులు ఉండవచ్చని అంటున్నారు.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 76,835.78 పాయింట్లు. ముగింపు 78,094.64 పాయింట్లు. లాభం 1,258.86 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) లో నిఫ్టీ:** ప్రారంభం 23,995.95 పాయింట్లు. ముగింపు 24,383.60 పాయింట్లు. లాభం 387.65 పాయింట్లు.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,44,340
22 క్యారెట్లు: రూ. 1,32,340
18 క్యారెట్లు: రూ. 1,08,260
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

# తగ్గిన మారుతి సుజుకి నికర లాభం

## త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన కంపెనీ




దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన మారుతి సుజుకి 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మిశ్రమ ఫలితాలను ప్రకటించింది. కంపెనీ నికర లాభం గత ఏడాదితో పోలిస్తే 11 శాతం తగ్గి రూ.3,352 కోట్లకు చేరింది. ముడి సరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయాలు అధికమై లాభాలపై ఒత్తిడి ఏర్పడింది. అయితే కంపెనీ ఆదాయం మాత్రం బలమైన వృద్ధిని నమోదు చేసింది. త్రైమాసిక ఆదాయం 36 శాతం పెరిగింది. వాహన విక్రయాలు, మార్కెట్ డిమాండ్ మెరుగుపడటం కంపెనీ ఆదాయ వృద్ధికి సహకరించాయి. కానీ ఉక్కు, ఇతర ఆటో భాగాలు వంటి కీలక ముడి పదార్థాల ధరల పెరుగుదల కారణంగా ఆ లాభం పూర్తిగా ప్రతిఫలించలేదు. మారుతి సుజుకి ఫలితాలు ఆటో రంగంలో పెరుగుతున్న పోటీ, ఉత్పత్తి వ్యయాల ఒత్తిడి, వినియోగదారుల డిమాండ్ వంటి అంశాలను ప్రతిబింబిస్తున్నాయి. పెట్టుబడిదారులు లాభాల తగ్గుదలను ప్రతికూలంగా చూసినా, ఆదాయ వృద్ధి కంపెనీ వ్యాపార బలాన్ని సూచిస్తోందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

# 'మెటా'ను ప్రశ్నించనున్న కేంద్రం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టును కొంత కాలం పరిమితం చేసిన ఘటన నేపథ్యంలో, సోషల్ మీడియా దిగ్గజం 'మెటా'ను ప్రశ్నించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మెటా అల్గారిథమ్‌లలో పక్షపాతవైఖరి చూపిస్తున్నదని కేంద్రం భావిస్తుంది. దీనితోపాటు కంటెంట్ నియంత్రణ విధానం, ప్రజా శాంతిభద్రతలపై సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలపైన కూడా మెటా బృందం నుంచి వివరణ కోరనుంది. వచ్చే వారం మెటా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో పాటు పార్లమెంటరీ కమిటీ ముందు కూడా హాజరుకానున్నారు. ఈ ఘటనను మెటా సాంకేతిక లోపంగా పేర్కొని క్షమాపణలు చెప్పినా, ప్రభుత్వం ఆ వివరణను తగినదిగా భావించలేదు. భవిష్యత్తులో ప్రధానమంత్రి, ఇతర ప్రముఖుల ఖాతాల పోస్టులపై అదనపు పర్యవేక్షణ, బహుస్థాయి తనిఖీలు చేపడతామని మెటా తెలిపింది. సోషల్ మీడియా దుర్వినియోగం, తప్పుడు సమాచారం వ్యాప్తి, డిజిటల్ భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## మోదీ కార్మిక వ్యతిరేక విధానాలపై

# ఎదురొడ్డి పోరాడుదాం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ విమర్శించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎఐటియుసి జిల్లా మూడవ మహాసభల్లో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఐటియుసి జిల్లాలో 31 సంఘాలు, 10 రాష్ట్ర సంఘాలతో ఐదు వేల సభ్యత్వాలతో బలమైన యూనియన్‌గా జిల్లాలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. గతంలో పోరాడి సాధించుకున్న అనేక హక్కులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని, 8 గంటల పని విధానం రద్దు చేసి పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తుందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం చివరి అస్త్రంగా సమ్మెలు చేస్తున్నామన్నారు. అయితే సమ్మె చేయడం కూడా చట్టవిరుద్ధంగా ప్రకటించి సమ్మె చేసిన వారిని జైల్లో పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని కార్మిక వర్గాలంతా ఏకం కావాలని నియంతృత్వ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో అందరం పోరాడితేనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారని, దానివల్ల అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని అదేవిధంగా హమాలీ సంక్షేమ బోర్డు, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో కార్మికుల సమస్యలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. పిఎఫ్ మీద ఇఎస్ఐ మీద సీలింగ్ ఎత్తివేయాలని సూచించా రు. ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం కూడా సిఎం రేవంత్ రెడ్డి కార్మికుల స మస్యల మీద ఎటువంటి నిర్ణయాలు తీసుకోవట్లేదన్నారు. వేతనాలు పెంచడం లేదని, గత ప్రభుత్వాలు చేసిన అప్పుల మూలంగా తమ వద్ద నిధులు లేవని చెప్తున్నారన్నారు. అయితే ఉద్యోగ వేతనాల పెంపు, కాంట్రాక్ట్ కార్మికు లు, అంగన్ వాడీలకు, ఆశా వర్కర్లకు కనీస వే తనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి ముందు ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాస్, దూళిపాల ధనుంజయ నాయుడు, దేవరం మల్లేశ్వరి, జడ శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, దంతాల రాంబాబు, బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారామ్, త్రిపురం సుధాకర్ రెడ్డి, నిమ్మల ప్రభాకర్, స్వప్న, కవిత, గోపమ్మ, రాము, ఎడవెల్లి శ్రీకాంత్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల యజమానులపై

# కఠినచర్యలు తీసుకోవాలి

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** హనుమకొండ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి రైతుల దగ్గర నుంచి కనీస మద్దతు ధరకు సేకరించిన వరి ధాన్యాన్ని కొంతమంది రైస్ మిల్లుల యజమానులు వారికి ఉన్న పలుకుబడిని ఆసరా చేసుకుని నొక్కేస్తున్నారని, తక్షణమే జిల్లాలో ఉన్న అన్ని మిల్లులపై విజిలెన్స్ అధికారుల చేత రైడింగ్స్ జరిపించి వరి ధాన్యం నిలువలను, మిల్లు యాజమాన్యం నొక్కేసిన ధాన్యం వివరాలను ప్రజల ముందు ఉంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సమితి కార్యదర్శి కర్రె భిక్షపతి జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. శనివారం పార్టీ జిల్లా నాయకుల బృందంతో వెళ్లి అడిషనల్ కలెక్టర్ రవిని కలిసి సమస్య తీవ్రతను విన్నవించారు. జిల్లాలో 2025–26 ఖరీఫ్ సీజన్‌లో 60 రైస్ మిల్లులు 46వేల 50 మెట్రిక్ టన్నుల విలువైన వరి ధాన్యం సిఎంఆర్ బకాయి ఉన్నారని, రబీ సీజన్‌లో 45 మిల్లులు 10,6336 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పెండింగ్‌లో ఉందని, ఖరీఫ్లో 31 శాతం, రబీలో 62 శాతం సిఎంఆర్ బకాయి మిల్లుల్లో ఉందని, ఈ పెండింగ్ బకాయిగా ఉన్న సిఎంఆర్ విలువ సుమారు 360 కోట్లు చేస్తుందని, ఇంత పెద్ద మొత్తంలో జిల్లాలో మిల్లులు ప్రభుత్వానికి అన్యాయం చేస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్టు అని ఈ సందర్భంగా కర్రె బిక్షపతి జిల్లా అధికారులను ప్రశ్నించారు. తక్షణమే బకాయి ఉన్న మిల్లులన్నింటిని తనిఖీ చేసి రికవరీ చేయాలని, వరి ధాన్యాన్ని అమ్ముకున్న నెల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అమ్ముకున్న ధాన్యానికి ఖరీదు కట్టి వసూలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతాంగం వచ్చీ రాని కాలంతో అవస్థలు పడుతూ తక్కువ దిగుబడితో అప్పుల పాలవుతుండగా తరుగు పేరుతోకొంత, సమయానికి డబ్బులు రాకపోవడం వల్ల మరికొంత ఇలా రకరకాలుగా మోస పోతూనే ఉన్నారని, ప్రభుత్వం కూడా ఈ ప్రజల సొమ్మును మిల్లర్లు తింటుంటే చూస్తూ ఎలా ఊరుకుంటుందని విమర్శించారు. రాబోయే వారం రోజుల్లో జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు బకాయిపడ్డ మొత్తం ధాన్యాన్ని సంబంధించిన వివరాలను ప్రజల ముందు ఉంచాలని లేనియెడల సిపిఐ ఆధ్వర్యంలో ప్రజల్ని రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ సొమ్మును కాపాడడంలో విఫలమవుతున్న సివిల్ సప్లై అధికారుల పైన, మిల్లు యాజమాన్యానికి సహకరిస్తున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ వాస్తవంగా జిల్లాలో నీ మిల్లుల అవకతవకలు జరుగుతున్నాయని, శీఘ్రగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంట పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకటరాజం, జిల్లా సమితి సభ్యులు వేల్పుల సారంగపాణి, నాయకులు ఆలకుంట మల్లయ్య, నోముల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** చట్ట సభలలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి హక్కుల సాధన సమితి మండల మహాసభ శనివారం మోత్కూర్ కెఆర్ భవన్‌లో, దొండ రాములు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభ సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిసిలు అన్ని రంగాలలో ముందు ఉండాలని, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని బిసిలంతా ఐక్యంగా ఉండాలని, బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టాలని, స్థానిక సంస్థలలో ఇచ్చినట్టుగానే బిసి రిజర్వేషన్ చట్టసభలలో కల్పించాలని వారు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా పోచం కన్నయ్య, ఉపాధ్యక్షులుగా దొండ రాములు, ప్రధాన కార్యదర్శిగా, పెండెం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి, అంబటి సోమయ్య, కోశాధికారి తాడూరు లక్ష్మీ నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు అనెపు వెంకట్, చాపల అంజయ్య, దొండ ఎల్లయ్య బి.నర్సయ్య, భువనగిరి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో ఊరూరా నిరసన గళం

ఈనెల 6 నుండి జిల్లాలో ప్రజాచైతన్య యాత్రలు
సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావ్యతిరేక విధానాలపై ఊరూరా నిరసన గళం వినిపిస్తూ ప్రజలను చైతన్య వంతం చేసేందుకు ఈ నెల 6 నుండి వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో యాత్రకు సంబంధించి గోడప్రతులు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వాల్ జరూరీ హై (మార్పు కావాలి) కావాలి నినాదంతో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పాలకులు నిత్యవసరాల ధరలు అదుపు చేయడంలో ఘెరంగా విఫలమయ్యారని, దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు నాణ్యమైన విద్యా, వైద్యం ఉచితంగా అందడం లేదని, పంటలకు కనీస మద్దతు ధర చట్ట బద్దత లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నారు. ఇవిఎంల నిర్వహణపై అనుమనాలు ఉన్నందున భవిష్యత్ ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ అమలుపై కాలయాపన చేయడం, కార్మిక హక్కులను హరించడం దళితులు గిరిజనులపై దాడులు పెరిగిపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. జిల్లాలో ప్రధాన సమస్యలైన పోడుభూములకు పట్టాలు అందక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం సీతారామ జలాలు రైతాంగానికి అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను నిరశిస్తూ నిర్వహించే యాత్రలను జయప్రథం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ ప్రచార యాత్ర

సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామ గ్రామాన తెలియజేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా జరుగు ప్రచార యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ కరీంనగర్ నగర కౌన్సిల్ సమావేశం న్యాలపట్ల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు పర్యాయాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. ఎన్నికలకు ముందు దేశ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమం, సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసి అందులో ఏ ఒక్కటీ అమలు చేయడంలేదని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల భారాన్ని ప్రజలపై వేస్తుందన్నారు.బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే ప్రధాన డిమాండ్‌లతో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రచార యాత్ర నిర్వహిస్తుందని వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్ర జరగనుందని ఈ యాత్రను విజయవంతం చేయడానికి సిపిఐ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున కదలి రావాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశములో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,బీర్ల పద్మ, కొట్టె అంజలి,కసిబోజుల సంతోష్ చారి,సాయవేణి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు .

# రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడంలో యువత కీలక పాత్ర

● పలు రాజకీయ పార్టీల నాయకులు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల గొంతుకగా మీడియా నిర్భయంగా నిలవాలని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడంలో యువత కీలక పాత్ర పోషించాలని పలువురు రాజకీయ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. అధికారాలు శాశ్వతం కావని, రాజ్యాంగమే దేశానికి శాశ్వత మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికలు, ప్రజా ఉద్యమాలు, కొత్త తరం భాగస్వామ్యం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సభలో ముఖ్యఅతిథులుగా టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు (కెటిఆర్), సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ(ఎం) మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం, బిఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, నవ తెలంగాణ సంపాదకులు రాంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ''రాజ్యాంగం–ప్రజాస్వామ్యం–పత్రిక స్వేచ్ఛ'' అంశంపై వారు ప్రసంగించారు. సభకు నవ తెలంగాణ పత్రిక చీఫ్ జనరల్ మేనేజర్ పి.ప్రభాకర్ అధ్యక్షత వహించారు.

**రాజ్యాంగ లక్ష్యాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం: కూనంనేని సాంబశివరావు**

సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం విఫలం కాలేదని, రాజ్యాంగంలో పొందుపరిచిన లక్ష్యాలను అమలు చేయడంలో ప్రభుత్వాలే విఫలమయ్యాయని అన్నారు. రాజ్యాంగం బలంగా ఉంటే ప్రజాస్వామ్యం మరింత పటిష్టంగా ముందుకు సాగుతుందన్నారు. రాజ్యాంగం 'వి ది పీపుల్' అనే భావనతో రూపొందిందని, అది ఏ ఒక్క మతం, కులం లేదా వర్గానికి చెందినదికాదని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సోషలిజం, సెక్యూలరిజం అనే పదాలను తొలగించేందుకు మోదీ సర్కార్ చేసిన ప్రయత్నాలను ప్రజలు అడ్డుకున్నారని గుర్తు చేశారు. దేశంలో ఎన్ని మార్పులొచ్చినా కమ్యూనిజం అజేయంగా నిలబడిందని, ప్రజాస్వామ్య పోరాటాలను ముందుండి నడిపించింది కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టు భావజాలాన్ని అణచివేయడం అసాధ్యమని, కమ్యూనిస్టు ఉద్యమం ప్రజల హక్కుల కోసం నిరంతరం కొనసాగుతుందని ఉంటుందని సాంబశివరావు స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీలకు చెందిన పత్రికలు ప్రజల గొంతుకగా కొనసాగుతున్నాయని, పార్టీ ఆధ్వర్యంలో నడిచే పత్రికలే ఒత్తిడులను తట్టుకుని నిలబడగలవని పేర్కొన్నారు.

**ప్రభుత్వాలు, అధికారాలు శాశ్వతం కాదు...**

**రాజ్యాంగమే శాశ్వతం :మహేష్‌కుమార్ గౌడ్**

ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదనీ, రాజ్యాంగమే శాశ్వతమని, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి రాజకీయ పార్టీ, ప్రజాప్రతినిధి, పౌరుడి బాధ్యత అని టిపిసిసి అధ్యక్షులు, బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం బలంగా ఉంటేనే పత్రికాస్వేచ్ఛ కూడా బలంగా ఉంటుందని చెప్పారు. కార్పొరేట్ గుప్పిట్లోకి మీడియా సంస్థలు వెళ్తే నిజాలు మరుగునపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థతో పాటు పత్రికా రంగం నాలుగు స్తంభాలు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని వివరించారు. ఆపరేషన్ కగార్ గురించి మాట్లాడితే నక్సలైట్లకు మద్దతు ఇస్తున్నానని దేశద్రోహి, శాంతి ప్రగతికి విఘాతం కలిగిస్తున్నారని ప్రచారం చేశారని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. కమ్యూనిజానికి దేశంలో చావు లేదని, కమ్యూనిజం బలపడాలని ఆయన ఆకాంక్షించారు.

**దేశ తలరాతను నిర్ణయించేది జెన్‌జీలే : కెటిఆర్**

కెటిఆర్ మాట్లాడుతూ వచ్చే 2029 ఎన్నికల నాటికి దేశంలో 50 శాతానికి పైగా ఓటర్లు జెన్ జీ యువతేనని, దేశ తలరాతను నిర్ణయించేది వారేనని అన్నారు. మీడియా, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కొత్త తరాన్ని అర్థం చేసుకుని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఉనికి కోసం పోరాడుతుండగా, సోషల్ మీడియా ప్రభావం వేగంగా పెరుగుతోందన్నారు. ఢిల్లీలో ఇటీవల యువత చేపట్టిన ఆందోళనలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా సాగాయని, కొత్త తరానికి దేశం, సమాజం పట్ల అపారమైన కమిట్మెంట్ ఉందని ఆ ఉద్యమం నిరూపించిందన్నారు. ప్రస్తుతం వార్తను వార్తగా రాసే పరిస్థితి లేకుండా పోయిందని, కేంద్రమంత్రి కుమారుడిపై వచ్చిన లైంగిక దాడి ఆరోపణలు, లగచర్ల ఘటన, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అంశాలను ప్రధాన మీడియా నిర్లక్ష్యం చేసిందని అన్నారు.

జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ నిర్వీర్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన ఈ మూడు వ్యవస్థలు, 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టిస్తుందన్నారు. ప్రస్తుత రాజకీయాలు అవినీతిమయమయ్యాయనీ, వేరే పార్టీల్లో ఉన్న అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు బిజెపిలో చేరగానే 'వాషింగ్ పౌడర్ నిర్మా' లాగా మరక(అవినీతి) మాయమవుతుండం విడ్డూరంగా ఉందని చమత్కరించారు.

# సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ



● లక్షలాదిమంది తరలివచ్చి తమ నిరసన గళాన్ని వినిపించాలి : ఇటి నరసింహ్మా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే చారిత్రాత్మక పోరాట కార్యక్రమంలో లక్షలాది ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ్మా పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ ఈ నెల 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీ రామ్ లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు లక్షలాదిమంది తరలివచ్చి తమ నిరసన గాలన్ని వినిపించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం కమతం యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఈటి నరసింహ మాట్లాడుతూ కేంద్రంలో గత 12 ఏళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఇప్పటికే ఎక్కడికక్కడ ఆందోళన కార్యక్రమాలు నిరసనలు పెద్ద ఎత్తున జరుతున్నాయన్నారు. కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి శ్రామికులను మరింత దోచుకునే విధంగా కార్పొరేట్ పెట్టుబడిదారి వర్గాలకు అనుకూలమైన నిర్ణయాలను మోడీ ప్రభుత్వం తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, బి. వెంకటేశం, పడాల నళిని శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, సలీం ఖాన్, షేక్ షంషుద్దీన్, ఉమర్‌ఖాన్‌తోపాటు ప్రజా సంఘాల నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్‌టియు రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ జయలక్ష్మి నే కొనసాగించాలి

● టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌కు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రధాన విశ్వవిద్యాలయాల్లో కీలక పదవుల నియామకాలలో సామాజిక న్యాయం పాటించాలని, జెఎన్‌టియు రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ జయలక్ష్మి ని కొనసాగించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, రెక్టార్, డైరెక్టర్, ప్రిన్సిపల్ వంటి కీలక పోస్టుల్లో జనాభా నిష్పత్తి ప్రకారం 60 శాతం పదవులను బిసిలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కులగణన అనంతరం అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటా కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా, అమలు మాత్రం జరగడం లేదని విమర్శించారు. జెఎన్‌టియు చరిత్రలో 54 ఏళ్ల తర్వాత తొలిసారిగా మహిళకు, అదేవిధంగా బిసి సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ జయలక్ష్మికి రిజిస్ట్రార్‌గా అవకాశం లభించిందని, అయితే బాధ్యతలు చేపట్టిన 45 రోజుల్లోనే ఆమెను ఆ పదవి నుంచి తప్పించేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బిసిల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌తో పాటు బిసి నాయకులు టి.పాండు, ఇంద్రం రజక, గోరిగంటి రమేష్, బండిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మార్కెటింగ్ శాఖ

● మంత్రి తుమ్మల అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ మార్కెట్లలో పూర్తిస్థాయి సాంకేతికరణకు చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమాలకు తావులేకుండా మార్కెటింగ్ శాఖను పారదర్శకంగా తీర్చిదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ పనితీరు, అభివృద్ధి పనులు, డిజిటలీకరణ, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, ఇంజినీరింగ్ పనులు, మార్కెట్ యార్డులలో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, ప్రత్యేక బృందాల తనిఖీలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయి ఆటోమేషన్‌కు గాను ప్రణాళికలు, టెండర్ ప్రక్రియలను ఈనెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు. ప్రతి మార్కెట్ కమిటీలో సిసి కెమెరాలు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, గేట్ ఎంట్రీ ఎగ్జిట్ వ్యవస్థలను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై అనుసంధానం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖలో అమలవుతున్న నంబర్ ప్లేట్ స్కానింగ్ విధానాన్ని మార్కెట్ యార్డుల్లో కూడా అమలు చేసి, ప్రతి వాహనం ప్రవేశం, నిష్క్రమణ, తూకం, లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో నమోదయ్యేలా అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని ఐటీ విభాగానికి సూచించారు. 7 ప్రత్యేక బృందాలు ఈ వారం నిర్వహించిన తనిఖీలపై వచ్చే సోమవారం లోగా నివేదికలనుసమర్పించాలని, వాటి ఆధారంగా మార్కెటింగ్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న పత్తి కొనుగోలు సీజన్‌కు ముందుగానే సమగ్ర సన్నద్ధం కావాలన ఇందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, సంబంధిత అధికారులతో ఆగస్టు మొదటి లేదా రెండో వారంలో సంయుక్త సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.కొత్తగా కొనుగోలు చేసే ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు, లిఫ్టర్లు వంటి పరికరాలను కొనుగోలు చేసే ముందు సాంకేతిక పరీక్షలు నిర్వహించి, అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆయా పరికరాలు నిజంగా అవసరమైన జిల్లాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, ఉపయోగం లేకుండా పరికరాలు కొనుగోలు చేసి మూలన పడేస్తే సంబంధిత కార్యదర్శి, జిల్లా మార్కెటింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మార్కెటింగ్ శాఖలో కొనసాగుతున్న ఇంజినీరింగ్ పనులన్నింటికీ స్పష్టమైన గడువులు నిర్ధారించి, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌరవిద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేయడాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.



# అయోధ్య రామాలయ విరాళాల చోరీపై విహెచ్ వినూత్న నిరసన

● చోరీపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అయోధ్య రామాలయంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, ఈ వ్యవహారంపై సిబిఐతో విచారణ జరిపించాలని రాష్ట్ర బిసి సంక్షేమం, అభివృద్ధి సలహాదారు వి.హనుమంతరావు (విహెచ్) డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో శనివారం విహెచ్ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన విరాళాలు ఎలా చోరీకి గురయ్యాయనే అంశాన్ని నాటక రూపంలో ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరాళాల చోరీ ఘటనతో దేశవ్యాప్తంగా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. ఆలయాల్లో భక్తులు సమర్పించే విరాళాలకు భద్రత లేకుండా పోవడం ఆందోళన కలిగించే విషయమని, ఈ అంశంపై పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపి పప్పు యాదవ్ చేపట్టిన నిరసనను ఆయన అభినందించారు. 'రాముడికే అన్యాయం జరిగిందని, అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించడం లేదని' ఆయన విమర్శించారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి గ్రామ గ్రామాన పర్యటిస్తానని తెలిపారు. ఈ కేసులో సిట్ విచారణపై తమకు నమ్మకం లేదని, సిబిఐతో దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అయోధ్య విరాళాల వ్యవహారంపై దేశవ్యాప్తంగా భక్తులు ప్రశ్నించాలని, ప్రతి ఆలయం ముందు మౌనదీక్షలు చేపట్టాలని విహెచ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వారం రోజులు మోస్తరు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా వచ్చే వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు దాదాపు అన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. అదే సమయంలో, ఆగస్టు 1 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. అయితే ఆగస్టు 6 నుంచి 8వ తేదీ మధ్య ఎలాంటి ప్రత్యేక హెచ్చరికలు లేవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణించే వారు వర్షం, గాలుల తీవ్రతను దృష్టిలో ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

**ఉత్తర, పశ్చిమ, దక్షిణ జిల్లాల్లో లోటు వర్షాలు**

రాష్ట్ర స్థాయిలో చూస్తే, ఆగస్టు సెప్టెంబర్ కలిపి తెలంగాణలో వర్షపాతం సాధారణం నుంచి సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ఉత్తర, పశ్చిమ, దక్షిణ భాగాల్లో వర్షపాతం లోటు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు వెల్లడించారు. అయితే కేవలం ఆగస్టు నెలకు సంబంధించి చూస్తే, తూర్పు, ఈశాన్య, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, మిగిలిన పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

**ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికం**

ఆగస్టు నెలలో పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు రాష్ట్రమంతటా సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలు స్పష్టంగా ఉన్నాయన్నారు. రాత్రివేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే అధికంగా ఉండే అవకాశం ఉందని, దీని వల్ల ఆగస్టు నెలలో సాధారణం కంటే ఎక్కువ ఉక్కపోత, ఉమ్మడి తేమతో కూడిన వాతావరణం నెల కొనవచ్చని వివరించారు.

# మహారాష్ట్ర వరదల వేళ ప్రయాణికులకు అండగా దక్షిణ మధ్య రైల్వే

● మణిక్‌గఢ్‌లో ఐదు రైళ్లకు ప్రత్యేక నిలుపుదల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాజూరా–బల్హార్షా మధ్య రహదారి రాకపోకలు దెబ్బతినడంతో రైలు ప్రయాణంపై ఆధారపడుతున్న ప్రజల కోసం మణిక్‌గఢ్ రైల్వే స్టేషన్‌లో ఐదు రైళ్లకు తాత్కాలికంగా ప్రత్యేక నిలుపుదల కల్పించింది. ఈ ఏర్పాట్లతో 400 మందికి పైగా ప్రయాణికులు బల్హార్షాతోపాటు సమీప ప్రాంతాలకు సురక్షితంగా తమ ప్రయాణాన్ని కొనసాగించే అవకాశం లభించింది. మణిక్‌గఢ్ స్టేషన్‌లో రైల్వే అధికారులు, సిబ్బంది ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ టిక్కెట్ల జారీ, ప్రయాణ మార్గదర్శకత్వం, రైళ్లలో క్రమబద్ధంగా ఎక్కేలా సమన్వయం, ఇతర అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వరదల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

# సైబర్ క్రైమ్ డిసిపిపై వేటు

● డిజిపి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి వి.అరవింద్ బాబును శుక్రవారం సాయంత్రం తన ప్రస్తుత బాధ్యతల నుంచి తప్పిస్తూ.. డిజిపి కార్యాలయాలయంలో రిపోర్టు చేయమని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సైబర్ క్రైమ్‌కు వచ్చిన ఓ ఫిర్యాదుపై డిసిపి స్పందించిన తీరే ఆయనపై వేటు పడిందనే అనుమానాలు కలుగుతున్నాయి.

# క్రీడాకారుల భద్రతకు 'సేఫ్ స్పోర్ట్స్ తెలంగాణ'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో క్రీడాకారులకు సురక్షితమైన, సమ్మిళితమైన క్రీడా వాతావరణం కల్పించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) 'సేఫ్ స్పోర్ట్స్ తెలంగాణ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ క్రీడా విధానం–2025లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడా నిర్వాహకులు, ఇతర భాగస్వామ్య వర్గాలకు క్రీడల్లో భద్రత, వేధింపుల నివారణ, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సంప్రదింపుల సమావేశంలో యునెస్కోకు చెందిన డాక్టర్ శ్రద్ధా చిక్కేరూర్, యుగాంతర్ సంస్థ ప్రతినిధి తేజస్విని మాదభూషి 120 మందికి పైగా కోచ్‌లతో చర్చించారు. క్రీడాకారుల శారీరక, మానసిక సంక్షేమం, లైంగిక వేధింపుల నిరోధం, సురక్షిత క్రీడా సంస్కృతి ఏర్పాటుపై మార్గదర్శకాలు అందించారు. కార్యక్రమంలో సాట్ పరిపాలనా అధికారి అనిత, ఉప సంచాలకుడు అశోక్ కుమార్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, పీఆర్వో సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు. సోమవారం క్రీడా నిర్వాహకులు, ఇతర భాగస్వామ్య వర్గాలతో మరో సంప్రదింపుల సమావేశం నిర్వహించనున్నారు.

# హైడ్రాతో ఉప్పల్ నల్ల చెరువుకు జలకళ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా చేపట్టిన సమగ్ర పునరుద్ధరణ చర్యలతో ఉప్పల్ నల్ల చెరువు మళ్లీ జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో చెరువు నిండుకుండలా మారింది. గతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగుతో నిండిన ఈ చెరువులో దాదాపు 10 ఎకరాల ఆక్రమణలను తొలగించి, 70 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా అభివృద్ధి పనులు చేపడుతోంది. వర్షపు నీరు సాఫీగా వచ్చేలా నాచారం చెరువు పరిసరాల నుంచి రెండు ఇన్‌లెట్ కాలువలను, చెరువు నిండిన తర్వాత నీరు మూసీకి వెళ్లేలా ఔట్‌లెట్‌ను సిద్ధం చేశారు. మురుగు నీరు చెరువులో కలవకుండా బైపాస్ కాలువను ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాలు జలమయం కాకుండా నివారించగలిగారు. కేవలం నీటి నిల్వకే కాకుండా, ప్రజల ఆహ్లాదం కోసం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మెయిన్ బండ్ ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియాలను తీర్చిదిద్దుతున్నారు. త్వరలోనే ఈ చెరువు నగరం నడిబొడ్డున మరో ప్రముఖ పర్యాటక జలవనరుగా అందుబాటులోకి రానుందని హైడ్రా అధికారులు తెలిపారు.

# డిజిటల్ విద్య బలోపేతానికి.. చారిత్రక ఒప్పందం

**హైదరాబాద్:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిజిటల్ విద్య, కృత్రిమ మేధస్సు, బోధనా సిబ్బంది నైపుణ్యాభివృద్ధి రంగాలలో అంతర్జాతీయ సహకారం కోసం కెనడాకు చెందిన 'కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్' (సిఓఎల్) సంస్థతో చారిత్రాత్మక అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. వర్సిటీ వి.సి.ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సిఓఎల్ ప్రెసిడెంట్ అండ్ సిఈఓ ప్రొఫెసర్ పీటర్ స్కాట్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ధోత్రే, ఒయు వి.సి. ప్రొఫెసర్ కుమార్ మొలుగారం తదితరులు పాల్గొన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్ఎంఎస్), ఈబుక్స్, డిజిటల్ కోర్సులు, బిఆర్ఏఓయు టివి, డిజిటల్ రేడియోలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే వర్సిటీలో 'ఏఐ ఇన్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ల్యాబ్'ను ఏర్పాటు చేసి, బహుభాషా అనువాద సాంకేతికతలపై ఉమ్మడి పరిశోధనలు చేపట్టనున్నారు.

**వర్సిటీ చరిత్రలో ఇది గేమ్ఛేంజర్: వీసీ ఘంటా చక్రపాణి**

ఈ ఒప్పందం విశ్వవిద్యాలయ చరిత్రలోనే ఒక 'గేమ్‌చేంజర్' అని వి.సి. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. అంతర్జాతీయ స్థాయి ఏఐ సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల సామాన్యులకు కూడా అందుబాటు ధరల్లో నాణ్యమైన ఉన్నత విద్య అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిఈఓ ప్రొఫెసర్ పీటర్ స్కాట్ మాట్లాడుతూ అంబేద్కర్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్న సమగ్ర డిజిటల్ వ్యవస్థ భవిష్యత్ విద్యకు మోడల్‌గా నిలుస్తుందన్నారు.

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా

● మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ తల్లి పాల వారోత్సవాల ఆగస్టు 17 సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని, పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టాలని, తొలి ఆరు నెలలు కేవలం తల్లి పాలే ఇవ్వాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడి కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగిన గంటలోనే పాలు అందేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ వారోత్సవాలలో భాగస్వాములు కావాలన్నారు.

# రూ.93 లక్షల విలువైన గేదె మాంసం మాయం

● హైదరాబాద్ నుంచి లారీలో ఢిల్లీకి ఎగుమతి

● దారి మళ్లించిన నిందితులు.. ఫిర్యాదు చేస్తే చంపేస్తామంటూ బెదిరింపులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రవాణా కోసం అప్పగించిన రూ.93 లక్షల విలువైన ఫ్రోజన్ బఫెలో మీట్ (గేదె మాంసం) సరుకును గమ్యస్థానానికి చేర్చకుండా లారీని దారి మళ్లించి, సరుకు విడుదల చేయాలంటే రూ.50 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. డబ్బులు ఇవ్వకపోతే సరుకును బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తామని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మహిళా సంఘాలకు భారీ ప్రోత్సాహం



## సమన్వయంతో వందశాతం పూర్తి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజాప్రతినిధులు, బిఎల్ఓలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేసి 100 శాతం ఓటర్ల సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని మాజీ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 36వ వార్డులో జిల్లా కాంగ్రెస్ నాయకులు పారుఖ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటుపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం ఒక మతానికి చెందిన ఓట్లను తీసివేయాలని కుట్రతో సర్ ప్రక్రియను ప్రారంభించిందని ఆరోపించారు. తెలంగాణలో బిజెపి ఆటలను సిఎం రేవంత్ రెడ్డి సాగనివ్వ లేదన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సర్ 100 శాతం పూర్తయిందని పట్టణాల్లో కూడా సంపూర్ణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వల్దాస్ దేవేందర్, నాయకులు పిల్లల రమేష్ నాయుడు, బిఎల్ఓలు, బిఎల్ఏలు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో చిరస్థాయిగా నిలిచిన మల్లమ్మ



**ప్రజాపక్షం/చండూరు:** సిపిఐ మాజీ నాయకులు, బిఆర్ఎస్ చండూరు మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న తల్లి,మాజీ మహిళా నాయకురాలు బొమ్మరబోయిన మల్లమ్మ దశదిన కార్యక్రమం శనివారం కాస్తాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్,సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆది రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్యలు కలిసి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వెంకన్నను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బొమ్మరబోయిన మల్లమ్మ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం అంకితభావంతో పనిచేసిన ఆదర్శ మహిళా నాయకురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నారాయణరావు, పాల్వాయి స్రవంతి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్రం వెంకటరెడ్డి,మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కొరిమిద్దె శ్రీనివాస్, మున్సిపల్ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, జిల్లా యాదయ్య పాల్గొన్నారు.

## అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగామ్‌కు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ నెలలో జిల్లా నుండి 6గురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు / ప్రధానాచార్యులు సత్ సమాన హోదా కలిగిన వారు, స్కూల్ అసిస్టెంట్ / పిజిటి సత్ సమాన హోదా కలిగిన వారు, సెకండరీ ఉపాధ్యాయులు / టిజిటి సత్ సమాన హోదా కలిగిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని 5 రోజుల పాటు ఫిన్లాండ్, సింగపూర్, జపాన్, వియెట్నాం, చైనా దేశాలకు పంపుతూ ఆ దేశ విద్యా విధానంపై అవగాహన పెంపొందించుటకు నిబంధన మేరకు అర్హత గల ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నామన్నారు. కావున జిల్లాలోని అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు సూర్యాపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కోఆర్డినేటర్ హరికృష్ణను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఆంగ్లం, గణితంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి : డిఇఒ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించడమే విద్యాశాఖ ప్రధాన లక్ష్యమని నల్గొండ జిల్లా విద్యాశాఖ అధికారి పి. సుశీందర్ రావు తెలిపారు. ముఖ్యంగా ఆంగ్లం, గణితంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణతో బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం పట్టణంలోని బాకాల్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరు, ఏడు తరగతులకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై కూడా పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఆంగ్లం, గణితంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. మండల విద్యాధికారి ధర్మానాయక్, బాకాల్‌వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కారు-లారీ ఢీ: ఒకరు దుర్మరణం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండల పరిధిలో గల ఎల్లారెడ్డిగూడెం గ్రామ శివారులోని భారత్ పెట్రోల్ బంకు సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరొకరు స్వల్పంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణానికి చెందిన గాదే కళ్యాణ్ రెడ్డి (డ్రైవర్),మారం నరేష్ స్కోడా కారు (టిఎస్ 05 ఎఫ్ఏ4959)లో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు.ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో ఎల్లారెడ్డిగూడెం సమీపంలో ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో కారు అదుపుతప్పి లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు కారు రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గాదే కళ్యాణ్ రెడ్డి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు.కారులో ఉన్న మారం నరేష్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న వెంటనే నార్కట్‌పల్లి ఎస్ఐ పి. విష్ణుమూర్తి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### గ్రామాభివృద్ధికి ప్రజలంతా ఐక్యంగా కృషి చేయాలి

### 15న రూ.7 కోట్ల రుణాలు పంపిణీ

### రైస్ మిల్లులు,గోదాముల ఏర్పాటుకు చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ :**గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. రెండు రోజుల నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నల్లగొండ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలం చిన్నసూరారం గ్రామ హ్యామ్లెట్ అయిన పావురాలగూడెంలో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన పీడబ్ల్యూడీ రహదారిని మంత్రి ప్రారంభించారు. అనంతరం చిన్నసూరారం,పెద్దసూరారం,చందనపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించారు.మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని, చిన్న వ్యాపారాలతో పాటు పారిశ్రామిక రంగంలోనూ మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15న చిన్నసూరారం మహిళా సంఘాలకు రూ.3 కోట్లు, పెద్దసూరారం మహిళా సంఘాలకు రూ.2.50 కోట్లు, చందనపల్లి మహిళా సంఘాలకు రూ.1.50 కోట్ల రుణాల చెక్కులను అందజేయనున్నట్లు ప్రకటించారు. చిన్నసూరారంపెద్దసూరారం గ్రామాల మధ్య రైస్ మిల్ లేదా వేర్‌హౌసింగ్ గోదాం ఏర్పాటు కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పావురాలగూడెంలో చౌకధర దుకాణాన్ని మంజూరు చేయడంతో పాటు వెంటనే డీలర్‌ను నియమించాలని సూచించారు.చందనపల్లి గ్రామ డంపింగ్ యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నామని చెప్పారు. జనావాసాల కు దూరంగా కొత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మోహన్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తి చేసి నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం: మంత్రి కోమటిరెడ్డి**

**ప్రజాపక్షం/తిప్పర్తి :** 2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగ మార్గ నిర్మాణాన్ని పూర్తి చేసి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రోజుల నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం తిప్పర్తి మండలాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. పజ్జూరు గ్రామంలో గ్రామస్తులతో సమావేశమైన ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పజ్జూరుఎర్రగండ్లగూడెం మధ్య రూ.30 కోట్ల వ్యయంతో 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పజ్జూరు గ్రామానికి 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పజ్జూరు గ్రామంలో ఇంకా ఇళ్లు రాని అర్హుల కోసం స్థలాన్ని గుర్తించి అందరికీ ఇళ్ల ను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,నల్గొండ ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్,ఆర్అండ్‌బి ఎస్ఈ మోహన్,ఈఈ శ్రీధర్ రెడ్డి, తిప్పర్తి మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వాలు విఫలం

### ఉపాధి కల్పన పరిశ్రమలు నెలకొల్పాలి : ఏఐవైఎఫ్



**ప్రజాపక్షం/దేవరకొండ:** నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీ, ఉద్యోగ హక్కు కోసం యువత సంఘటితం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు అన్నారు. ఏఐవైఎఫ్ దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము మండల మహాసభ స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు జూలూరు మహేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. మహాసభల సూచికంగా ఏఐవైఎఫ్ జెండాను నల్గొండ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఎగువేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత ఉద్యోగాల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికి నియామకాలు సకాలంలో పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆగస్టు 13న మునుగోడు మండల కేంద్రంలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సెప్టెంబర్ 8, 9, 10తేదిలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రభుత్వ ఖాళీల భర్తీ, యువత హక్కులు తదితర అంశాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు దేవీలాల్, సిపిఐ మండల కార్యదర్శులు వెంకటయ్య, రామాంజనేయులు, నాయకులు వెంగలయ్య, భారీ ములు, డివిజన్ కార్యదర్శి శివకుమార్, నాయకులు రామకృష్ణ, జంగయ్య, రాజు, శివ, అనిల్, సురేష్, బాబు, కొండల్, వెంకట్ పాల్గొన్నారు.

## ఆరు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

### వన మహోత్సవంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 5 నుంచి 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భువనగిరి పట్టణంలో 60 వేల మొక్కలు నాటే లక్ష్యంతో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ల పల్లి శ్రీవాణిరవికుమార్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో పకడ్బందీగా ముస్కాన్ : ఎస్‌పి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్‌ను పకడ్బందిగా నిర్వహించామని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ పూర్తయిన సందర్భంగా బాగా పనిచేసి ఎక్కువ పిల్లలను సంరక్షించడంలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరికి, నిరాదరణకు గురైన బాలబాలికలకు, తప్పిపోయి వచ్చిన బాలలను గుర్తించి సంరక్షించడంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. జిల్లాలో జూలై నెలలో నెలరోజుల పాటు జిల్లా పోలీసు, జిల్లా యంత్రాంగం, జిల్లా సంక్షేమం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్టుమెంట్‌ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా 127 మంది నిరాదరణకు, వెట్టిచాకిరికి గురవుతున్న బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సంరక్షకులకు క్షేమంగా అప్పగించామన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 56 మందిలో బాలురు 52, బాలికలు 4 ఉన్నట్లు చెప్పారు. వీరితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 71 మంది బాలలు ఉండగా వీరిలో 65 మంది బాలురు, 6 గురు బాలికలు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దుంఅలీ, మహిళా ఎస్‌ఐలు మౌనిక, నీలిమ, చైల్డ్ సంరక్షణ అధికారులు శ్రీలక్ష్మి, ఉమామహేశ్వరి, నాగులమీరా, నాగరాజు, వంశీ, విద్యాసాగర్, ముస్కాన్ బృందం పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో జరిగే రాష్ట్ర 3వ మహా సభలను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐవై ఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని యువతరంలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను దేశభక్తిని లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను నైతిక విలువలను పాదుకొల్పడానికి అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం విద్యా, వైద్య వ్యాపారాన్ని అరికట్టాలని అవినీతికి వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాటి ఛార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి అని ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి యువకులపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి అంజద్, అల్లంశెట్టి వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి నయీమ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, పట్టణ కార్యదర్శి మజ్జిగ నరసయ్య, ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు భాషబోయిన నరేందర్, సహాయ కార్యదర్శులు శ్రీరామోజు నవీన్, తాళ్లపల్లి రాజేష్, కాలె మల్లేష్, మారుపాక జ్ఞానేశ్వర్‌పాల్గొన్నారు.



## కట్న వేధింపులు: వివాహిత ఆత్మహత్య

### భర్తతో పాటు ముగ్గురిపై కేసు : ఎస్ఐ విష్ణుమూర్తి



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** కట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఔరవాణి గ్రామానికి చెందిన గుర్రం రాజేశ్వరి (26) శనివారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.2019లో మునుగోడు మండలానికి చెందిన రాజశేఖర్‌తో ఆమె వివాహం జరిగింది.వివాహ సమయంలో నగదు, బంగారం, మోటార్‌సైకిల్‌ను కట్నంగా ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కోసం భర్త రాజశేఖర్,అత్త చంద్రమ్మ,మామ లింగయ్య, నాదిని అరుణ కలిసి ఆమెను వేధించేవారని మృతురాలి తల్లి శివరాత్రి ధనమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్తకు మరో మహిళతో సంబంధం ఉందని ప్రశ్నించినందుకు రాజేశ్వరిని కొట్టి పుట్టింటికి పంపించారని,అలాగే విడాకులు తీసుకుని రెండో పెళ్లి చేసుకుంటా అడ్డొస్తే చంపేస్తా అంటూ ఫోన్‌లో బెదిరించేవాడని ఫిర్యాదులో ఆరోపించారు.శనివారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రాజేశ్వరి ఉరివేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న ఎస్ఐ పి. విష్ణుమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎరువుల దుకాణాల లైసెన్స్‌లు రద్దు

**ప్రజాపక్షం/మోతె:** శనివారం అధిక ధరలకు ఎరువులు, డిఎపి అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి యం. అరుణ చెప్పారు. మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామానికి చెందిన ఫర్టిలైజర్ షాపు యాజమాని పోటు వెంకటేశ్వరరావుకు చెందిన చేను సెలక ఫర్టిలైజర్ షాపు మండల కేంద్రానికి చెందిన శ్రీవెంకటసాయి ఫర్టిలైజర్ ఏజెన్సీ యాజమాని కృష్ణకాంత్ షాపులతో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ధరలకు ఎరువులు, డిఎపిలు అమ్మకాలు జరిపినట్లు అకస్మిక తనిఖీలో వెల్లడికావడంతో ఇద్దరి డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు



**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామ జెడ్పీహెచ్ఎస్ నందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శిరీష ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై,వారికి న్యాయ అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగ విలువలు,ప్రాథమిక విధులు,బాలల హక్కులు,బాలల రక్షణ చట్టాలు,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన,బాలలపై లైంగిక వేధింపుల నివారణకు సంబంధించిన పోక్సో చట్టం, మంచి స్పర్శ చెడు స్పర్శ మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ,ఉచిత న్యాయ సహాయం,న్యాయాన్ని పొందే హక్కు,సైబర్ భద్రతవంటి అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. సరైన సమాధానాలు చెప్పిన వారికి ప్రోత్సాహకంగా పెన్నులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యులు శ్రీశైలం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంతకం ఫోర్జరీ : భూకబ్జాకు యత్నం

### నిందితుడిపై కేసు నమోదు..దర్యాప్తు ప్రారంభం

**ప్రజాపక్షం/మర్రిగూడ :** పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించడం ద్వారా భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన ఘటన మండలంలోని ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో వెలుగుచూసింది.ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే ఖుదాబక్ష్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు సంతకాన్ని గుర్తుతెలియని విధంగా ఫోర్జరీ చేసి,ఇంటి పన్ను రసీదులు,పంచాయతీ ధ్రువీకరణ పత్రాలతో పాటు మరికొన్ని నకిలీ పత్రాలను తయారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈనకిలీ పత్రాల ఆధారంగా గ్రామంలోని 188 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు బొంత మల్లేష్ ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విషయాన్ని గుర్తించిన పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు శనివారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తన సంతకాన్ని దుర్వినియోగం చేసి ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసేలా నకిలీ పత్రాలు సృష్టించారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఫిర్యాదు మేరకు మర్రిగూడ ఎస్ఐ బి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫోర్జరీకి ఉపయోగించిన పత్రాలు, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని వాటి ప్రామాణికతను పరిశీలిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.ప్రభుత్వ పత్రాలు, అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## 'రేపు' సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం ఈ నెల 3వ తేదీ (సోమవారం) ఉదయం 11 గంటలకు నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణతో పాటు పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నాని తాజా చిత్ర 'ది ప్యారడైజ్' ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పాటు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థా యిలో, ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు.

రీల్

## 'మెరుపులే మెరుపులే' సాంగ్ లాంచ్ చేసిన వినాయక్



హీరో హవీష్ కథానాయకుడిగా, దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ' హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా నటిస్తున్నారు. తొలి పాట 'కొంచెం కొంచెం'కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మెరుపులే మెరుపులే సాంగ్ లాంచ్ చేశారు. డైరెక్టర్ వివి వినాయక్ ఈ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వి.వి. వినాయక్ మాట్లాడుతూ: ఇక్కడి ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కేఎల్ యూ నివర్సిటీకి వస్తున్నప్పుడు నాకు రామోజీ ఫిల్మ్ సిటీకి వచ్చిన అనుభూతి కలిగింది. సత్యనారాయణని చూస్తుంటే రామోజీరావుని చూసినట్లే అనిపించింది. ఈ యూనివర్సిటీ ఎంత అద్భుతంగా ఉందో, సినిమా కూడా అంతే బాగుంటుందని నమ్ముతున్నాను. ఆయన తన కుమారుడి కోసం పెట్టుకున్న కలలన్నీ ఈ సినిమాతో నెరవేరాలని కోరుకుంటున్నాను. హవీష్ చాలా పెద్ద కమర్షియల్ హీరో అవ్వాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. త్రినాథరావు నక్కిన తీసిన 'నేను లోకల్', 'సినిమా చూపిస్త మావ' సినిమాలు నాకు చాలా ఇష్టం. హీరో హవీష్, దర్శకుడు త్రినాథరావు నక్కిన, నిర్మాతలు నిఖిల, కాంచన, కావ్యా థాపర్ పాల్గొన్నారు.

## 'సర్దార్ 2' యాక్షన్ టీజర్ రిలీజ్



హీరో కార్తీ తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ 'సర్దార్ 2'తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. తాజాగా రిలీజ్ అయిన యాక్ష న్ టీజర్ ఆకట్టుకుంటోంది. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ కూడా కీలక పాత్రల్లో కనిపించారు. సామ్ సిఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు అదనపు బలం చేకూర్చి, ప్రతి యాక్షన్ బ్లా క్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీ సుకెళ్లింది.ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సహ నిర్మాత ఎ. వెంకటేష్, నిర్మాతలు ఎస్. లక్ష్మ ణ్ కుమార్, ఇషాన్ సక్సేనా సంగీతం సామ్ సిఎస్, డిఒపి జార్జ్ సి విలియమ్స్.



## 6న 'ది ప్యారడైజ్' టీజర్

హీరో నాని తాజా చిత్ర 'ది ప్యారడైజ్' ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పా టు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అం దుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థా యిలో, ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఎల్ఎల్‌వి సినిమాస్ బ్యా నర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తా జాగా ఈ సినిమా టీజర్‌ను ఆగస్టు 6న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ అప్‌డేట్‌తో సినిమాపై నెలకొన్న ఆసక్తి మరింత పెరిగింది. 1 నిమిషం 35 సెకన్ల నిడివి గల ఈ టీజర్‌లో సినిమా వరల్డ్ తో పాటు కథలోని ఎమోషనల్ ఇంటెన్సిటీని చూపించబోతున్నారు. 'ది ప్యారడైజ్' తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ 'బతుకమ్మ'

- రవిబాబు టైం డెడికేషన్ ఉన్న డైరెక్టర్
- జయసుధ పక్కన కూర్చొని విమాన ప్రయాణం జీవితంలో మరచిపోలేను
- 'ప్రజాపక్షం' స్పెషల్ ఇంటర్వ్యూలో నటుడు విజయ్ భాస్కర్

'బతుకమ్మ' సినిమా ప్రతి ఒక్కరికీ గుర్తుంటుంది. ఈ సినిమాలో హీరోగా నటించిన విజయ్ భాస్కర్ కూడా అందరికీ గుర్తుంటాడు. ప్రతి ఒక్క నటుడికి జీవితంలో చెప్పుకోడానికి ఒక సినిమా ఉంటుంది. విజయ్ భాస్కర్ కెరీర్‌లో కూడా బతుకమ్మ అనే సినిమా ఓ టార్నింగ్ పాయింట్. విజయ్ భాస్కర్ కెరీర్ బతుకమ్మకు ముందు బతుకమ్మ తరువాత అనేలా మారిపోయింది. 6టీన్స్ సినిమాలో ఒక హీరోగా చేసిన విజయ్ భాస్కర్ మొదటి సినిమాతో భారీ సక్సెస్ అందుకున్నారు. ఆ తరువాత కొన్ని సినిమాలు చేసినా తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో వచ్చిన బతుకమ్మ సినిమా మాత్రం అతని జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

**ప్రశ్న : సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఎలా జరిగింది ?**

**విజయ్ భాస్కర్:** సినిమా రంగంలో నేను అనుకోకుండా వచ్చాను. అందరిలాగే నేను ప్రయత్నించాను. నువ్వు వాస్తవాన్ని, ఖుషి, మా అన్నయ్య వంటి సినిమాల్లో నటించాను. ఆ తరువాత 6టీన్స్ సినిమాలో ఒక హీరోగా నటించాను. హీరోగా సుమారు ఇరవై సీన్లను, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ముప్ఫై సినిమాల్లో నటించిన. కేవలం ఒక్క తెలుగు సినిమాలే కాదు ... హిందీ, కన్నడ, భోజపూరి, ఒరియా, తమిళ ఇలా నాలుగైదు భాషల్లో సినిమాలు చేశాను. తమిళంలో ప్రకాష్ రాజ్ ప్రొడక్షన్‌లో వచ్చిన తెలుగులో గౌరవం సినిమాలో నటించాను. హిందీలో రెండు సినిమాలు, తమిళంలో మూడు సినిమాలు, కన్నడలో (తెలుగులో ఉల్లాసంగా ఉత్సాహంగా) , నమిత సినిమా చేశాను. భోజ్ పూరిలో ఏకంగా ఇరవై సినిమాలు చేశాను. ఒరియాలో కూడా రెండు సినిమాలు చేసిన. సంబిత్, ఆమ్లా హీరోలతో కలసి పని చేసిన. నేను ఏ భాషలో నటించిన ఆ సినిమా స్క్రిప్ట నేను తెలుగు లో రాసుకుని ప్రాక్టీస్ చేసి చెప్పేవన్నీ. దీంతో కన్నడ లో మాట్లాడితే నన్ను కన్నడ వాడే అనుకునేవాళ్లు. భోజపూరి లో డైలాగులు చెప్తే భోజపూరి అతనే కావచ్చు అనుకునే వాళ్ళు. వాళ్ళ భాషను అంత పర్ఫెక్ట్ గా ప్రాక్టీస్ చేసి చెప్పేవాన్ని .

**ప్రశ్న : 6టెన్స్ సినిమా ఆడియోతో పాటు సినిమా కూడా సూపర్ హిట్ అయింది ? ఎలా అనిపించింది?**

**విజయ్ భాస్కర్ :** 6టీన్స్ సినిమాలో నేను ఒక హీరోగా నటించిన. హీరోగా నటించిన మొదటి సినిమా ఇది. ఈ సినిమా పాటల క్యాసెట్లు లక్షల్లో అమ్ముడు పోయాయి. ఈ సినిమా రిలీజ్ అయినప్పుడు క్యాసెట్స్ ఉన్నాయి కదా ... ఈ క్యాసెట్స్ విపరీతంగా అమ్ముడు పోయాయి. ఏ పాన్ షాప్ లో చూసిన, ఎక్కడ చూసిన 6టీన్స్ పాటలే వినిపించేవి. పాన్ షాపుల్లో నా పాటలు విని ఎంతో హ్యాపీగా అనిపించేంది. నా అదృష్టం కాబోలు నేను హీరోగా నటించిన తొలిచిత్రం 6టీన్స్ ఆడియో సూపర్ హిట్టే, సినిమా కూడా సూపర్ హిట్టే. తరువాత నేను హీరోగా నటించిన బతుకమ్మ సినిమా కూడా ఆడియో సూపర్ హిట్ అయింది. సినిమా కూడా హిట్ అయింది.

**ప్రశ్న : కొన్ని సీరియల్స్ కూడా చేసినట్టున్నారు?**

**విజయ్ భాస్కర్ :** అవును... రాఘవేంద్ర రావు తీసిన కేరాఫ్ అనసూయలో నటించిన. ప్రతిఘటన అనే సీరియల్, రాధమ్మ కూతురు అనే సీరియల్‌లో కూడా నటించా. సీరియల్స్ చెయ్యమని ఇప్పటికీ అవకాశాలు వస్తూనే ఉన్నాయి. కానీ నేనే సినెమాలకే ప్రాధాన్యత ఇస్తున్నాను.



**ప్రశ్న : బతుకమ్మ సినిమాకు ముందు .... తరువాత అంటే మీ కెరీర్ గురించి ఎలా విశ్లేషించుకుంటారు?**

**విజయ్ భాస్కర్ :** బతుకమ్మ సినిమా రిలీజ్ తరువాత నుంచి ఇప్పటి వరకు కూడా బయట ఎవరు చూసినా బతుకమ్మ హీరో కదా అంటుంటారు. బతుకమ్మ తరువాత నాకు ప్రజల్లో మంచి గుర్తింపు లభించింది. బతుకమ్మ పండుగ సమయంలో టీవీల్లో నేను నటించిన బతుకమ్మ సినిమా వస్తుంటే ఇప్పటికీ చాలా మంది టీవీల్లో సినిమా చూస్తూ నాకు ఫొటోస్ షేర్ చేస్తుంటారు. అన్నిటికంటే మరచిపోలేని విషయం, సంతోషకరమైన విషయం ఏమిటంటే బతుకమ్మ సినిమా తరువాత నేను సహజ నటి జయసుధ పక్కనే కూర్చొని విమానంలో ప్రయాణం చేశాను. ముంబై లో ఉన్న కొంతమంది మన తెలుగు వాళ్ళు ప్రతి ఏడాది ఈవెంట్స్ చేస్తుంటారు. అలా బతుకమ్మ రిలీజ్ అయినా తరువాత ముంబై లో జరిగిన ఒక ఈవెంట్‌కు నన్ను కూడా పిలిచారు. అప్పుడు నేను జయసుధపక్కన్నే కూర్చొని విమానంలో ప్రయాణం చెయయడం నేను ఎన్నటికీ మరచిపోలేను. బతుకమ్మ సినిమాకు ఆడిషన్ కు వెళ్ళినప్పుడు డైరెక్టర్ ఫ్రీగా చెయ్యాలి అంటే చెయ్యను అని చెప్పిన. నెలనెలా కిరాయి కట్టాలి ...బతకడానికి ఖర్చుకు ఉంటాయి కాబట్టి ఫ్రీ గా అయితే చెయ్యను అన్నాను. ''పని వచ్చిన వాడే పైసలు అడుగుతాడు '' అని నేను అన్న డైలాగు డైరెక్టర్‌కు బాగా నచ్చి బతుకమ్మ సినిమాలో హీరోగా పెట్టుకున్నాడు. నాకు నెల నెల పదివేల రూపాయలు జీతంలాగా ఇచ్చారు.

**ప్రశ్న : కెరీర్‌లో ఒకటి రెండు సినిమాలు తప్ప పెద్దగా సక్సెస్ లేకపోవడానికి కారణం ?**

**విజయ్ భాస్కర్ :** మహానగరంలో శివ చందు, నిన్నే కోరుకుంటా, ఉడుత ఉడుత ఊచ్ వంటి సినిమాలు చేసిన కానీ అప్పట్లో థియేటర్ లో మాత్రమే రిలీజ్ ఉండేది. సో కొన్ని సినిమాలకు థియేటర్‌లు సరైనవి దొరక్క పోవడం ఒక కారణం కావొచ్చు. నిర్మాతలు కొంతమంది సినిమాను సరిగ్గా ప్రమోషన్ చెయ్యకపోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ధర్మయోధుడి చరిత్ర అనే సినిమా సప్తగిరి థియేటర్లో మూడు వారాలు ఆడింది. అలాంటి దేవుడి పాత్ర పోషించడం, ఆ సినిమా మూడు వారాలు థియేటర్ లో ఆడటం నా అదృష్టం. విక్రమ్ తో కలసి 9 నెలలు సినిమా కూడా చేశాను. తీపిగుర్తు అనే సినిమాలో సీనియర్ కమెడియన్ సుధాకర్ తో కలసి నటించాను.

**ప్రశ్న : ఓల్డ్ ఏజ్ హోమ్ నడుపుతున్నారని విన్నాను?**

**విజయ్ భాస్కర్ :** నేను నడపడం లేదు కానీ ఓల్డ్ ఏజ్ హోమ్ వాళ్లకు సహాయం చేస్తుంటాను. మేము కొంపల్లిలో ఉండేటప్పుడు ''అమావాస్య అన్నదానం'' అనే కార్యక్రమం స్టార్ట్ చేశాము. నేను హైదరాబాద్ బతకడానికి వచ్చినప్పుడు సరిగ్గా తిండి కూడా దొరికేది కాదు. అలాంటి పరిస్థితి నుంచి వచ్చినం కాబట్టి అన్నం విలు వ తెలిసిన వాణ్ణి కాబట్టి కొంపల్లిలో ఈ కార్యక్రమం స్టార్ట్ చే శాం. ఇప్పటికీ ప్రతిఏడాది విజయవంతంగా నడుస్తోంది. వనస్థలిపురంలో ఉండే ఒక ఓల్డ్ ఏజ్ హోమ్ కు సహాయం చేస్తుంటాను. చిరంజీవి బ్లడ బ్యాంక్ లో బ్లడ డొనేషన్ ఇస్తున్నాము. అంతేకాదు చివరి రోజుల్లో ఉన్న వాళ్లకు బెడ్ , తదితరుల వస్తువులు ఉచితం గా అందిస్తుంటాము. ఇలా చేతనైనంత సహాయం చేస్తుంటాను.

**ప్రశ్న : దర్శకుడు రవిబాబు సినిమాలు వరుసగా చేస్తున్నారు. ఆయనకు కోపం ఎక్కువ అంటారు నిజమేనా?**

**విజయ్ భాస్కర్ :** ఫిలిం ఇండస్ట్రీలో చాలా మంది బయట నుంచి విన్నవి , ఎవరో చెప్పినవి మాట్లాడుకుంటారు. కానీ ఎవరితోనైనా కలసి పని చేసినప్పుడే వారి గురించి తెలుస్తుంది . నేను కూడా బయట విన్నాను రవిబాబు కోపిష్టి అని కానీ నేను సెట్స్‌కు వెళ్లిన తరువాత నాకేమి అలా అనిపించలేదు. ఏకంగా ఆయనతో ఇప్పుడు మూడో సినిమా చేస్తున్న. 9 గంటలకు షాట్ తీయాలంటే తొమ్మిదికి తీయాల్సిందే. అది ఆయన డెడికేషన్. టైం సెన్స్ చాలా పాటించే దర్శకుడు రవిబాబు. సెట్ లోకి రాగానే ఫస్ట్ ఫోన్ సైలెంట్ లో పెట్టాలి. ఒక రోజు ముందే స్క్రిప్ట్ ఇచ్చేస్తాడు. మొత్తం ప్రిపేర్ అయి రావాలి. వారం వారం పేమెంట్ ఇచ్చేస్తాడు. ఆయన దగ్గ్గ ఒక సిస్టం ఉంటుంది. ఆ సిస్టం అందరికి మంచిదే. అలా పని చేయడం వాల్ల అందరికి డిసిప్లేన్ వస్తుంది. 'ఏనుగుతొండం ఘటికాచలం' అనే సినిమాలో నను హీరోగా పెట్టి చేశాడు. రేజర్ లో అవకాశం ఇచ్చాడు. ఇప్పుడు రవిబాబుతో మూడో సినిమా చేస్తున్నాను. ఇండస్ట్రీకి వచ్చి ఇరవై ఐదేళ్లు అయింది. అప్పుడు కష్టపడి పని చేశాను కాబట్టే ఇప్పుడు కొంత హ్యాపీగా ఉన్నాను.

## ఆదివాసీ రైతుల భూ సమస్యల పరిష్కారానికి
# ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

కోదండరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదివాసీ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో శనివారం ఆదివాసి న్యాయవాదులతో చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు భూమి సునీల్ కుమార్, రాములు నాయక్, గడుగు గంగాధర్, మరికంటి భవాని రెడ్డి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసి న్యాయవాదులు ఏజెన్సీ ప్రాంతాల్లో ధరణి రికార్డుల్లో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, రైతుల పేర్లలో ఉన్న తప్పిదాల వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్‌కు వివరించారు. భూ రికార్డులపై అవగాహన లేకపోవడం, సవరణ ప్రక్రియపై సరైన సమాచారం అందకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ భారతి చట్టం కింద ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి భూ రికార్డులను సరిచేయాలని సూచించారు. రికార్డులు సక్రమంగా ఉంటేనే రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ఆదివాసి రైతులకు అందుతాయని తెలిపారు.అదే విధంగా పోడు భూముల హక్కులు, రికార్డులు, సాగు సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలని కోరారు. అలాగే 1924 ఏజెన్సీ నియమాల ప్రకారం ఏర్పాటు చేసిన ఏజెన్సీ మొబైల్ కోర్టులు సక్రమంగా పనిచేయకపోవడంతో భూ వివాదాలకు సంబంధించిన అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వేగంగా పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆదివాసి న్యాయవాదులు రైతు కమిషన్ దృష్టికి తీసుకు వచ్చిన అన్ని అంశాలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆధార్ సొసైటీ నాయకులు గోంది వెంకటరమణ, మెట్ల పాపయ్య, జె.జె. రాంబాబు, ఆదివాసి అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు అర్రే పాపారావు, న్యాయవాదులు వాసం ఆనంద్ కుమార్, బట్ట వెంకటేష్, ఎఎస్ఎఫ్ నాయకులు అజయ్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

## ఉక్కుపాదం (మొదటి పేజీ తరువాయి)

అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని, హైకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటికే ఉన్న జాబితానే సమర్పించామని, ఇందుకు విరుద్ధమైన ప్రచారం అసత్యమని కొట్టిపారేశారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా చేపట్టిన రీసర్వేలో ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్ నంబర్ కేటాయిస్తామని, కేవలం 2 శాతం అభ్యంతరాలు మాత్రమే వచ్చాయని వెల్లడించారు. రాష్ట్రంలో 85 వేల ఎకరాల అసైన్డ్ భూములపై త్వరలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కేంద్రం నిధులు విడుదల చేయకపోయినా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఫైనల్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో వర్షపు నీరు కారుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, అయినప్పటికీ వాటికి మరమ్మతులు చేయిస్తామని మంత్రి చెప్పారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత అంచనాలకు మించి 1020 శాతం అధిక ఆదాయం వచ్చిందని, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌ల ఆదాయం రూ.13 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఏడాది రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు.

## చెప్పాలి (మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించని ప్రధాని, విద్యార్థులను క్షమించడం గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని దుయ్యబట్టారు. నీట్ కారణంగా తీవ్ర దుఃఖంలో ఉన్న వారి బంధువులతో గాంధీ మాట్లాడుతూ తమ బిడ్డను కోల్పోయి తల్లిదండ్రులు విలపించడం కంటే బాధాకరమైనది మరొకటి లేదన్నారు. కోల్పోయిన ప్రతి యువ ప్రాణం వెనుక, ఎప్పటికీ వీడని బాధతో సతమతమవుతున్న ఒక కుటుంబం, విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. లీకైన ప్రశ్నపత్రాలు, రద్దయిన పరీక్షలు, సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైందని దుయ్యబట్టారు. 'తమ బిడ్డను కోల్పోయి దుఃఖిస్తున్న ఒక్క కుటుంబాన్నైనా ఆయన కలిశారా? పేపర్ లీక్‌ల వల్ల తమ మొత్తం పొదుపు, జీవితం, సమయం, కలలు అన్నీ కోల్పోయిన వారిని కలిశారా? సమాధానం లేదు! భారతదేశ విద్యార్థులకు ప్రధానమంత్రి క్షమాపణ అవసరం లేదు మోదీజీ వారికి క్షమాపణ చెప్పాలి' అని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో 6,307 మంది చిన్నారుల విముక్తి

1,705 కేసులు నమోదు..
1,710 మంది అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణాపై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్12'లో ఏకంగా 6,307 మంది చిన్నారులను రక్షించి బాలల సంరక్షణలో మరోసారి తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ ఆపరేషన్‌లో 5,041 మంది బాల కార్మికులను విముక్తి చేయడంతో పాటు 1,705 కేసులు నమోదు చేసి, 1,710 మందిని అరెస్టు చేయడం గమనార్హం. జులై 1 నుంచి 31 వరకు మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేశాయి. రాష్ట్రంలోని 124 పోలీసు సబ్ డివిజన్లలో 620 మంది పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు, టీ దుకాణాలు, మాంసం దు కాణాలు, వెల్డింగ్ వర్క్‌షాపులు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రక్షించిన 6,307 మంది చిన్నారుల్లో 5,892 మంది బాలు రు, 415 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 3,447 మం ది తెలంగాణకు చెందినవారు కాగా, 2,860 మంది ఇతర రాష్ట్రాలు, నేపాల్‌కు చెందినవారు ఉన్నారు. మొత్తం 5,041 మంది బాల కార్మికులు, ఒక బానిస కార్మికుడు, 647 మంది వీధి బాలలు, 43 మంది భిక్షాటన చేస్తున్న చిన్నారులు, 11 మంది ఇంటి నుంచి పారిపోయిన చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే డ్రాప్‌అవుట్లు, బాల్య వివాహాలు, అక్రమ దత్తత వంటి ఇతర విభాగాల్లో 563 మంది చిన్నారులను కూడా రక్షించారు.ఆపరేషన్ సందర్భంగా నమోదైన కేసుల్లో 1,989 మంది చిన్నారులు రక్షించగా, కార్మిక శాఖ 1,381 తనిఖీ నివేదికలు జారీ చేసి కనీస వేతనాల చట్టం కింద రూ.37.95 లక్షల జరిమానాలు విధించింది. రక్షించిన చిన్నారుల్లో 5,737 మందిని కుటుంబాలకు అప్పగించగా, మిగిలిన 570 మందిని బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టారు. బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనలో అన్ని ప్రభుత్వ శాఖల సమిష్టి కృషితో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచిందని మహిళా భద్రత విభాగం డైరెక్టర్ చారు సిన్హా తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక ఆపరేషన్లను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com